జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

కృష్ణ | గురువారం 27 ఆగస్టు 2026 | సంపుటి : 01 | సంచిక :224 | పేజీలు : 12 | వెల : 3/- | PRGI No. APTEL/26/A0119,

శ్రీ పరాభవ నామ సంవత్సరం ఆషాఢ మాసం గ్రీష్మ ఋతువు దక్షిణాయణం సూర్యోదయం: 5.42 । సూర్యాస్తమయం: 6.22 చంద్రోదయం: 4.57 । చంద్రాస్తమయం: 5.20 తిథి: బహుళ చతుర్దశి రా. 1.37 వరకు, తదుపరి అమావాస్య నక్షత్రం: పుష్యమి సా. 10.23 వరకు, తదుపరి ఆశ్లేష యోగం: సిద్ధి రా. 8.18 వరకు, తదుపరి వ్యతీపాత కరణం: భద్ర మ. 2.45 వరకు, తదుపరి శకుని రా. 1.37 వరకు, తదుపరి చతుష్పాద

Published from KRISHNA, GUNTOORU, VIJAYAWADA, VISHAKAPATANAM, TIRUPATHI http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com

WANTED

గత 15 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ప్రజల సమస్యలే ధ్యేయంగా పోరాడుతున్న "ప్రజాజ్యోతి" జాతీయ దినపత్రికకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జిల్లా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ ఇంఛార్జీలు మరియు మండల రిపోర్టర్లు కావలెను.

అనుభవం కలిగిన రిపోర్టర్లు మరియు చక్కటి వార్తలు రాయగలిగే కొత్తవారికి కూడా అవకాశం కల్పించబడును.

ప్రజాజ్యోతి

సంప్రదించవలసిన నెంబర్లు

9440231967

## ఐరాస కమిటీ ఆరోపణల్ని ఖండించిన భారత్



- రోహింగ్యా, మైనార్టీ హక్కుల నివేదికపై తీవ్ర ఆగ్రహం!
- ఐక్యరాజ్యసమితి రిపోర్టులోని ఆరోపణల్ని ఖండించిన భారత విదేశాంగ శాఖ
- అది రాజకీయ ప్రేరేపిత రిపోర్ట్ అని ఆగ్రహం
- భారత్ అన్ని వర్గాల రక్షణకు కట్టుబడి ఉందని స్పష్టం
- కమిటీ ఆరోపణల్ని ఇదివరకే ఖండించిన తుషార్ మెహతా బృందం!

## రైలు ప్రయాణికులకు గుడ్‌న్యూస్



- ఈ రద్దీ రూట్లలో 11 వేల కిలోమీటర్ల మేర 'ఫోర్ ట్రాక్' లైన్లు
- కేంద్రం మాస్టర్ ప్లాన్!
- దేశంలో హై-డెన్సిటీ రైల్వే నెట్‌వర్క్‌ను 4 లైన్లుగా విస్తరణ
- ప్రణాళికను సిద్ధం చేశామన్న రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్
- భవిష్యత్తులో ప్రయాణికుల రద్దీ, గూడ్స్ రవాణా కు ఈ విస్తరణ కీలకమన్న మంత్రి



## నేపాల్ ప్రధాని బాలెన్ షాతో మాట్లాడిన మోదీ

- మానవతాసాయం చేస్తామని హామీ
- నేపాల్‌లో మెరుపు వరదలు
- 105 మంది భారతీయులతో సహా 400 మంది మిస్సింగ్
- నేపాల్ ప్రధాని బాలేంద్ర షాకు ఫోన్ చేసిన ప్రధాని మోదీ



# రాయలసీమకు జగన్ ఏం చేశారు?

- మంత్రి నిమ్మల సూటి ప్రశ్న
- ఐదేళ్లలో రాయలసీమకు జగన్ చేసిందేమీ లేదని మంత్రి నిమ్మల విమర్శ
- గొడ్డలి పార్టీ నేతకు ప్రాజెక్టులపై అవగాహన శూన్యమని ఎద్దేవా
- శ్రీశైలం, తుంగభద్ర, గోరుకల్లు మరమ్మతులను జగన్ ప్రభుత్వం పట్టించుకోలేదు
- సీమకు ఏ ముఖ్యమంత్రీ చేయని ద్రోహం జగన్ చేశారని ఆరోపణ
- కూటమి ప్రభుత్వం వచ్చాకే ప్రాజెక్టుల పనులు వేగవంతం అయ్యాయని వెల్లడి

**అమరావతి**

వైసీపీ అధినేత జగన్ పై రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఐదేళ్ల పాలనలో రాయలసీమ ప్రాజెక్టులకు చేసిందేమీ లేని జగన్, ఇప్పుడు నీటిపారుదల గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. చరిత్రలో ఏ ముఖ్యమంత్రీ చేయని ద్రోహాన్ని జగన్ రాయలసీమకు చేశారని, ప్రాజెక్టులపై కనీస అవగాహన లేని వ్యక్తి గొడ్డలి పార్టీ నాయకుడని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. "'రప్ప రప్ప' అంటూ పొట్టేళ్లను నరికినట్లు నరుకుతామని హెచ్చరికలు చేసే జగన్ నోటి నుంచి రాయలసీమ, ఇరిగేషన్ మాటలు రావడం హాస్యాస్పదం. తన ఐదేళ్ల పాలనలో శ్రీశైలం, - మిగతా3లో

# ఇక రాష్ట్రమంతటా సంజీవని



- సీఎం చంద్రబాబు కీలక ఆదేశాలు
- జనవరి 1 నుంచి ఏపీలో 'సంజీవని' ప్రాజెక్టు అమలు
- కుప్పం, చిత్తూరులో విజయవంతం కావడంతో రాష్ట్రవ్యాప్తంగా విస్తరణ
- ఏఐ, డిజిటల్ హెల్త్ రికార్డులకు ప్రాధాన్యత ఇవ్వాలని సీఎం ఆదేశం
- ప్రజల ఆరోగ్య సమాచారానికి పూర్తి భద్రత, గోప్యత
- కుటుంబాలపై వైద్య ఖర్చుల భారం తగ్గించడమే లక్ష్యం

**అమరావతి**

ఆంధ్రప్రదేశ్‌లో ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుడుతూ 'సంజీవని' ప్రాజెక్టును జనవరి 1 నుంచి రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. కుప్పం, చిత్తూరు నియోజకవర్గాల్లో ప్రయోగాత్మకంగా అమలు చేసిన ఈ ప్రాజెక్టు అద్భుతమైన ఫలితాలు ఇవ్వడంతో, దీనిని రాష్ట్రమంతా విస్తరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన 90 రోజుల కార్యాచరణ ప్రణాళికను అధికారులు సీఎంకు - మిగతా3లో



## కుప్పకూలిన ఇరాన్ కరెన్సీ.. ఒక డాలర్‌కు 20 లక్షల రియాల్స్!

- ఇరాన్ కరెన్సీ రియాల్ రికార్డు స్థాయిలో పతనం
- ఒక అమెరికా డాలర్‌కు 20 లక్షల రియాల్స్‌కు చేరిన విలువ
- అమెరికా ఆంక్షలు, యుద్ధం కారణంగా తీవ్రమైన సంక్షోభం
- ఆకాశాన్నంటిన ధరలతో సామాన్యుల అవస్థలు
- జీతాలకు, ఖర్చులకు పొంతన లేక ప్రజల ఇబ్బందులు

# ఎన్నికల కోసం... పార్టీల వ్యూహాలు

- స్థానిక సంస్థల ఎన్నికల సందడి మొదలవుతున్న వేళ ప్రధాన రాజకీయ పార్టీల వ్యూహాలు ఆసక్తిని పెంచుతున్నాయి.
- అధికారంలో ఉన్న తెలుగుదేశం పార్టీ జనసేన భారతీయ జనతా పార్టీ ఇప్పటికే ఎన్నికలపై దృష్టి
- సీట్ల పంపకమే ఇప్పుడు కూటమి లో ప్రధాన అంశంగా మారనుంది
- గత అసెంబ్లీ ఎన్నికల్లో తమ బలాన్ని చాటుకున్న జనసేన, బీజేపీలు స్థానిక ఎన్నికల్లో ఎక్కువ స్థానాలను ఆశించడం సహజమే.
- మరోవైపు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మాత్రం ఒంటరిగానే ఎన్నికల బరిలోకి దిగేందుకు సిద్ధమవుతోందన్న ప్రచారం జరుగుతోంది
- 2024 ఎన్నికల్లో కేవలం 11 అసెంబ్లీ స్థానాలకే పరిమితమైన ఆ పార్టీకి స్థానిక ఎన్నికలు తమ బలాన్ని తిరిగి నిరూపించుకునే అవకాశం కావచ్చని నేతలు భావిస్తున్నట్లు తెలుస్తోంది.



**అమరావతి**

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో స్థానిక సంస్థల ఎన్నికల సందడి మొదలవుతున్న వేళ ప్రధాన రాజకీయ పార్టీల వ్యూహాలు ఆసక్తిని పెంచుతున్నాయి. అధికారంలో ఉన్న తెలుగుదేశం పార్టీ జనసేన భారతీయ జనతా పార్టీ ఇప్పటికే ఎన్నికలపై దృష్టి పెట్టాయి. మూడు పార్టీలు కలిసి ప్రభుత్వాన్ని నడుపుతున్న నేపథ్యంలో స్థానిక ఎన్నికల్లోనూ ఇదే సమన్వయాన్ని కొనసాగించాలని భావిస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. సీట్ల పంపకమే ఇప్పుడు కూటమి లో ప్రధాన అంశంగా మారనుంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో తమ బలాన్ని చాటుకున్న జనసేన, బీజేపీలు స్థానిక ఎన్నికల్లో ఎక్కువ స్థానాలను ఆశించడం సహజమే. అయితే నియోజకవర్గాలు, స్థానిక పరిస్థితులు, పార్టీకి ఉన్న బలం, అభ్యర్థుల సామర్థ్యం వంటి అంశాలను పరిశీలించి టీడీపీతో కలిసి నిర్ణయం - మిగతా3లో



## పేద మహిళలకు ఏటా రూ. 40 వేలు

- అఖిలేశ్ యాదవ్ భారీ ఎన్నికల హామీ
- త్వరలో ఉత్తరప్రదేశ్ అసెంబ్లీకి ఎన్నికలు
- పోటాపోటీగా హామీలు గుప్పిస్తున్న బీజేపీ, ఎస్పీ
- ఉద్యోగాల్లో మహిళలను 33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామన్న అఖిలేశ్

# ఆ శాఖకు నేను సంరక్షకుడిని మాత్రమే

- ముంబైలో నారా లోకేశ్
- ముంబైలో ఫార్చ్యూన్ ఇండియా సంస్థ '40 అండర్ 40' అవార్డుల కార్యక్రమం
- ముఖ్య అతిథిగా హాజరైన నారా లోకేశ్
- ఆర్పీఎస్జీ గ్రూప్ వైస్ చైర్మన్ శాశ్వత్ గోయెంకా అడిగిన ప్రశ్నలకు లోకేశ్ జవాబులు
- కేంద్రమంత్రి చిరాగ్ పాశ్వాన్ చేతుల మీదుగా అవార్డు అందుకున్న నారా బ్రహ్మణి

**అమరావతి**

వ్యాపారమైనా, రాజకీయమైనా తాను నిర్వహించే సంస్థలకు, శాఖలకు కేవలం సంరక్షకుడిని (కస్టోడియన్) మాత్రమేనని, తనకు అప్పగించిన బాధ్యతలను మరింత మెరుగైన స్థితికి తీసుకెళ్లడమే తన లక్ష్యమని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్, మానవ వనరుల శాఖల మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. పెట్టుబడుల ఆకర్షణలో స్పీడ్, సర్వీస్, స్టెబిలిటీ అనే మూడు సూత్రాలే తమ విజయ రహస్యాలని ఆయన వెల్లడించారు. దేశంలోని యువ వ్యాపారవేత్తలు, - మిగతా3లో



# ఐరాస కమిటీ ఆరోపణల్ని ఖండించిన భారత్

భారత్‌లోని వివిధ జాతి, మత వర్గాలపై వివక్ష, హక్కుల ఉల్లంఘనలు జరుగుతున్నాయంటూ ఐక్యరాజ్యసమితికి (ఐరాస) చెందిన ఓ కమిటీ చేసిన వ్యాఖ్యల్ని భారత ప్రభుత్వం ఖండించింది. ఐరాసకు చెందిన కమిటీ ఆన్ ది ఎలిమినేషన్ ఆఫ్ రేషియల్ డిస్క్రిమినేషన్ చేసిన ఆరోపణల్ని పూర్తి స్థాయిలో తిరస్కరిస్తున్నట్లు పేర్కొంది. ఐరాస కమిటీ తన నివేదికలో భారతదేశంలోని షెడ్యూల్డ్ తెగలు , షెడ్యూల్డ్ కులాలు , రోహింగ్యా శరణార్థులు ముఖ్యంగా పౌరసత్వం లేని వ్యక్తులపై పెద్ద ఎత్తున మానవ హక్కుల ఉల్లంఘనలకు పాల్పడుతుతన్నారని ఆందోళన వ్యక్తం చేసింది. అలాగే భారత్‌లో హేట్ స్పీచ్, హేట్ క్రైమ్‌కు (ద్వేషపూరిత నేరాలు) పాల్పడుతున్న వారిపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని సూచించింది. బెంగాలీ మాట్లాడే ముస్లింలపై ఘటనలు పెరిగాయని పేర్కొంటూ, వాటికి బాధ్యత వహించేలా చర్యలు తీసుకోవాలని భారత ప్రభుత్వాన్ని కోరింది.

అయితే ఇక్కడ ఐరాస కమిటీ విడుదల చేసిన రిపోర్టులోని కొన్ని అంశాలపై భారత్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఇది పూర్తిగా రాజకీయ దురుద్దేశంతో, తప్పుడు కోణంలో రూపొందించిన కమిటీ రిపోర్టు అని భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. ఈ మేరకు విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ బుధవారం రోజు మీడియాతో మాట్లాడుతూ ఖచీ జజు=ఐ ఆరోపణలకు గట్టి కౌంటర్ ఇచ్చారు. జాతి వివక్షను ఎదుర్కోవడంలో భారతదేశ నిబద్ధతలో ఎలాంటి మార్పు లేదని స్పష్టం చేశారు.'ఈ నివేదికలోని దురుద్దేశపూర్వక, రాజకీయ ప్రేరేపిత వ్యాఖ్యల్ని, ఆరోపణల్ని భారత్ పూర్తిగా తిరస్కరిస్తోంది. జాతి వివక్షకు



వ్యతిరేకంగా భారత్ ఎప్పటికీ కట్టుబడి ఉంది. దానిని అణచివేసే చర్యల్లో కూడా ఎప్పటికీ వెనుకడుగు వేయదు.' అని స్పష్టం చేశారు. ఐక్యరాజ్యసమితి సమీక్షా సమావేశంలోనే భారతదేశం తన రాజ్యాంగ రక్షణలు, బలమైన చట్టపరమైన వ్యవస్థ, విభిన్న సంస్కృతుల సమ్మేళనం, వెనుకబడిన వర్గాల పరిరక్షణకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల్ని స్పష్టంగా వివరించినట్లు జైస్వాల్ పేర్కొన్నారు.

**కమిటీ ఆరోపణల్ని ఇదివరకే ఖండించిన తుషార్ మెహతా బృందం!**

ఇదే సమయంలో సొలిసిటర్ జనరల్ ఆఫ్ ఇండియా తుషార్ మెహతా నేతృత్వంలోని భారత ఉమ్మడి మంత్రిత్వ శాఖల ప్రతినిధి బృందం ఇదివరకే ఈ ఆధారాల్లేని ఆరోపణలు, కమిటీ పరిధి దాటి చేసిన వ్యాఖ్యల్ని తిరస్కరించిందని ఆయన గుర్తుచేశారు. ఖచీ జజు=ఐ సమీక్ష ఆగస్ట్ 11, 12 తేదీల్లో జెనీవాలో జరిగింది. ఇందులో భారత్ సమర్పించిన 12వ, 21వ సంయుక్త నివేదికల్ని పరిశీలించారు. ఈ నివేదికల్ని భారత్ 2023లో జజు=ఐ కు సమర్పించింది. ఆ సమీక్షలో జాతి వివక్ష నిర్మూలనకు సంబంధించిన అంతర్జాతీయ ఒప్పందం అమలుకు సంబంధించిన పరిపాలనా చర్యలు, అణగారిన వర్గాల్లో సాధించిన పురోగతి, పక్షపాతం ఎదుర్కొనేందుకు చేపట్టిన విధానపర చర్యలు వంటి అంశాలు చర్చించారు.

జెనీవాలోని భారత శాశ్వత మిషన్ ప్రకారం- భారత ప్రతినిధి బృందం దేశంలోని రాజ్యాంగ, చట్టపరమైన రక్షణలు, సానుకూల చర్యలు, ప్రజాస్వామ్య జవాబుదారీ తనం, న్యాయపరమైన పరిష్కారాలు, వైవిధ్యం వంటి విధానాల్ని వివరించింది. అణగారిన వర్గాల కోసం నిరంతరం కొనసాగుతున్న సామాజిక, ఆర్థిక అభివృద్ధి చర్యల్ని కూడా భారత్ ప్రస్తావించింది. దేశంలోని ప్రతి ఒక్కరికీ సమానత్వం, గౌరవం, అవకాశాలు కల్పించే దిశగా భారత్ తన ప్రయాణాన్ని కొనసాగిస్తోందని భారత ప్రతినిధి బృందం పేర్కొంది. ఇక త్వరలోనే ఐరాస కమిటీ నివేదికలోని పరిశీలనలపై భారత్ నిర్దిష్ట విధానం ప్రకారం అధికారికంగా, సరైన సమాధానం ఇస్తుందని రణధీర్ జైస్వాల్ వెల్లడించారు. ఖచీ జజు=ఐ అనేది ప్రపంచవ్యాప్తంగా అన్ని రకాల జాతి వివక్షల నిర్మూలనపై అంతర్జాతీయ కన్వెన్షన్ (×జజు=ఐ) అమలును పర్యవేక్షించే 18 మంది స్వతంత్ర నిపుణుల కమిటీ. 1960ల నాటి నుంచే భారతదేశం ఈ కన్వెన్షన్‌లో క్రియాశీలక పాత్ర పోషిస్తోంది. అయితే జజు=ఐ ఇచ్చే సూచనలు, సిఫార్సులు కేవలం సలహాల రూపంలోనే ఉంటాయి.

## నేపాల్ ప్రధాని బాలెన్ షాతో మాట్లాడిన మోదీ



పొరుగుదేశం నేపాల్‌లో భారీ వరదలు బీభత్సం సృష్టించాయి. టిబెట్ సరిహద్దుకు సమీపంలోని ప్రాంతాల్లో బుధవారం ఉదయం ఒక్కసారిగా వరద ఉద్ధృతి పెరగడంతో భారీ నష్టం సంభవించింది. నదీ పరివాహక ప్రాంతాల్లోని గ్రామాలు నీట మునిగాయి. కీలక మౌలిక వసతులు దెబ్బతిన్నాయి. పలు జలవిద్యుత్ ప్రాజెక్టులు వరద ప్రభావానికి గురయ్యాయి. ఈ క్రమంలోనే ప్రధాని నరేంద్ర మోదీ నేపాల్ ప్రధాని బాలేంద్ర షాతో ఫోన్‌లో మాట్లాడారు. అవసరమైన అన్ని సహాయసహకారాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు వెల్లడించారు.

**నేపాల్ ప్రధానికి మోదీ ఫోన్**

భారీ వరదల నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ నేపాల్ ప్రధాని బాలేంద్ర షాతో ఫోన్‌లో మాట్లాడారు. వరదల్లో ప్రాణాలు కోల్పోయిన వారికి సానుభూతి తెలిపారు. ఈ కష్టకాలంలో నేపాల్ ప్రజలకు భారతీయులంతా అండగా ఉంటారని మోదీ హామీ ఇచ్చారు. నేపాల్‌కు అవసరమైన అన్ని రకాల మానవతా సాయం అందించేందుకు భారత్ సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. సహాయక చర్యలు, సహాయ బృందాల సమన్వయంపై ఇరు దేశాల బృందాలు సన్నిహితంగా పనిచేస్తున్నాయని తెలిపారు. ఈ మేరకు ఎక్స్?లో పోస్ట్ చేశారు.

**నేపాల్‌కు భారత్ సహాయం**

వరద బాధిత నేపాల్‌కు భారత్ అత్యవసర సాయాన్ని పంపేందుకు సిద్ధమైంది. భారత వాయుసేన విమానాల ద్వారా మందులు, ఆహార పదార్థాలు, ఇతర నిత్యావసర సామగ్రిని తరలించనున్నట్లు అధికారులు తెలిపారు. ప్రభుత్వ మానవతా సహాయం, విపత్తు సహాయక చర్యలలో భాగంగా ఈ సామగ్రిని పంపుతున్నారు. పరిస్థితిని బట్టి జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం సిబ్బందిని కూడా నేపాల్‌కు పంపే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. విపత్తు ప్రభావిత ప్రాంతాల్లో గాలింపు, రక్షణ, సహాయక చర్యలను వేగవంతం చేసేందుకు ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు సిద్ధంగా ఉన్నాయని పేర్కొన్నారు.

**భారత్-నేపాల్ సరిహద్దులో అప్రమత్తత**

భారీ వరదల నేపథ్యంలో భారత్ కూడా అప్రమత్తమైంది. భారత్-నేపాల్ మధ్య ఉన్న 1,751 కిలోమీటర్ల అంతర్జాతీయ సరిహద్దు వెంబడి సశస్త్ర సీమా బల్ (ఎస్?ఎస్?బీ) తన అన్ని విభాగాలను అప్రమత్తం చేసింది. సహాయ, రక్షణ చర్యల కోసం మొత్తం 18 బృందాలను మోహరించినట్లు అధికారులు తెలిపారు. వీటిలో ఏడు బృందాలను అత్యవసర పరిస్థితుల్లో రంగంలోకి దించేందుకు సిద్ధంగా ఉంచారు. కోషి, నారాయణి నదీ పరివాహక ప్రాంతాల్లో నీటి ప్రవాహం మరింత పెరిగే అవకాశం ఉందన్న వాతావరణ అంచనాల నేపథ్యంలో ఎస్ఎస్‌బీ అప్రమత్తంగా ఉంది. నేపాల్‌లోని చిన్న నదుల్లోనూ ఆకస్మిక వరదలు వచ్చే అవకాశం ఉందని అధికారులు హెచ్చరించారు. భారత్‌లోనూ ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లోని ఘఘ్రా/కర్నాలి, మహాకాళీ నదీ వ్యవస్థలకు ఆనుకుని ఉన్న సున్నిత ప్రాంతాలపై నిఘా పెంచారు. వరద పరిస్థితులు, నీటి ప్రవాహాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

**గల్లంతైన వారిలో భారతీయులు**

భారీ వరదల తర్వాత నేపాల్‌లో దాదాపు 400 మంది గల్లంతైనట్లు అధికారులు తెలిపారు. వీరిలో 105 మంది భారతీయులు, 37 మంది ఎన్ఆర్ఐలు ఉన్నట్లు వెల్లడించారు. ముఖ్యంగా టిబెట్ సరిహద్దుకు ఆనుకుని ఉన్న రసువా జిల్లాలో వరదల ప్రభావం తీవ్రంగా ఉంది. గ్రామాలు, రహదారులు, ఇతర కీలక మౌలిక వసతులు దెబ్బతినడంతో సహాయక చర్యలకు సవాళ్లు ఎదురవుతున్నాయి. గల్లంతైన వారి కోసం అధికారులు గాలింపు, సహాయక చర్యలను ముమ్మరం చేశారు.

**స్పందించిన కాంగ్రెస్**

ఇదిలా ఉండగా, నేపాల్ వరదల వల్ల జరిగిన ప్రాణనష్టం, విధ్వంసంపై కాంగ్రెస్ దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. పొరుగు దేశానికి సాధ్యమైనంత మానవతా సహాయాన్ని అందించాలని కేంద్రాన్ని కోరారు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కోరారు. వరదల్లో గల్లంతైన భారతీయులను గుర్తించి, వారి కుటుంబాలకు సహాయం అందించాలని చెప్పారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

# రైలు ప్రయాణికులకు గుడ్‌న్యూస్

దేశంలోని 7 ప్రధాన రైల్వే మార్గాలను ఫోర్- ట్రాక్‌గా (నాలుగు లైన్లు) విస్తరిస్తున్నట్లు కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ బుధవారం ప్రకటించారు. దాదాపు 11 వేల కిలోమీటర్ల మేర రైల్వే నెట్‌వర్క్‌ను నాలుగు లైన్లుగా విస్తరించే పనులు చేపడుతున్నట్లు వివరించారు. ఈ భారీ ప్రాజెక్టుతో ప్రయాణికుల రద్దీ తగ్గుతుందని భావిస్తున్నారు. సరకు రవాణా సామర్థ్యాన్ని గణనీయంగా పెంచడం, వేగవంతం చేయడం కూడా ఈ భారతీయ రైల్వే ప్రతిష్టాత్మక ప్రాజెక్టు ఉద్దేశంగా చెబుతున్నారు. ఈ 7 హై డెన్సిటీ మార్గాలు మొత్తం రైల్వే నెట్‌వర్క్‌లో కేవలం 16 శాతంగానే ఉన్నప్పటికీ, దేశవ్యాప్తంగా జరుగుతున్న మొత్తం రైల్వే ట్రాఫిక్‌లో ఈ మార్గాల వాటానే సుమారు 41 శాతంగా ఉందని అశ్విని వైష్ణవ్ ఎక్స్ (ట్విట్టర్) వేదికగా తెలిపారు. దీంతో ఈ మార్గాల్లో సామర్థ్యాన్ని పెంచడం భారతీయ రైల్వేలకు అత్యంత కీలకంగా మారింది. అందుకే వీటిని ప్రాధాన్యత క్రమంలో విస్తరిస్తున్నట్లు, ఈ రద్దీ ఎక్కువగా ఉండే 7 కీలక రైలు మార్గాల అభివృద్ధిపై కేంద్రం ప్రధానంగా దృష్టి సారించినట్లు వెల్లడించారు. ఈ రద్దీ రూట్లలో దిల్లీ- హావ్?డా, ముంబయి- దిల్లీ, హావ్?డా- చెన్నై వంటి కీలక నగరాలు ఉన్నాయి.

**7 హై డెన్సిటీ రైల్వే రూట్లు ఇవే**

దేశంలోని ప్రధాన నగరాలు, ప్రాంతాల్ని అనుసంధానించే ఈ 7 కారిడార్లలో ట్రాక్స్ విస్తరణ వేగంగా జరగనుంది. ఆ 7 ప్రధాన రూట్లు ఇవే!

దిల్లీ- హావ్‌డా
హావ్‌డా- చెన్నై
చెన్నై- ముంబయి
ముంబయి- దిల్లీ



దిల్లీ- చెన్నై
ముంబయి- హావ్‌డా
దిల్లీ- గువాహటి

ఈ మార్గాలు దేశంలోని ప్రధాన ఆర్థిక కేంద్రాలు, నగరాలు, పారిశ్రామిక ప్రాంతాల్ని అనుసంధానిస్తున్నాయి. దీంతో వీటిపై ప్రయాణికుల రైళ్లతో పాటు సరుకు రవాణా రైళ్ల ట్రాఫిక్ కూడా అధికంగా ఉంటుంది. ఇక ఈ ప్రధాన రైల్వే మార్గాల్లో అదనపు ట్రాక్స్ అందుబాటులోకి వస్తే రైళ్లను మరింత సౌకర్యవంతంగా నిర్వహించేందుకు అవకాశం ఉంటుందని అధికారులు తెలిపారు. ఇప్పటికే ఉన్న ట్రాక్స్‌పై ఒత్తిడి తగ్గడంతో పాటు, ప్రయాణికులు అలాగే సరుకు రవాణా రైళ్లను మరింత సమర్థవంతంగా నడిపించేందుకు వీలు కలుగుతుందని పేర్కొన్నారు. రైలు ప్రయాణాలకు రోజురోజుకూ పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని, భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఉండేందుకు, వచ్చినా ఎదుర్కొనేందుకు ఈ విస్తరణ ఉపయోగపడుతుందని రైల్వే శాఖ భావిస్తోంది. హై డెన్సిటీ మార్గాల విస్తరణ కేవలం రైళ్ల సంఖ్యను పెంచడానికి మాత్రమే కాకుండా, దేశ రవాణా వ్యవస్థలో రైలు మార్గాల సామర్థ్యాన్ని పెంచే విస్తృత ప్రణాళికలో భాగమని వైష్ణవ్ తెలిపారు. రైలు రవాణా ద్వారా రవాణా ఖర్చుల్ని తగ్గించడం, సరుకు తరలింపును వేగవంతం చేయడం, ప్రయాణికుల రద్దీని నిర్వహించడం వంటి ప్రయోజనాలు ఉంటాయని రైల్వే శాఖ కూడా పేర్కొంది.

**హై డెన్సిటీ మార్గాల్లో 'కవచ్' విస్తరణ**

ఇదిలా ఉండగా, దేశంలోని కీలక రైలు మార్గాల్లో భద్రతను పెంచేందుకు స్వదేశీ ఆటోమేటిక్ ట్రైన్ ప్రొటెక్షన్ సిస్టమ్ 'కవచ్ 4.ా.' అమలును కూడా విస్తరిస్తున్నారు. 2026, జులై 22న లోక్‌సభలో ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంలో మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించిన వివరాల ప్రకారం- దిల్లీ- ముంబయి, దిల్లీ- హావ్?డా రైలు కారిడార్లలో కలిపి 2490 రూట్ కిలోమీటర్లకు కవచ్ 4.ా. విస్తరించింది. కవచ్ 4.ా. లో రైలు కచ్చితమైన లొకేషన్ వివరాలు తెలుస్తాయి. ఇంకా పెద్ద రైల్వే యార్డుల్లో సిగ్నల్ సమాచారాన్ని మరింత మెరుగ్గా అందించడం, ఆప్టికల్ ఫైబర్ కేబుల్ ద్వారా స్టేషన్- టు- స్టేషన్ కమ్యూనికేషన్ సులభతరం అవడం వంటి సదుపాయాలు ఉన్నాయని మంత్రి చెప్పారు. ఈ వ్యవస్థను ఇప్పటికే ఉన్న ఎలక్ట్రానిక్ ఇంటర్‌లాకింగ్ సిస్టమ్‌తో నేరుగా అనుసంధానం చేయొచ్చని వెల్లడించారు. మొత్తంగా ఇలా నాలుగు లైన్ల విస్తరణతో పాటు కవచ్ వంటి భద్రతా వ్యవస్థల అమలు ద్వారా దేశంలోని అత్యంత రద్దీ రైలు మార్గాల్ని అధిక సామర్థ్యం, మెరుగైన భద్రత, తక్కువ రవాణా ఖర్చులతో కూడిన రైల్వే నెట్‌వర్క్‌గా తీర్చిదిద్దే ప్రయత్నం జరుగుతోంది.

## కుప్పకూలిన ఇరాన్ కరెన్సీ..
## ఒక డాలర్‌కు 20 లక్షల రియాల్స్!

ఇరాన్ కరెన్సీ రియాల్ చారిత్రక కనిష్ఠ స్థాయికి పడిపోయింది. ఫ్రీ మార్కెట్‌లో ఒక అమెరికా డాలర్ విలువ ఏకంగా 2 మిలియన్ల (20 లక్షల) ఇరానియన్ రియాల్స్‌కు చేరింది. అమెరికా విధించిన కఠిన ఆంక్షలు, ఇజ్రాయెల్‌తో కొనసాగుతున్న యుద్ధం



కారణంగా ఇరాన్ ఆర్థిక వ్యవస్థ తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయింది. ఈ పరిణామాలతో సుమారు 9.2 కోట్ల జనాభా ఉన్న ఆ దేశంలో ప్రజల జీవనం దుర్భరంగా మారింది. అల్ జజీరా ప్రచురించిన ఒక కథనం ప్రకారం, దశాబ్దాలుగా కొనసాగుతున్న అంతర్జాతీయ ఆంక్షలు, ముఖ్యంగా అణు కార్యక్రమంపై విధించిన ఆంక్షలు ఇప్పటికే ఇరాన్ ఆర్థిక వ్యవస్థను బలహీనపరిచాయి. దీనికి తోడు, ఈ ఏడాది ఫిబ్రవరి 28న ప్రారంభమైన యుద్ధం పరిస్థితిని మరింత దిగజార్చిందని ఆ కథనం పేర్కొంది. కరెన్సీ విలువ పడిపోవడంతో దేశంలో ద్రవ్యోల్బణం విపరీతంగా పెరిగిపోయింది. ఈ కరెన్సీ పతనం సామాన్యుడి జీవితంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. యుద్ధానికి ముందు 2 మిలియన్ల రియాల్స్‌కు దాదాపు 4 కిలోల టమాటాలు, అర కిలో చికెన్, లీటర్ వంట నూనె వచ్చేవి. కానీ ఇప్పుడు అవే డబ్బులకు వాటిలో సగం కూడా రావడం లేదని ప్రజలు వాపోతున్నారు. టమాటాల ధర 71 శాతం, చికెన్ ధర 74 శాతం, వంట నూనె ధర 177 శాతం పెరిగాయి. నిత్యావసరాలకే ఈ పరిస్థితి ఉంటే, మందుల ధరల పెరుగుదల మరింత తీవ్రంగా ఉంది. ఉదాహరణకు, ఇన్సులిన్ ధర 642 శాతం పెరిగింది. ధరల పెరుగుదలతో ప్రజలు మాంసం, చికెన్, కొత్త బట్టలు వంటివి కొనడం పూర్తిగా తగ్గించుకున్నారు. ప్రభుత్వ కనీస వేతనం నెలకు సుమారు 166 మిలియన్ రియాల్స్ (దాదాపు 82 డాలర్లు) ఉండగా, ఖర్చులు మాత్రం ఆకాశాన్నంటాయి. టెహరాన్‌లోని ఒక రిటైల్ వ్యాపారి తన అమ్మకాలు 40 శాతం పడిపోయాయని, చాలా వ్యాపారాలు మూతపడే ప్రమాదంలో ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీర్ఘకాలిక ఆంక్షలు, యుద్ధం వల్ల దెబ్బతిన్న ఉత్పత్తి, అమెరికా నౌకాదళ దిగ్బంధనం, అంతర్జాతీయ మార్కెట్లకు దూరం కావడం వంటివి ఈ సంక్షోభానికి ప్రధాన కారణాలని విశ్లేషకులు చెబుతున్నారు. నెల జీతంతో నెల రోజుల అవసరాలు ఎంతవరకు తీరుతాయన్నదే ఇప్పుడు ఇరాన్ ప్రజల ముందున్న అతిపెద్ద ప్రశ్నగా మారింది. కాగా, ఇరాన్‌లో పెద్ద సంఖ్యలను సులభంగా చెప్పేందుకు 10 రియాల్స్‌ను ఒక “టోమన్”గా వ్యవహరిస్తుంటారు.

## పేద మహిళలకు
## ఏటా రూ. 40 వేలు

రానున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఉత్తరప్రదేశ్‌లో అధికార బీజేపీ, సమాజ్‌వాదీ పార్టీల మధ్య హామీల పోరు తీవ్రస్థాయికి చేరింది. రాష్ట్రంలో మూడోసారి పీఠాన్ని దక్కించుకోవాలని సీఎం యోగి ఆదిత్యనాథ్ వ్యూహాలు రచిస్తుండగా... ఎలాగైనా మళ్లీ అధికారంలోకి రావాలని అఖిలేశ్ యాదవ్ నేతృత్వంలోని సమాజ్‌వాదీ పార్టీ మహిళా ఓటర్లను ఆకట్టుకునేందుకు హామీలను గుప్పిస్తోంది. యోగి ఆదిత్యనాథ్ మహిళల సంక్షేమం కోసం ఇప్పటికే కీలక ప్రకటనలు చేశారు. 60 ఏళ్లు దాటిన మహిళలకు రాష్ట్రవ్యాప్తంగా ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పించడంతో పాటు, 12వ తరగతి పూర్తయిన 25 లక్షల మంది బాలికలకు ఉచితంగా ల్యాప్‌టాప్‌లు అందిస్తామని ప్రకటించారు. వీటితో పాటు 'రాణి లక్ష్మీబాయి పథకం' ద్వారా విద్యార్థినులకు 50 వేల ఉచిత స్కూటీలను పంపిణీ చేయనున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. మరోవైపు, అధికార పార్టీకి గట్టి పోటీ ఇస్తూ అఖిలేశ్ యాదవ్ 'స్త్రీ సమ్మాన్ సమృద్ధి యోజన' వేదికగా 10 భారీ హామీలతో ముందుకు వచ్చారు. పేద మహిళలకు ఏటా రూ. 40 వేలు ఆర్థిక సాయం అందించడమే కాకుండా, రాబోయే రోజుల్లో ఈ మొత్తాన్ని పెంచుతామని మాటిచ్చారు. ఉద్యోగాల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు, ప్రతి నెలా 2 రోజుల ప్రత్యేక సాధారణ సెలవులు, వితంతువులు, నిరుపేదలకు శాశ్వత గృహాల నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చారు. విద్యా రంగానికి సంబంధించి 12వ తరగతి బాలికలకు ఉచిత ల్యాప్‌టాప్‌లు, ప్రభుత్వ పాఠశాలల్లో పూర్తి ఫీజు మాఫీ, ప్రైవేట్ బడుల్లో సగం ఫీజు భరిస్తామని తెలిపారు. ప్రతి తహసీల్‌లో పీజీ కళాశాల, జిల్లాకో విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయడంతో పాటు, మూతపడిన 26 వేల పాఠశాలలను తిరిగి తెరిపిస్తామని, మహిళలపై నేరాల విచారణకు ఫాస్ట్ ట్రాక్ కోర్టులను నెలకొల్పుతామని వెల్లడించారు.

# సర్కార్ బడి బాలికల స్టార్టప్ కంపెనీ-
# రూ.1లక్ష పెట్టుబడితో హెయిర్ ఆయిల్ బిజినెస్

బడిలో ఉపాధ్యాయుడు ఇచ్చిన చిన్న ఛాలెంజ్, తల్లి ఇంట్లో తయారుచేసే ఆయుర్వేద కేశ తైలం (హెర్బల్ హెయిర్ ఆయిల్) ఈ రెండూ కలిసి నలుగురు ప్రభుత్వ పాఠశాల విద్యార్థినులను చిన్న వయసులోనే మహిళా పారిశ్రామికావేత్తలుగా మార్చేశాయి. హరియాణా యమునానగర్ జిల్లా లహర్‌పుర్ ప్రభుత్వ పాఠశాలకు చెందిన 15 నుంచి 17 సంవత్సరాల వయసున్న నలుగురు బాలికలు సియా, రేణుక, నాన్సీ, దివ్య చదువుకుంటూనే సొంతంగా వ్యాపారం ప్రారంభించారు. హర్వోల్ అనే స్టార్టప్ ప్రారంభించి ఇదే బ్రాండ్ పేరుతో హెర్బల్ హెయిర్ ఆయిల్ బిజినెస్ స్టార్ట్ చేశారు. ఇప్పుడు ఏకంగా ఆస్ట్రేలియా, ఇటలీ వంటి దేశాలకు కూడా తమ ఉత్పత్తుల్ని ఎగుమతి చేస్తున్నారు. చదువుతో పాటు రోజూ సుమా గంట సమయం తమ స్టార్టప్ కోసం కేటాయిస్తున్నారు.

**వీరి ప్రయాణం ఎలా మొదలైందంటే?**

2025 నవంబర్‌లో ఈ విద్యార్థినుల ప్రయాణం మొదలైంది. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థుల్లో వ్యాపార ఆలోచనల్ని ప్రోత్సహించడానికి ఉపాధ్యాయుడు కన్వల్ జీత్ 'కుశాల్ బిజినెస్ ఛాలెంజ్' గురించి వివరించారు. అప్పుడే చిన్న పిల్లల్లో కూడా జుట్టు తెల్లబడటం వంటి సమస్యలు ఎక్కువగా ఉండటాన్ని గమనించిన విద్యార్థిని సియా- తన తల్లి రీనా దేవి ఇంట్లో తయారుచేసే మూలికా నూనె (హెర్బల్ ఆయిల్) గురించి ప్రస్తావించింది. నేచురల్ ఆయిల్‌కు మార్కెట్లో మంచి ఆదరణ ఉంటుందని భావించిన ఆ టీచర్, ఆ హోమ్ రెమెడీని బ్రాండెడ్ ప్రొడక్ట్‌గా మార్చమని ప్రోత్సహించారు. ఈ క్రమంలోనే సహజమైన హెయిర్ ఆయిల్ తయారు చేయాలనే ఆలోచనతో నలుగురు బాలికలు కలిసి ప్రొడక్ట్‌ను అభివృద్ధి చేశారు. వినియోగదారుల నుంచి కూడా మంచి స్పందన రావడంతో తర్వాత హెర్బల్ షాంపూ, హెయిర్ సీరమ్‌ను కూడా తమ ప్రొడక్ట్స్ జాబితాలో చేర్చారు. ప్రస్తుతం హెర్బల్ హెన్నాను కూడా తీసుకొచ్చేందుకు సిద్ధమవుతున్నారు.

**పోటీల్లో సత్తా చాటి రూ. 1 లక్ష గెల్చుకున్నారు!**

కుశాల్ బిజినెస్ ఛాలెంజ్‌లో ఈ హర్వోల్ ఆయిల్ టీమ్- స్కూల్, బ్లాక్, జిల్లా స్థాయిల్లో మొదటి స్థానాన్ని సాధించింది. రాష్ట్ర స్థాయిలో కూడా టాప్- 10 లో నిలిచింది. ఈ క్రమంలో ఆ బాలికలకు మొత్తం రూ. 1 లక్ష ప్రైజ్‌మనీ లభించింది. రేణుక తెలిపిన వివరాల ప్రకారం- జిల్లా స్థాయిలో రూ. 25 వేలు, రాష్ట్ర స్థాయిలో రూ. 75 వేలు వచ్చాయి. ఈ మొత్తాన్ని ఎవరికి వారు ఖర్చు చేయకుండా వ్యాపారంలోనే పెట్టుబడి పెట్టారు. మొదట ఇంట్లోనే ఉత్పత్తులు తయారు చేసి ప్యాక్ చేసేవారు. అమ్మకాలు పెరగడంతో ఇప్పుడు ఒక షాప్‌ను అద్దెకు తీసుకొని అక్కడి నుంచి ప్రొడక్ట్స్ తయారీ, వ్యాపార కార్యకలాపాలను నిర్వహిస్తున్నారు.

**గ్రామాల్లో ప్రచారం- సోషల్ మీడియాలో మార్కెటింగ్**

ప్రారంభంలో ఈ బాలికలకు తమ ప్రొడక్ట్స్‌ను విక్రయించడం అంత సాఫీగా ఏం సాగలేదు. నాన్సీతో పాటు టీమ్ సభ్యులు గ్రామాల్లో సమావేశాలు నిర్వహించి హెర్బల్ ఉత్పత్తుల తయారీ విధానం, అందులో ఉపయోగించే పదార్థాల గురించి ప్రజలకు వివరించారు. తర్వాత స్థానిక చిన్న దుకాణాలను సంప్రదించి తమ ఉత్పత్తుల్ని విక్రయించడం ప్రారంభించారు. క్రమంగా కస్టమర్ల నుంచి వచ్చిన రెస్పాన్స్‌తో హర్వోల్ ఉత్పత్తులకు గుర్తింపు పెరుగుతూ వచ్చింది. బాలికలు సోషల్ మీడియాలో హర్వోల్ పేరుతో ఇన్‌స్టాగ్రామ్ పేజీని కూడా క్రియేట్ చేశారు. ఇక్కడ ప్రొడక్ట్స్ ఫొటోలు, వివరాలు, కస్టమర్లు అభిప్రాయాల్ని పంచుకోవడం ద్వారా కొత్త వినియోగదారుల్ని ఆకర్షిస్తున్నారు. హర్వోల్ ఉత్పత్తులకు విదేశాల నుంచి కూడా మంచి స్పందన లభించింది. ఒక కస్టమర్ ఈ హర్వోల్ ప్రొడక్ట్‌ను ఆస్ట్రేలియాలో ఉన్న తన బంధువులకు పంపించారు. అక్కడ కూడా ఈ హెయిర్ ఆయిల్‌కు వస్తున్న స్పందనతో బాలికలపై ప్రశంసలు కురుస్తున్నాయి. తాజాగా ఇటలీ నుంచి కూడా ఆర్డర్ వచ్చినట్లు సియా తెలిపింది. 2025 నవంబరులో తమ వ్యాపారం ప్రారంభమైనప్పటి నుంచి హర్వోల్ ద్వారా దాదాపు రూ. 1 లక్ష ఆదాయం వచ్చిందని దివ్య చెప్పింది. సోషల్ మీడియా ద్వారా వచ్చే ఆర్డర్లు కూడా క్రమంగా పెరుగుతున్నాయని పేర్కొంది. సియా తల్లి రీనా దేవి కూడా వారి సక్సెస్ గురించి మాట్లాడారు. 'నేనేదో ఇంటి అవసరాల కోసం, ఇరుగు పొరుగు వారి కోసం మాత్రమే ఈ నూనెను చేసేదాన్ని. నా కూతురు, ఆమె స్నేహితులు ఈ చిట్కాను పెద్ద బిజినెస్ ఐడియాగా మార్చి విజయం సాధించడం నాకెంతో గర్వకారణంగా ఉంది.' అని సంతోషం వ్యక్తం చేశారు.

# ఎన్నికల కోసం... పార్టీల వ్యూహాలు



-మొదటిపేజీ తరువాయి

తీసుకునే అవకాశం ఉందని తెలుస్తోంది. డిమాండ్లు ఎన్ని ఉన్నా చివరికి మూడు పార్టీలు ఒకే తాటిపైకి వచ్చి ఎన్నికలను ఎదుర్కొంటాయని కూటమి నేతలు భావిస్తున్నారు. 2024 అసెంబ్లీ ఎన్నికల్లో కూటమి విజయాన్ని దృష్టిలో పెట్టుకుంటే స్థానిక పోరు కూడా ప్రతిపక్షానికి పెద్ద సవాలుగా మారనుంది. తెలుగుదేశం, జనసేన, బీజేపీ కలిసి సాధించిన విజయం రాష్ట్ర రాజకీయాల్లో కీలక మార్పునకు కారణమైంది. ఇప్పుడు అదే ఐక్యతను గ్రామ స్థాయి నుంచి నగర స్థాయి వరకు కొనసాగించడం కూటమికి ముఖ్యమైన అంశంగా మారింది. మరోవైపు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మాత్రం ఒంటరిగానే ఎన్నికల బరిలోకి దిగేందుకు సిద్ధమవుతోందన్న ప్రచారం జరుగుతోంది. 2024 ఎన్నికల్లో కేవలం 11 అసెంబ్లీ స్థానాలకే పరిమితమైన ఆ పార్టీకి స్థానిక ఎన్నికలు తమ బలాన్ని తిరిగి నిరూపించుకునే అవకాశం కావచ్చని నేతలు భావిస్తున్నట్లు తెలుస్తోంది. కూటమిలో విభేదాలు వస్తాయని గతంలో చేసిన అంచనాలు ఫలించకపోవడంతో ఇప్పుడు కొత్త వ్యూహంతో ముందుకు వెళ్లాల్సిన పరిస్థితి వైసీపీకి ఏర్పడింది.కొంతకాలం క్రితం వామపక్ష పార్టీలతో కలిసి పనిచేసే అవకాశాలపై చర్చ జరిగింది. ప్రజా సమస్యలపై ఉమ్మడి పోరాటాలు నిర్వహించాలనే ఆలోచన కూడా తెరపైకి వచ్చింది. అయితే ఆ స్థాయిలో రాజకీయ అవగాహన ముందుకు సాగలేదు. వామపక్షాలు తమ కార్యక్రమాలతో కొనసాగుతుండగా, వైసీపీ కూడా తన రాజకీయ మార్గంలోనే పయనిస్తున్నట్లు కనిపిస్తోంది.స్థానిక ఎన్నికలను 2024 అసెంబ్లీ ఎన్నికలతో పోల్చకూడదని వైసీపీ భావిస్తున్నట్లు తెలుస్తోంది. రెండేళ్ల కాలంలో రాజకీయ పరిస్థితులు మారాయని, ప్రభుత్వంపై ప్రజల్లో అసంతృప్తి పెరిగిందని ఆ పార్టీ అంచనా వేస్తోంది. తమకు గతంలో బలమైన పట్టు ఉన్న ప్రాంతాలను నిలబెట్టుకోవడంతో పాటు కూటమికి అనుకూలంగా వెళ్లిన కొన్ని స్థానాల్లో తిరిగి పుంజుకోవాలని వ్యూహాలు సిద్ధం చేస్తున్నట్లు సమాచారం.అయితే స్థానిక ఎన్నికలు అసెంబ్లీ ఎన్నికల కంటే భిన్నంగా ఉంటాయి. అభ్యర్థి వ్యక్తిగత ప్రభావం, స్థానిక సమస్యలు, సామాజిక సమీకరణాలు, గ్రామ స్థాయి సంబంధాలు ఫలితాలను ప్రభావితం చేస్తాయి. అందువల్ల ఈసారి ఎవరి అంచనాలు ఎంతవరకు నిజమవుతాయన్నది ఎన్నికల ఫలితాల తర్వాతే స్పష్టమవుతుంది.మొత్తానికి ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికలు కూటమి వర్సెస్ వైసీపీ మధ్య ప్రధాన పోరుగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి. కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీలు, ఇతర రాజకీయ సంస్థలు పోటీ చేసినా ప్రధాన రాజకీయ దృష్టి మాత్రం ఈ రెండు శిబిరాలపైనే ఉండనుంది. 2024లో కూటమికి వచ్చిన భారీ ఓటు మద్దతును అది ఎంతవరకు నిలబెట్టుకుంటుందో, వైసీపీ తన ఓటు శాతాన్ని ఎంతవరకు పెంచుకుంటుందో ఈ ఎన్నికలు తేల్చనున్నాయి.

### తెరపైకి కులం కార్డు...

వైసీపీ నేతలు కుటుంబ వివాదాలకు, చేసిన నేరాలకు కులం రంగు పులుముకుంటున్నారు. మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావును, అతని కుమారుడిని ఈడీ అరెస్టు చేసింది. లిక్కర్ రవాణా టెండర్లలో వందల కోట్ల అక్రమాలు, దొంగ ఇన్‌వాయిస్‌లు, లగ్జరీ ఆస్తుల కొనుగోలుపై ఆధారాలతో దర్యాప్తు సంస్థ చర్యలు తీసుకుంటే? దానికి రాష్ట్ర ప్రభుత్వానికి గానీ, రాజకీయ కక్ష సాధింపులకు గానీ ముడిపెడుతూ బీసీ రంగు పులిమి బయటపడాలనుకుంటున్నారు.మరొకవైపు, మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు కుమారుడి బైక్ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన దానయ్య అనే నిరుపేద గౌరెల కాపరి బీసీ కాదా? ఆ నిరుపేద కుటుంబానికి కనీస సానుభూతి తెలపకపోగా, నిందితుడిని రక్షించేందుకు చేసిన ప్రయత్నాలు ఏ తరహా బీసీ ఉద్ధరణకు సంకేతం? బాధితుడి కుటుంబానికి న్యాయం చేయాల్సింది పోయి, కేసును నీరుగార్చే ప్రయత్నం చేసిన నేతలకు బీసీల పట్ల నిజమైన ప్రేమ ఉందా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. నేరం చేసింది తమ వర్గం వారైతే ఒక న్యాయం, నిరుపేదలు బాధితులైతే మరో న్యాయమా అనే ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి.ఇక మరో నేత జోగి రమేష్ వ్యవహారంలోనూ ఇదే తీరు కనిపిస్తోంది. క్రిస్టియన్ మతాన్ని స్వీకరించిన వ్యక్తి సామాజిక మూలాలను పొలిటికల్ మైలేజ్ కోసం వాడుకుంటున్నారు. కుటుంబ వివాదంలో.. తమ కోడలికి అన్యాయం చేశారన్నది బహిరంగ నిజం. మరి ఆమె బీసీ బిడ్డ కాదా?. కుటుంబాన్ని సక్రమంగా ఉంచుకోలేక బీసీ అని కేకలేస్తే పనవుతుందా? .ఆర్థిక అక్రమాలు, తీవ్రమైననేరాలు , నిరుపేదల ప్రాణాలు తీసిన సంఘటనలు చోటుచేసుకున్నప్పుడు విచారణ ఎదుర్కొనాల్సిందే. కేవలం వైఎస్సార్‌సీపీలో ఉంటేనే బీసీలు అవుతారా? ఇతర పార్టీల్లోని వారు, సాధారణ ప్రజలు బీసీలు కాదా? చేసిన తప్పుల తీవ్రతను కప్పిపుచ్చుకోవడానికి కులాన్ని, మతాన్ని కేడర్‌గా వాడుకోవాలనుకుంటే ప్రజలు నమ్మే పరిస్థితి లేదు. చట్టం తన పని తాను చేసుకుపోతున్నప్పుడు కులం వెనుక దాక్కోవాలనుకోవడం రాజకీయ చేతకానితనం అవుతుంది. కానీ వైసీపీ నేతలకు తెలిసిన విద్య అదే.

# టీడీపీ సోషల్ మీడియా టాస్క్
# టార్గెట్ జెన్ జీ, ఆల్ఫా

**ఒంగోలు :** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రభుత్వ పాలనతో పాటు ప్రజలతో సమాచార సంబంధాలను మరింత బలోపేతం చేయడంపై దృష్టి పెట్టారు. ముఖ్యంగా యువతను చేరుకోవడానికి సోషల్ మీడియాను సమర్థంగా ఉపయోగించుకోవాలని మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలకు సూచించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం యువతలో వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, ఎక్స్ వంటి డిజిటల్ వేదికలకు ఉన్న ఆదరణను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను వారికి చేరువ చేయాలన్నది ఆయన ఆలోచనగా కనిపిస్తోంది.ఇటీవలి కాలంలో రాజకీయ పార్టీలకు సోషల్ మీడియా ఎంత కీలకంగా మారిందో పలు పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. ముఖ్యంగా యువతలో రాజకీయ చర్చలు ఎక్కువగా డిజిటల్ వేదికలపైనే జరుగుతున్నాయి. ఒక అంశంపై ప్రజాభిప్రాయాన్ని వేగంగా ప్రభావితం చేయడంతో పాటు ప్రభుత్వ కార్యక్రమాలను నేరుగా ప్రజలకు వివరించేందుకు కూడా సోషల్ మీడియా ఉపయోగపడుతోంది. ఈ మార్పును గుర్తించిన బీజేపీ కూడా డిజిటల్ ప్రచారంపై ప్రత్యేకంగా దృష్టి పెడుతోంది.ఇదే సమయంలో ఆంధ్రప్రదేశ్‌లోనూ కూటమి ప్రభుత్వం సోషల్ మీడియా వ్యవస్థను మరింత చురుగ్గా మార్చాలని భావిస్తున్నట్లు సమాచారం. ఇటీవల జరిగిన మంత్రివర్గ సమావేశంలో కొంతమంది మంత్రుల డిజిటల్ కార్యకలాపాలపై చంద్రబాబు వివరాలు తెలుసుకున్నట్లు తెలుస్తోంది. నారా లోకేష్, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వంగలపూడి అనిత , ఫరూక్ , కొండపల్లి శ్రీనివాస్ (తదితరులు తమ కార్యక్రమాలు, ప్రజా సంబంధిత విషయాలను సోషల్ మీడియా ద్వారా పంచుకుంటున్నారని చర్చ జరిగింది.అయితే ఇంతటితో సరిపోదని చంద్రబాబు భావిస్తున్నట్లు సమాచారం. ప్రతి మంత్రి, ఎమ్మెల్యే, ఎంపీ తమ నియోజకవర్గాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు, ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, ప్రజలతో నిర్వహిస్తున్న సమావేశాలు, సమస్యల పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలను డిజిటల్ మాధ్యమాల ద్వారా వివరించాలని సూచించినట్లు తెలుస్తోంది. ఒకే వేదికకు పరిమితం కాకుండా ప్రజలు ఎక్కువగా ఉపయోగించే అన్ని సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లను అందుబాటులోకి తీసుకురావాలని ఆయన చెప్పినట్లు సమాచారం.ముఖ్యంగా వచ్చే రెండేళ్లలో యువ ఓటర్ల ప్రాధాన్యం మరింత పెరగనుందని చంద్రబాబు భావిస్తున్నట్లు తెలుస్తోంది. యువతకు ప్రభుత్వం ఏం చేస్తోంది, ఉపాధి, విద్య, పరిశ్రమలు, సాంకేతిక రంగాల్లో ఎలాంటి అవకాశాలు కల్పిస్తోంది అనే విషయాలను వారికి సులభంగా అర్థమయ్యే విధంగా చెప్పాల్సిన అవసరం ఉందని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి.ఈ సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రారంభించిన 'జగన్ 2.0' యాప్ కూడా చర్చకు వచ్చినట్లు సమాచారం. డిజిటల్ వేదికల ద్వారా ప్రజలతో నిరంతర సంబంధం కొనసాగించే విషయంలో రాజకీయ నాయకులు మరింత ముందుండాలని చంద్రబాబు సూచించినట్లు తెలుస్తోంది.



ప్రజలు ప్రశ్నిస్తే స్పందించడం, సమస్యలను గుర్తించి పరిష్కరించడం, చేసిన పనులను పారదర్శకంగా వివరించడం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన అభిప్రాయపడుతున్నట్లు తెలుస్తోంది.అయితే సోషల్ మీడియాపైనే పూర్తిగా ఆధారపడకుండా ప్రధాన మీడియాకు కూడా సమాన ప్రాధాన్యం ఇవ్వాలని చంద్రబాబు సూచించినట్లు సమాచారం. టెలివిజన్, పత్రికలు, డిజిటల్ మీడియా, సోషల్ మీడియా.. అన్ని వేదికలను సమన్వయంతో ఉపయోగించినప్పుడే ప్రభుత్వ సందేశం విస్తృతంగా ప్రజల్లోకి వెళ్తుందని భావిస్తున్నారు. మొత్తంగా కూటమి ప్రభుత్వం డిజిటల్ కమ్యూనికేషన్‌ను మరింత బలోపేతం చేసి యువతతో ప్రత్యక్ష సంబంధం పెంచుకునే దిశగా అడుగులు వేస్తున్నట్లు కనిపిస్తోంది

## జోగి ఫ్యామిలీ అడ్డంగా బుక్...

**విజయవాడ :** మాజీ మంత్రి జోగి రమేష్ తన కుటుంబాన్ని రాజకీయాల కోసం వీధిన పడేసారని ఆవేదన వ్యక్తం చేశారు. తన కోడలిని కుమార్తె కంటే బాగా చూసుకున్నానని ప్రకటించారు. ఇదంతా కల్పితం మాత్రమేనని.. దీని వెనుక చంద్రబాబు, లోకేష్, మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ ఉన్నారని.. పెద్ద పెద్ద వారి కుటుంబాల్లోనే వివాదాలు ఉన్నాయని.. తన కుటుంబంలో కేవలం తన కుమారుడు, కోడలి మధ్య విభేదాలు మాత్రమేనని.. తమ కోడలి ఫిర్యాదు కంటే ముందే తాము విడాకుల కోసం దరఖాస్తు చేసుకున్నట్లు నిన్ననే జోగి రమేష్ మీడియా ముఖంగా ప్రకటన చేశారు. నెల రోజులుగా క్షోభ అనుభవిస్తున్నామని చెప్పుకొచ్చారు. అయితే ఈ వ్యాఖ్యలను ఖండిస్తూ జోగి రమేష్ కోడలు మేఘన, ఆమె తండ్రి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మీడియా ముందుకు వచ్చి తమకు జరిగిన అన్యాయాన్ని వివరించే ప్రయత్నం చేశారు.తనకు అత్తవారింట్లో ఎదురైన పరిణామాల గురించి వివరిస్తూ కన్నీటి పర్యంతం అయ్యారు మేఘన. సంసారానికి పనికిరాని లోపం కొడుకు జోగి రాజీవ్ కు ఉందని తెలిసి.. కేవలం పరువు, భారీ కట్నం కోసమే తమకు అబద్ధాలు చెప్పి మోసపూరితంగా పెళ్లి చేస్తారని మేఘన కుండబద్దలు కొట్టారు. మరింత అదనపు కట్నం తెస్తేనే నీ నీ భర్తకు ఫీలింగ్స్ వస్తాయి.. నువ్వు సంతోషంగా ఉంటావు అంటూ జోగి రమేష్ భార్య శకుంతల తనను చిత్రహింసలకు గురి చేసిందని మేఘన చెప్పారు. బయట సమాజానికి హిందూ సంప్రదాయ కుటుంబం గా బిల్డప్ ఇచ్చే జోగి రమేష్ ఇంట్లో.. అసలు స్వరూపం వేరని.. వారిది పక్కా క్రిస్టియన్ కుటుంబమని మేఘన ఆధారాలతో సహా బయటపెట్టారు.కొత్తగా అత్తవారింట్లో అడుగుపెట్టిన తనకు పూజ చేసేందుకు ప్రత్యేకమైన గది కూడా లేదని.. తాను హిందూ దేవుళ్ళ ఫోటోలు పెట్టి పూజలు చేస్తుంటే అడ్డుకునేవారని కొచ్చారు. హారతి పళ్లాలు, అగరబత్తులను నేలకేసి కొట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ అత్త హిందూ దేవుళ్లను అసభ్యంగా దూషిస్తూ.. బలవంతంగా మతం మార్చేందుకు విపరీతంగా ఒత్తిడి చేశారని ఆరోపించారు.

## ఇక రాష్ట్రమంతటా 'సంజీవని'..

-మొదటిపేజీ తరువాయి

వివరించారు. ఈ సమీక్ష సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ, ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) ఆధారిత ఆరోగ్య సేవలు, ప్రతి పౌరునికి డిజిటల్ హెల్త్ రికార్డులు, వ్యాధుల ముందస్తు గుర్తింపు, సరైన చికిత్స, ఆ తర్వాత ఫాలో-అప్‌కు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. డిజిటల్ హెల్త్ రికార్డులతో ఈ ప్రాజెక్టును పూర్తిస్థాయిలో అమలు చేస్తే వైద్య సేవల్లో పెను మార్పులు తీసుకురావచ్చని, దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఆంధ్రప్రదేశ్ ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. ప్రజల ఆరోగ్య సమాచారం యొక్క గోప్యతకు, భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని చంద్రబాబు అధికారులను గట్టిగా ఆదేశించారు. ప్రతి వ్యక్తి ఆరోగ్యానికి సంబంధించిన అప్‌డేట్‌లను నేరుగా వారి మొబైల్ ఫోన్‌లకే పంపేలా వ్యవస్థను తీర్చిదిద్దాలని సూచించారు. వ్యాధులను ముందుగానే గుర్తించి, నివారణ చర్యలు చేపట్టడం, సరైన సమయంలో చికిత్స అందించడం ద్వారా కుటుంబాలపై పడే వైద్య, విద్యా ఖర్చుల భారాన్ని గణనీయంగా తగ్గించవచ్చని ప్రభుత్వం భావిస్తోంది. ఈ లక్ష్య సాధనలో 'సంజీవని' ప్రాజెక్టు కీలక పాత్ర పోషిస్తుందని ప్రభుత్వం విశ్వసిస్తోంది.

## ఆ శాఖకు నేను సంరక్షకుడిని మాత్రమే:

-మొదటిపేజీ తరువాయి

ప్రతిభావంతులకు ఫార్చ్యూన్ ఇండియా సంస్థ '40 అండర్ 40' పేరుతో ముంబైలో అవార్డుల ప్రదానోత్సవాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమానికి కేంద్ర ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి చిరాగ్ పాశ్వాన్, మంత్రి నారా లోకేశ్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ వేడుకలో భాగంగా, డైరీ రంగంలో విలువ ఆధారిత ఉత్పత్తుల విభాగంలో హెరిటేజ్ సంస్థ సాధించిన ప్రగతికి గాను, ఆ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నారా బ్రహ్మణికి కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్ చేతుల మీదుగా 'ఫార్చ్యూన్ ఇండియా 40 అండర్ 40' అవార్డును ప్రదానం చేశారు.

### ఏపీ పెట్టుబడుల రహస్యం ఇదే

అనంతరం జరిగిన ఇంటరాక్టివ్ సెషన్‌లో మంత్రి లోకేశ్ పాల్గొన్నారు. ఆర్పీఎస్జీ గ్రూప్ వైస్ చైర్మన్ శాశ్వత్ గోయెంకా అడిగిన పలు ప్రశ్నలకు ఆయన ఆసక్తికర సమాధానాలిచ్చారు. "ప్రభుత్వ నిర్వహణలో మీరు క్రమశిక్షణ పాటిస్తున్నారు. పొదుపు గురించి మాట్లాడారు. ఈ ఆలోచన మీకు ఎక్కడి నుంచి వచ్చింది?" అని గోయెంకా ప్రశ్నించగా, లోకేశ్ బదులిచ్చారు. "వ్యాపారంలో అయినా, రాజకీయాల్లో అయినా మనం నిర్వహించే సంస్థలకు కేవలం సంరక్షకులం మాత్రమేనని నేను బలంగా నమ్ముతాను. ఒక మంత్రిగా నేను ఇక్కడికి వచ్చింది కేవలం మానవ వనరుల అభివృద్ధి, విద్యాశాఖకు సంరక్షకుడిగా మాత్రమే. గతంలో వ్యాపారంలో, ఇప్పుడు ప్రభుత్వ బాధ్యతల్లోనూ ఇదే విధానాన్ని అనుసరిస్తున్నాను" అని వివరించారు. పెట్టుబడుల కోసం అన్ని రాష్ట్రాలు పోటీ పడుతున్న తరుణంలో ఆంధ్రప్రదేశ్‌ను ప్రత్యేకంగా నిలబెట్టేది ఏమిటన్న ప్రశ్నకు లోకేశ్ రెండు ప్రధాన కారణాలను తెలిపారు. "మొదటిది, మేము అనుసరించే మూడు 'ఎస్'ల విధానం. స్పీడ్ (వేగం), సర్వీస్ (సేవ), స్టెబిలిటీ (స్థిరత్వం). మేము ఎంత వేగంగా అనుమతులు ఇస్తున్నామో చాలా పరిశ్రమలకు తెలుసు. ఇక సర్వీస్ విషయానికొస్తే, పెట్టుబడిదారులకు వారి ప్రాజెక్టుల పురోగతిపై ప్రతి శనివారం రాత్రి నేనే స్వయంగా మెసేజ్ పంపి ఫీడ్‌బ్యాక్ ఇస్తాను. మూడోది, విధానాల్లో స్థిరత్వం. ప్రభుత్వాలు మారినా మా విధానాలు కొనసాగుతాయి. ఇది పెట్టుబడిదారులకు భరోసా ఇస్తుంది" అని లోకేశ్ అన్నారు. "రెండో ముఖ్య కారణం ముఖ్యమంత్రి చంద్రబాబు గారు. సీబీఎన్ అంటే అదొక బ్రాండ్. ఆయనకు అద్భుతమైన ట్రాక్ రికార్డు ఉంది. పెట్టుబడులకు అవసరమైన తలుపులు తెరువగల ముఖ్యమంత్రి ఉండటంతో మా పని సగం సులభమవుతుంది. మిగిలిన సగం పనిని నేను సమావేశ మందిరంలో ఒప్పందాన్ని ఖరారు చేయడం ద్వారా పూర్తి చేస్తాను. మా ఇద్దరి భాగస్వామ్యమే ఆంధ్రప్రదేశ్‌ను ప్రత్యేకంగా నిలుపుతోంది" అని లోకేశ్ తెలిపారు. కుటుంబ వ్యాపారాల్లో ఉన్న యువత తమ కంఫర్ట్ జోన్ నుంచి బయటకు వచ్చి, కొత్త రంగాల్లో పరిశోధనలపై భారీగా పెట్టుబడులు పెట్టాలని లోకేశ్ పిలుపునిచ్చారు. అంతరిక్షం, క్వాంటమ్ టెక్నాలజీ, మెటీరియల్ సైన్సెస్ వంటి రంగాల్లో భారతదేశం ఎంతో సాధించగలదని ఆశాభావం వ్యక్తం చేశారు. "రేపటి తరం గర్వపడేలా ఆంధ్రప్రదేశ్‌లో అమరావతి నగరం చరిత్ర సృష్టించబోతోంది. ప్రపంచమంతా చెప్పుకునేలా ఒక మోడల్‌ను ఏపీలో నిర్మించాలన్నది మా లక్ష్యం. ఈ మార్పులో మీరంతా భాగస్వాములు కావాలి. మేము చేసే ప్రతి తప్పు నుంచి నేర్చుకోవడానికి, రాష్ట్రాన్ని మరింత మెరుగ్గా తీర్చిదిద్దడానికి మీ సలహాలు స్వీకరించడానికి సిద్ధంగా ఉన్నాం" అని యువ పారిశ్రామికవేత్తలను ఉద్దేశించి లోకేశ్ అన్నారు.

## రాయలసీమకు జగన్ ఏం చేశారు?



-మొదటిపేజీ తరువాయి

పోతిరెడ్డిపాడులకు ఏం చేశారో చెప్పుకోలేని దుస్థితిలో ఆయన ఉన్నారు" అని దుయ్యబట్టారు. "సూపర్ ఎల్ నినో ప్రభావంతో గతేడాది 2,000 టీఎంసీలు వచ్చిన శ్రీశైలంకు ఈసారి కేవలం 208 టీఎంసీల నీరే వచ్చింది. ఇందులో మన వాటా 66 శాతమే. అయినా రాయలసీమ తాగునీటి అవసరాల కోసం ప్రతిరోజూ 11,500 క్యూసెక్కుల నీటిని పంపిస్తున్నాం. నీటిని పొదుపుగా వాడుకోవాలని, 2027 జులై వరకు తాగునీటి అవసరాలకే ప్రాధాన్యత ఇవ్వాలని మే నెల నుంచే రైతులకు, ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం" అని మంత్రి వివరించారు. తెలంగాణ విద్యుదుత్పత్తి వల్ల శ్రీశైలం నీరు వృథా అవుతోందన్న జగన్ వ్యాఖ్యలపై స్పందిస్తూ.. "శ్రీశైలంలో విద్యుదుత్పత్తి చేస్తే ఆ నీరు నాగార్జునసాగర్‌కే వస్తుందన్న కనీస జ్ఞానం ఐదేళ్లు సీఎంగా చేసిన వ్యక్తికి లేకపోవడం విడ్డూరం. ఆ నీరు కూడా మన తాగునీటి అవసరాలకే ఉపయోగపడుతుంది. అనవసర విద్యుదుత్పత్తిని నియంత్రించాలని ఇప్పటికే కేఆర్‌ఎంబీకి, కేంద్ర జలశక్తి శాఖకు లేఖలు రాశాం" అని తెలిపారు.

### జగన్ ఐదేళ్లలో ఏం చేశారు?

"2019లో 49 సీట్లు ఇచ్చి గెలిపిస్తే రాయలసీమకు ఏం చేశారో జగన్ గుండెల మీద చేయి వేసుకుని చెప్పగలరా?" అని నిమ్మల ప్రశ్నించారు. అంతేకాదు, గత ప్రభుత్వ వైఫల్యాలను ఏకరువు పెట్టారు. శ్రీశైలం: ప్రాజెక్టుకు ప్రమాదం ఉందని సీడబ్ల్యూసీ హెచ్చరించినా ఐదేళ్లలో పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక రూ.203 కోట్లతో మరమ్మతులు చేపట్టింది.

తుంగభద్ర: సీమకు జీవనాధారమైన ఈ ప్రాజెక్టు గేట్లు కొట్టుకుపోయే ప్రమాదం ఉన్నా పట్టించుకోలేదు. మా ప్రభుత్వం 33 గేట్లను మార్చి 105 టీఎంసీల నీటిని నిల్వ చేసేలా చర్యలు తీసుకుంది.

గోరుకల్లు: రిజర్వాయర్ ప్రమాదంలో ఉందని అధికారులు హెచ్చరించినా ఒక్క రూపాయి ఖర్చు చేయలేదు. మేము రూ.59 కోట్లతో టెండర్లు పిలిచి పనులు మొదలుపెట్టాం.

హంద్రీ-నీవా: ఐదేళ్లలో జగన్ చేయలేని పనులను, మా ప్రభుత్వం ఒక్క ఏడాదిలోనే రూ.3,860 కోట్లతో చేపట్టింది. తిరుమల వరకు కృష్ణా జలాలను తీసుకెళ్లేందుకు మరో రూ.1,300 కోట్లతో పనులకు శ్రీకారం చుట్టింది.

వైసీపీ పాలనలో రాయలసీమకు మోసం తప్ప ఏమీ జరగలేదని వారి పార్టీ మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర్ రెడ్డే స్వయంగా చెప్పారని నిమ్మల రామానాయుడు గుర్తుచేశారు.

# ఉరవకొండ వైఎస్ఆర్సిపి కార్యాలయంలో పత్రిక సమావేశం



**ఆగస్టు 26 ప్రజాజ్యోతి న్యూస్ రాయలసీమ ఇంచార్జీ శ్రీనివాస్ నాయుడు :-**ఈ సందర్భంగా పలువురు వైఎస్ఆర్సిపి నాయకులు మాట్లాడుతూ జిల్లాల్లో ప్రధాని నీటి వనరులైన హెచ్.ఎల్.సి జిబిసి మరియు హెచ్ ఎం ఎస్ ఎస్ క్రింద లక్షల ఎకరాల ఆయకట్టును ఎండబెట్టడంపై ప్రభుత్వ వైఖరిని ఎండ కట్టారు.ఆగస్టు ముగుస్తున్న ఇరిగేషన్ అడ్వైజర్ బోర్డు సమావేశం నిర్వహించకపోవడం పాలకులకి అధికారులకి మధ్య సమన్వయ లోపం తెలుస్తుందన్నారు.గతంలో తుంగభద్ర లో ఇలాంటి పరిస్థితి తలెత్తినప్పుడు అప్పటి ప్రభుత్వాలు సమర్ధ్యంతంగా నీటి నిర్వహణ చేసిన పద్ధతిని తెలుసుకోవాలని సూచించారు.తుంగభద్ర ఎగువ పరివాహక ప్రాంతం దేశంలోని అత్యంత అనుకూల వర్షపాతాన్ని ఇచ్చే ప్రాంతం అని తెలిసిన ఈ రోజుకి 95 టీఎంసీలతో డ్యామ్ నిండకుండలా ఉన్న లక్షల మంది రైతులు అయోమయంలోకి నెట్టి ప్రభుత్వం చోద్దాం అన్నారు.మరోవైపు కృష్ణ నదిలో తెలంగాణ ప్రభుత్వం పాలమూరు రంగారెడ్డి కల్వకుర్తి నెట్టెంపాడు మరియు కోయిల్ సాగర్ లాంటి అనేక లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుల ద్వారా మరియు విద్యుత్ ఉత్పత్తి పేరుతో నాగార్జునసాగర్ కి నీటిని తరలించు కోబోతుంటే ప్రభుత్వం చోద్యం చూస్తూ కరువు ప్రాంతమైన రాయలసీమ ప్రాజెక్టులను ఎండబెట్టడం రైతుల పట్ల ఎలాంటి ప్రేమ ఉందో తెలుస్తుందన్నారు.ప్రభుత్వం వెంటనే స్పందించి హెచ్.ఎల్.సి మరియు జిబిసి మరియు హెచ్ ఎన్ ఎస్ ఎస్ ల ద్వారా కనీసం తక్కువ కాలపరమితులో కూడిన అరితడి పంటలకైన నీరు ఇవ్వాలి అని లేక ఈనెల 28వ తేదీన ఉరవకొండ సమీపంలోని హెచ్ ఎన్ ఎస్ ఎస్ కాల్వ పై రాస్తారోకా నిర్వహిస్తామని తెలుపుతూ రైతుల ఈ కార్యక్రమం లో పెద్ద ఎత్తున స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో నాయకులు అశోక్ కుమార్, భీమరెడ్డి, భరత్ రెడ్డి రమేష్ యోగేంద్రరెడ్డి ఎర్ర స్వామి రెడ్డి మరియు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు..

# విభిన్న ప్రతిభావంతుల మధ్య ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి జన్మదిన వేడుకలు

--జన్మదినం సందర్భంగా విభిన్న ప్రతిభావంతుల భవిత పాఠశాలకు రూ.లక్ష విలువైన సామగ్రి

--సీతా ఈశ్వరి ట్రస్ట్ ఆధ్వర్యంలో పాఠశాలకు సామగ్రి అందజేత




**కాకినాడ జిల్లా ఆగస్టు 26(ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్)** ఏలేశ్వరం ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పరిషత్ కార్యాలయ అధికారులు భారీ కేక్ కట్ చేసి బుజ్జికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.బుజ్జి జన్మదినాన్ని పురస్కరించుకుని ఏలేశ్వరంలోని భవిత విభిన్న ప్రతిభావంతుల పాఠశాలలో తన సీతా ఈశ్వరి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.లక్ష విలువైన బీరువా,పుస్తకాలు,ఆట వస్తువులు తదితర సామగ్రిని ఆయన చేతుల మీదుగా పాఠశాలకు అందజేశారు.అనంతరం విభిన్న ప్రతిభావంతులు,వారి కుటుంబ సభ్యులకు భోజనాలు ఏర్పాటు చేయగా వారితో కలిసి బుజ్జి సహపంక్తి భోజనం చేశారు.ఈ సందర్భంగా ఎంపీపీ బుజ్జి మాట్లాడుతూ తన జన్మదినం సందర్భంగా విభిన్న ప్రతిభావంతులతో కలిసి భోజనం చేయడం ఎంతో సంతోషాన్ని కలిగించిందన్నారు.సీతా ఈశ్వరి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రూ.లక్ష విలువైన సామాగ్రిని పాఠశాలకు అందించడం ఆనందంగా ఉందన్నారు.విభిన్న ప్రతిభావంతుల్లో కొంతమందికి పింఛన్ సమస్య ఉన్న విషయం తన దృష్టికి వచ్చిందని,ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ సహకారంతో ఆ సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు.తనకు ప్రత్యక్షంగా,పరోక్షంగా జన్మదిన శు భాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రామరాజు వర్మ, ఎంఈఓ అబ్బాయి, వరలక్ష్మి, ఏఓ రాజేష్, హెచ్ఓ ఏవో దివ్యశ్రీ, పట్టణ నాయకులు బొద్దిరెడ్డి గోపి, మూది నారాయణస్వామి, లింగంపర్తి సొసైటీ చైర్మన్ పెంటకోట మోహన్, వైస్ ఎంపీపీలు చిక్కాల రాజలక్ష్మి, లక్ష్మణరావు, సాదే లోవరాజు, నాయకులు యిజనగిరి శివ ప్రసాద్,పసల సూరిబాబు, కొప్పుల బాబ్జి, పసల నాగేశ్వరరావు, రుచి రమేష్, శెట్టి చిన్న, సుంకర సత్యనారాయణ, తోట చక్రధర్, గొల్లపల్లి కృష్ణ, మళ్ల నరేష్, సప్పా అచ్చిబాబు, సీనియర్ అసిస్టెంట్ కిరణ్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొని బుజ్జికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# కామ్రేడ్ పూసం బాబు మృతి సీపీఎంకు తీరని లోటు

తుది శ్వాస వరకు ఎర్రజెండా కోసం పోరాడిన యోధుడు

ఘనంగా నివాళులర్పించిన పార్టీ శ్రేణులు



కామ్రేడ్ పూసం బాబుకు సీపీఎం నాయకులు, ప్రజల ఘన నివాళి

**ఎటపాక, ఆగస్టు 26 (ప్రజాజ్యోతి):** సీపీఎం సీనియర్ నాయకులు, రాంగోపాలపురం శాఖ కార్యదర్శి కామ్రేడ్ పూసం బాబు మృతి పార్టీకి తీరని లోటని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ఐ.వి. అన్నారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ భద్రాచలం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పూసం బాబు, ఆగస్టు 25 సాయంత్రం 6:30 గంటలకు తుదిశ్వాస విడిచారు. రాంగోపాలపురంలోని ఆయన నివాసంలో సీపీఎం మండల నాయకులు నక్క సూరిబాబు అధ్యక్షతన బుధవారం సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఐ.వి. మాట్లాడుతూ.. పూసం బాబు జీవితాంతం ఎర్రజెండా సిద్ధాంతాలకే కట్టుబడి పనిచేశారని, పార్టీ బలోపేతానికి నిరంతరం శ్రమించారని కొనియాడారు. వారి కుటుంబానికి పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. సీపీఎం సీనియర్ నాయకులు డి.మాధవరావు, మండల కార్యదర్శి కాక అర్జున్ మాట్లాడుతూ.. కూలీల హక్కులు, పోడు భూముల సమస్యలు, గిరిజన రైతుల సమస్యల పరిష్కారం కోసం సాగిన అనేక ఉద్యమాల్లో పూసం బాబు ముందుండి నడిచారని గుర్తుచేశారు. ప్రజల మనిషిగా వారి హృదయాల్లో నిలిచారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శివర్గ సభ్యులు పి.బాలకృష్ణ, మండల కమిటీ సభ్యులు బుద్దుల భద్రయ్య, పూనెం వెంకటరావు, సవలం రాము, మాజీ సర్పంచ్ పెనుబల్లి వెంకటేశ్వర్లు, మాజీ ఉపసర్పంచ్ పి.సర్వయ్య తదితరులు పాల్గొని పూసం బాబు భౌతికకాయానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# దైవజనుల సమైక్య స్ఫూర్తి.. సమాజ సేవకే అంకితం!

రాంగోపాలపురంలో ఉత్సాహంగా సాగిన ఆత్మీయ సమ్మేళనం

పోలవరం జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక



పోలవరం జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్ – చింతూరు రీజియన్ ఆత్మీయ సమావేశం

**ఎటపాక, ఆగస్టు 26 (ప్రజాజ్యోతి):** పోలవరం జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో మంగళవారం ఎటపాక మండలం రాంగోపాలపురంలోని పి. ఇశ్రాయేలు చర్చి ప్రాంగణంలో చింతూరు రీజియన్ ఆత్మీయ సమావేశాన్ని ఘనంగా నిర్వహించారు. ఎటపాక మండల పాస్టర్స్ ఫెలోషిప్ ఆహ్వానం మేరకు జరిగిన ఈ సమావేశానికి చింతూరు, కూనవరం, వి.ఆర్.పురం, ఎటపాక మండలాలకు చెందిన పలువురు పాస్టర్లు, క్రైస్తవ సంఘ నాయకులు, దైవజనులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్య నాయకులు మాట్లాడుతూ దైవసేవకులు ఆత్మీయ ఐక్యతతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. దైవజనుల మధ్య స్నేహం, ఐక్యతను దెబ్బతీసే ప్రయత్నాలను తిప్పికొడుతూ సమాజ సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు. కష్టసుఖాల్లో సంఘాలకు అండగా నిలిచే నాయకత్వానికి అన్ని సంఘాలు సంపూర్ణ సహకారం అందించాలని కోరారు. ఈ సమావేశంలో పోలవరం జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్ చింతూరు రీజియన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా ప్రెసిడెంట్‌గా రెవ. యం. నిస్సికుమార్, వైస్ ప్రెసిడెంట్‌గా జెరిమియా, జిల్లా సెక్రటరీగా కె. జెకర్యా, జిల్లా ట్రెజరర్‌గా రెవ. విక్టరీ ఇమ్మానుయేలు, జిల్లా అడ్వైజర్‌గా బిషప్ జి. శ్రీకాంత్, జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యుడిగా రెవ. గబ్రియేలు ఎన్నికయ్యారు. అదేవిధంగా చింతూరు రీజినల్ చైర్మన్‌గా రెవ. ఇర్ప ఎజ్రా, సెక్రటరీగా రెవ. సురేష్, జాయింట్ సెక్రటరీగా రెవ. కె. మోషే, రీజినల్ జాయింట్ చైర్మన్‌గా కె. దివ్యకుమార్, చింతూరు ఎగ్జిక్యూటివ్ సభ్యుడిగా టి. ఇశ్రాయేలు ఎన్నికై బాధ్యతలు స్వీకరించారు. ఇంకా రెండు పదవులు ఖాళీగా ఉన్నట్లు నిర్వాహకులు తెలిపారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులను దైవజనులు, సంఘ పెద్దలు శాలువాలతో ఘనంగా సత్కరించి అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. రాబోయే రోజుల్లో ప్రాంతీయ సమస్యల పరిష్కారానికి, క్రైస్తవ సమాజ సంక్షేమానికి ఐక్యంగా కృషి చేస్తామని నూతన కార్యవర్గ సభ్యులు తెలిపారు.

## బిజెపి కార్యకర్త సద్దానమ్మకు అండగా నిలవండి

-బిజెపి మండల అధ్యక్షులు గోపాల్



**ఆగస్టు 26 ప్రజాజ్యోతి న్యూస్ రాయలసీమ ఇంచార్జ్ శ్రీనివాస్ నాయుడు :-**కూడేరు మండలం నారాయణపురం గ్రామంలోని సద్దానమ్మ ఇంటిని పరిశీలించడం జరిగింది.బిజెపి మండల అధ్యక్షులు బోయ గోపాల్ గారు అలాగే హనుమంత రెడ్డి గారు మరియు కోయిల రామాంజనేయులు గారు సద్దానమ్మకు కలిసి వివరాలు అడిగి తెలుసుకోవడం జరిగింది అక్కడ పరిస్థితుల్ని గమనిస్తే కావాలని ఆమె ఇంటి పైకప్పు నుంచి బట్టకు డీజిల్ గాని పెట్రోల్ గాని అంటించి గవాచి ద్వారా లోపలికి ఇంట్లో కి పెట్రోల్ తో అంటించిన గుడ్డను విసరడం వలన చాలావరకు బియ్యము బేడలు అలాగే వంట సామాగ్రి పూర్తిగా దగ్ధం అవడం జరిగింది . మనం సంతోషించాల్సిన విషయం ఏమిటంటే గ్యాస్ సిలిండర్ గాని ఫ్రిడ్జ్ గాని పేలి ఉంటే భయానక పరిస్థితులు జరిగేటివి అయినా ఒక మహిళా కార్యకర్త బిజెపి కార్యక్రమంలో చురుగ్గా పాల్గొంటుందని ఓర్వలేని గ్రామంలోని కొందరు ఆకతాయిలు చేసిన పనిగా అక్కడ ఉన్నవారు వివరించడం జరిగింది.మన పార్టీ తరపున ఒక మహిళగా ఆమెకు సానుభూతిని తెలియజేస్తూ అలాగే భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా సిఐ గారికి తాసిల్దార్ గారు అయితేనేమి ఆమెకు అండగా నిలిచి తప్పు చేసిన వారిని శిక్షించగలరని అలాగే ఆమెకు దాదాపుగా 20వేల వరకు నష్టం దాపరించి ఉంటాది వీటన్నిటిని కలెక్టర్ గారి దృష్టికి అయితే నేమి తీసుకెళ్లగలరని కోరుతూ మన బిజెపి కుటుంబ సభ్యులు ఎవరైనా కూడా ఒక మహిళా కార్యకర్త కి అన్యాయం జరిగింది కాబట్టి తల ఒక చెయ్యి వేసి కొంత సహాయం చేయగలరని బిజెపి మండల అధ్యక్షులు గోపాల్ గారు అలాగే మండల శాఖ అందరికీ సవినయంగా సవినయంగా తెలియజేయడం జరిగింది.

## ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్థాయి కథల పోటీ విజేతలు వీరే.

**ఆలమూరు ఆగస్టు 26(ప్రజాజ్యోతి):** ఆగస్టు 29వ తేదీన ఆలమూరు జూనియర్ కళాశాలలో జరిగే తెలుగు భాషా దినోత్సవం వేదికగా బహుమతులు అందజేత.శ్రీమతి అంగర లక్ష్మీకాంతం ఎడ్యుకేషనల్ సొసైటీ, బాల మందిరం ఆధ్వర్యంలో ఆగస్టు 29వ తేదీ తెలుగు భాషా దినోత్సవం, వ్యవహారిక భాషా ఉద్యమకారులు గిడుగు రామ్మూర్తి పంతులు జన్మదినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్థాయి కథల పోటీకి రచయితల నుంచి మంచి స్పందన లభించిందని నిర్వాహకులు అంగర గోపాలకృష్ణాచార్యులు(కృష్ణశ్రీ) బుధవారం తెలిపారు. విజేతల వివరాలను ఆయన వెల్లడించారు



**ప్రథమ బహుమతి**

డా. బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా మానేపల్లి కి చెందిన రచయిత కె. వి. లక్ష్మణరావు రచించిన 'మార్పు మొదలైంది' కథకు....

**ద్వితీయ బహుమతి**

తూర్పుగోదావరి జిల్లా మండపేటకు చెందిన రచయిత డాక్టర్ చల్లా రవికుమార్ రాసిన"మనుషులు పోగొట్టుకున్న మనిషి" కథకు...

**తృతీయ బహుమతి**

కాకినాడ జిల్లా పెదపూడి మండలం కరకుదురు కు చెందిన రచయిత్రి వరలక్ష్మి నున్న రాసిన "అమ్మ నాన్నకు ప్రేమతో " కు... లభించాయని తెలిపారు.

**కన్సోలేషన్ బహుమతి**

కోనసీమ జిల్లా ఆలమూరుకు చెందిన కథా రచయిత ఆకుల సూర్యా రాసిన "రక్షా బంధనం" కథ కన్సోలేషన్ బహుమతిని సాధించిందన్నారు. ఎంపికైన నాలుగు కథలతో సహా పోటీలకు వచ్చిన వాటిలో మంచి కథలతో గోదావరి అనుబంధం కథలు – 2027 కథాసంపుటిని త్వరలో ప్రచురించనున్నామని కృష్ణశ్రీ తెలిపారు. విజేతలైన కథా రచయితలకు ఈ నెల 29వ తేదీ శనివారం సాయంత్రం 3 గంటలకు ఆలమూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించనున్న తెలుగు భాషాదినోత్సవం సభలో బహుమతులు అందజేయనున్నట్లు ఆయన తెలిపారు.

## దువ్వూరు లో... ఘనంగా మీలాద్-ఉన్-నబి-వేడుకలు



**దువ్వూరు, ఆగస్టు 26 ( ప్రజా జ్యోతి )** ప్రవక్త మహమ్మద్ జయంతి సందర్భంగా దువ్వూరు పట్టణంలో శ్రీ శ్రీ హజరత్ మహబూబ్ సుబహాని అహలే సున్నత్ వల్ జమాయత్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం మిలాద్ ఉన్ నబీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దువ్వూరులోని బంగారు పీరు చావిడి వద్ద నుంచి దువ్వూరు పుర వీధులల్లో భక్తి గీతాలు పాడుకుంటు పచ్చ జెండాలు పట్టుకుని ముస్లిం సోదరులు ర్యాలీ నిర్వహించారు. దస్తగిరి స్వామి దర్గా వద్ద ప్రత్యేక ప్రార్థనల్లో నిర్వహించారు.అనంతరం మధ్యాహ్నం అన్నదానం కార్యక్రమం నిర్వహించారు.పెద్ద ఎత్తున పెద్దలు, పిల్లలు పాల్గొన్నారు. ఈ వేడుకలు ప్రశాంతంగా జరిగేలా దువ్వూరు ఎస్ఐ ధనుంజయుడు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో కమిటీ కార్యనిర్వాహకులు హుస్సేన్ బాష, మాబు సున్న,కరీముల్లా, రసూల్ గౌస్, జమాల్ బాష మరియు మత పెద్దలు పాల్గొన్నారు.

## మిలాద్ ఉన్ నబి పండగ సందర్భంగా వృద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్లు , బ్రెడ్లు పంపిణీ........



**చాగలమర్రి , ఆగస్టు 26( ప్రజాజ్యోతి న్యూస్ ) ;** నంద్యాల జిల్లా మండల కేంద్రమైన చాగలమర్రి పట్టణ వాస్తవ్యులు దావల్జిగారి షాజహాన్ మరియు వారి మిత్ర బృందంతో కలిసి నగళ్లపాడు వృద్ధాశ్రమంలో వృద్ధులకు మిలాద్ ఉన్ నబి పండగ సందర్భంగా పండ్లు , బ్రెడ్లు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో జి.యం.భాష , కె.ఆర్. కె రవి దర్శన్ వల్లంకొండు తదితరులు పాల్గొన్నారు.

## గ్రీవెన్స్‌లో ఏలూరికి వినతులు



**పర్చూరు ఆగస్టు 26 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)**గ్రీవెన్స్ కార్యక్రమంలో భాగంగా బుధవారం పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు తన క్యాంపు కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ వ్యక్తిగత, సామాజిక సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. వినతులను పరిశీలించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజల సమస్యలను ప్రాధాన్యతతో పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు.అనంతరం పలమర్ల గ్రామానికి వెళ్లిన ఏలూరి అక్కడి ప్రజలను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు తెలిపిన సమస్యలను పరిశీలించి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## సర్వమానవాళికి శాంతి సందేశాన్ని ఇచ్చిన మహిమాన్వితుడు మహమ్మద్ ప్రవక్త

**ఘనంగా మిలాద్ ఉన్ నబి వేడుకలు**




**హోళగుంద, ఆగస్టు 26 (ప్రజా జ్యోతి న్యూస్):** మహమ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకుని మిలాద్ ఉన్ నబి వేడుకలను హోళగుంద పట్టణంలో ముస్లిం సోదరులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక మస్జిద్–ఎ–మహమ్మదీయ అహ్లె సున్నతుల్ జమాత్ మసీదును రంగురంగుల విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరించారు.మిలాద్ ఉన్ నబి సందర్భంగా మసీదు నుంచి బస్టాండ్ మీదుగా ప్రత్యేక ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో ముస్లిం,దూదేకుల సోదరులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రవక్త మహమ్మద్ బోధించిన శాంతి, సోదరభావం, మానవతా విలువలను చాటిచెప్పారు.ఈ సందర్భంగా మస్జిద్–ఎ–మహమ్మదీయ అహ్లె సున్నతుల్ జమాత్ మసీదు ఇమామ్ టిప్పు సుల్తాన్ మాట్లాడుతూ.. మహమ్మద్ ప్రవక్త సర్వమానవాళికి శాంతి, సౌభ్రాతృత్వం, మానవతా సందేశాన్ని అందించారని తెలిపారు. ప్రవక్త బోధనలు నేటి సమాజానికి ఎంతో ఆదర్శప్రాయమని, ప్రతి ఒక్కరూ ఆయన చూపిన మార్గంలో నడుస్తూ శాంతి, సోదరభావాన్ని పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు.మిలాద్ ఉన్ నబి వేడుకల సందర్భంగా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ర్యాలీ ప్రశాంతంగా కొనసాగేందుకు నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్సై దిలీప్ కుమార్ గురజాల,పోలీసు సిబ్బంది గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

## నూతన గృహప్రవేశానికి ముఖ్య అతిథిగా హాజరైన వైసీపీ యువ నాయకులు దాట్ల సుబ్బరాజు



**కౌతాళం, ఆగస్టు 26 ప్రజా జ్యోతి**కౌతాళం గ్రామంలో వైఎస్ఆర్సిపి కార్యకర్త ఈడిగ సత్యగౌడ్ వారి నూతన గృహ ప్రారంభోత్సవ శుభ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా దాట్ల సుబ్బరాజు పాల్గొనడం జరిగింది. వారి కుటుంబానికి శుభాకాంక్షలు తెలిపి వారికి ఒక జ్ఞాపికను బహూకరించడం జరిగినది.ఈ కార్యక్రమంలో పాల్గొన్నందుకు కుటుంబం వారు శాలువా, పూలమాలతో సత్కరించడం జరిగింది.ఈకార్యక్రమంలో వైఎస్సార్సీపీ నాయకులు గణపతి రాజు,కుమార్ రాజు, డాక్టర్ అప్పులు, ఎంపిటిసి రాజహమ్మద్,ఆనంద్, ఉపేంద్ర గౌడ్, రాము,డ్రైవర్ లింగన్న, మూలేమాన్ నరసింహులు,ఎన్టీఆర్ నగర్ వీరేష్,సాయిబాబా, మోదిన్ సాబ్,దాట్ల యూత్ తదితరులు పాల్గొన్నారు.

# గుంతకల్లులో వాల్మీకులకు స్థానిక పదవుల్లో ప్రాధాన్యం కల్పించాలి

**గ్రామీణ ప్రాంతాల్లో వాల్మీకుల సంఖ్యను గుర్తించి అర్హులైన నాయకులకు అవకాశం ఇవ్వాలని: వాల్మీకి నాయకులు**




**గుంతకల్లు ఆగస్టు 26 (ప్రజా జ్యోతి) :** గుంతకల్లు నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాల్లో వాల్మీకుల జనాభా గణనీయంగా ఉన్న నేపథ్యంలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో వాల్మీకి సామాజిక వర్గానికి తగిన ప్రాధాన్యం కల్పించాలని వాల్మీకి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేసే అర్హత కలిగిన వాల్మీకి నాయకులకు కీలక పదవులు కేటాయించాలని కోరారు. గుంతకల్లు మండలంలోని పలు గ్రామాల్లో వాల్మీకులు పెద్ద సంఖ్యలో ఉన్నప్పటికీ, రాజకీయంగా మరియు స్థానిక పదవుల్లో తమకు తగిన ప్రాతినిధ్యం దక్కడం లేదని సంఘాల నాయకులు పేర్కొన్నారు. ప్రస్తుతం నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ఎమ్మెల్యే వాల్మీకి సామాజిక వర్గానికి ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చి, అర్హత కలిగిన నాయకులకు అవకాశం కల్పించాలని వారు కోరారు.తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం అనంతరం నందమూరి తారక రామారావు బీసీలకు రాజకీయంగా ప్రాధాన్యం కల్పించేందుకు బీసీ గర్జన వంటి కార్యక్రమాలు చేపట్టి సామాజిక వర్గాలకు ప్రాతినిధ్యం పెంచారని వాల్మీకి సంఘాల నాయకులు గుర్తుచేశారు. అదే స్ఫూర్తిని కొనసాగిస్తూ ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో వాల్మీకులకు మరింత ప్రాధాన్యం లభిస్తుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. గుంతకల్లు మండలంలోని గ్రామీణ ప్రాంతాల వాస్తవ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని, స్థానిక సంస్థల ఎన్నికల్లో వాల్మీకులకు తగిన రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలని వారు కోరారు. వాల్మీకి సామాజిక వర్గానికి చెందిన అర్హత, సామర్థ్యం ఉన్న నాయకులను గుర్తించి పదవులు కేటాయిస్తే గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి మరింత దోహదపడుతుందని తెలిపారు.వాల్మీకి సమాజం తమపై ఉంచుకున్న నమ్మకాన్ని ప్రభుత్వం, స్థానిక ప్రజాప్రతినిధులు నిలబెట్టుకోవాలని సంఘాల నాయకులు ఆకాంక్షించారు. వాల్మీకులకు తగిన ప్రాధాన్యం కల్పించే విషయంలో ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.

# రాష్ట్ర ప్రభుత్వం 12 వ పిఆర్ సి కమిటీ వెంటనే ప్రకటించాలి

**కాంట్రాక్ట్,అవుట్సోర్సింగ్ కార్మికులకు 26000 కనీస వేతనం ఇవ్వాలి: ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేష్ గౌడ్**




**గుంతకల్లు ఆగస్టు 26 (ప్రజా జ్యోతి):** రాష్ట్ర ప్రభుత్వం 12 వ పిఆర్ సి కమిటీ వెంటనే ప్రకటించాలని, కాంట్రాక్ట్,అవుట్సోర్సింగ్ కార్మికులకు 26000 కనీస వేతనం ఇవ్వాలని, కార్మిక, ఉద్యోగ సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేష్ గౌడ్ బుధవారం స్థానిక బిటి పక్కిరప్ప భవన్ నందు ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రాజేష్ గౌడ్ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు పూర్తి పూర్తి అయినా ప్రభుత్వ ఉద్యోగులకు పెండింగ్ ఉన్న డిఏలు,సరెండర్ లీవ్స్ ఎన్క్యాష్ మెంట్ ఇవ్వడం లేదన్నారు,12 వ పి ఆర్ సి కమిటీ వేయకుండా కాలయాపన చేస్తున్నారన్నా రు, వెంటనే కమిటీ వేసి ఐ ఆర్ ప్రకటించాలన్నారు, నిత్యావసర వస్తువుల ధరలకు అనుకూలంగా కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలని, పార్లమెంట్ కమిటీలు చెబుతున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం మాత్రం అమలు చేయడం లేదన్నారు. కాంట్రాక్ట్,అవుట్ సోర్సింగ్ కార్మికులకు 26,000 కనీస వేతనం ఇవ్వాలన్నారు, ట్రాన్స్పోర్టు రంగంలో పనిచేస్తున్న కార్మికులను ఇబ్బంది పెట్టే విధంగా ప్రభుత్వం తీసుకొచ్చిన జిఓ నెం 21,31 ద్వారా వేల రుపాయలు ఫైన్లు వేస్తూ కార్మికుల నడ్డివిస్తున్నార న్నారు, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్కసారి మాత్రమే వాహనమిత్ర ఇచ్చి వాహనాల తనిఖీ పేరుతో వేల రూపాయలు ఫైన్లు వేయడం సరైందికాదన్నారు, పలు సమస్యలపై ఏఐటియుసి ఆధ్వర్యంలో దశలవారీ ఆందోళనలు చేపడతామన్నారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు మహేష్, మండల కార్యదర్శి దాసరి శ్రీనివాసులు, మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేష్, ఆటో డ్రైవర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కృష్ణానాయక్, జిల్లా సహాయ కార్యదర్శి నరసింహ, మండల కార్యనిర్వాహక అధ్యక్షులు మల్లయ్య, నాయకులు చిన్నా తదితరులు పాల్గొన్నారు.

# మహా గురుకులంలో సమస్యలు విలయతాండవం చేస్తున్నా పట్టించుకోని జిల్లా అధికారులు

**ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి పెద్దలపల్లి ప్రభాకర్**




**బ్రహ్మంగారిమఠం –ప్రజా జ్యోతి ఆగస్టు 26** మండల కేంద్రంలోని తోట్లపల్లి వద్ద ఉన్న మహా గురుకులంలో విద్యార్థుల సమస్యలు విలయతాండవం చేస్తున్న జిల్లా అధికారులు పట్టించుకోవడంలేదని అఖిల భారత యువ జన సమాఖ్య ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి పెద్దలపల్లి ప్రభాకర్ పేర్కొన్నారు. మంగళ వారం ఏఐవైఎఫ్ ఏఐఎస్ఎఫ్ నాయకులు తోట్ల పల్లి మహా గురుకులంను సందర్శించడం జరి గింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత విద్యా సంవత్సరం ప్రారంభంలో ఎంతో అట్టహాసంగా ప్రారంభం చేసిన మహా గురు కులం రెండవ విద్యా సంవత్సరం పూర్తవుతున్న కూడా అక్కడ ఉంటున్న విద్యార్థులకు ఎలాంటి వసతులు కల్పించ కుండా వారి సమస్యలు పరిష్కరించకుండా జిల్లా అధికారులు నిర్లక్ష్యం చేస్తూ విద్యార్థులు సమస్యలను గాలికి వదిలేశారని పేర్కొన్నారు. విద్యార్థుల మౌలిక వసతులైన త్రాగడానికి సరైన నీటి సదుపా యం లేకుండా ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేయకుండా అదే వి ధంగా స్నానం చేయడానికి నీరు మరియు మరుగుదొడ్లు అపరి శుభ్రంగా మరుగుదొడ్లల్లోకి నీరు సరఫరా ఆగిపోయిన విద్యార్థు ల బాగోగులు చూడాల్సిన ప్రిన్సిపల్ కనీసం విద్యార్థుల మౌలిక వసతులపై చర్యలు తీసుకోకుండా, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ విద్యార్థులకు త్రాగడానికి స్నానం చేయడానికి ఉపయోగిస్తూ రాత్రిపూట ఆ నీరు తాగడానికి వెళ్లాలంటే ఎక్కడ విషపురుగులు కరుస్తాయో అని విద్యార్థులు భయాందోళన చెందుతున్నారని, విద్యార్థులకు ఇవ్వాల్సిన మెనూలో అవకతవకలు చేస్తూ వార్డన్ మరియు ప్రిన్సిపల్ విద్యార్థుల కడుపు కొడుతున్నారని పేర్కొ న్నారు. విద్యార్థులకు వారంలో రెండుసార్లు చికెన్ ఇవ్వాల్సి వస్తే ఒక్కో విద్యార్థికి 360 గ్రాములు వారంలో రెండు సార్లు ఇవ్వాలి కేవలం ఒక విద్యార్థికి 120 గ్రాములు చికెన్ ఇస్తూ మిగిలిన 40 గ్రాములు విద్యార్థుల సొమ్మును అప్పనంగా స్వాహా చేస్తున్నారని వారు పేర్కొన్నారు. విద్యార్థులకు డైనింగ్ హాల్ చుట్టూ అపరిశుభ్రంగా ఉంది. విద్యార్థులు హాస్టల్ నుంచి స్కూలుకు పోయే దారిలో మధ్యలో చెక్ డ్యామ్‌వాగు పెద్దగా ఉండడంతో విద్యార్థులు కిందపడి గాయాలపాయలవుతున్న కూడా ప్రిన్సిపాల్ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. అక్కడ విద్యార్థుల పరిస్థితిని పట్టించుకునే నాథుడే లేదని వారు ఆరోపించారు. ఉన్నఫ లంగా పాత గురుకు లంలో ఉన్న విద్యార్థులను మహా గురుకులం లోకి తరలించడంతో సరైన సిబ్బంది, వర్కర్లు కొరతతో విద్యార్థులు ఇబ్బం ది పడుతున్నారు. తక్షణమే విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బ్రహ్మంగారిమఠం మండల కేంద్రంలో ఉన్న పాత గురుకుల విద్యార్థులను ఒక్క నిమిషం పాత గురుకుల పాఠశాలకు పంపించి అక్కడ స్కూలును యధావిధిగా కొనసా గించి మహా గురుకులంకి వచ్చిన విద్యార్థులకు సరైన మౌలిక వసతులు కల్పించి స్కూలును అభివృద్ధి చేయాలని వారు పేర్కొ న్నారు. పాత గురుకుల పాఠశాలను యధావిధిగా కొనసాగించి రెండు గురుకుల పాఠశాలలో విద్యార్థులకు వసతులు కల్పించాలని లేనిపక్షంలో విద్యార్థులతో ప్రత్యక్ష ఆందోళనలకు దిగుతామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి గుడిమే సురేష్ కుమార్ ఏఐఎస్ఎఫ్ నాయకులు సుమంత్ కుమార్ అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

## మత్తు మహమ్మారిపై మరో అస్త్రం

**యువతను అప్రమత్తం చేసేందుకు డ్రగ్స్ వద్దు బిడ్డా యాడ్ ఫిలిం**



**గుంటూరు ఆగస్టు 26 (ప్రజా జ్యోతి ప్రతినిధి)** యువతను మత్తు పదార్థాల బారిన పడకుండా కాపాడటంతో పాటు డ్రగ్స్ దుష్పరిణామాలపై సమాజంలో విస్తృత అవగాహన కల్పించేందుకు గుంటూరు జిల్లా పోలీసులు మరో అడుగు ముందుకేశారు. ఇందులో భాగంగా రూపొందించిన డ్రగ్స్ వద్దు బిడ్డా,ఎ బ్యాటిల్ ఎగైనెస్ట్ డ్రగ్స్ అవగాహన యాడ్ ఫిలింను మంగళవారం మైత్రి సినిమా కాంప్లెక్స్‌లో రాజ్యసభ సభ్యులు భాష్యం రామకృష్ణ, జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్, ఐపీఎస్‌లు ప్రారంభించారు.రెండు నిమిషాల నిడివి ఉన్న ఈ యాడ్ ఫిలింను సినీ దర్శకుడు దిలీప్ రాజా నేతృత్వంలో రూపొందించారు. డ్రగ్స్‌కు దూరంగా ఉండాల్సిన ఆవశ్యకతతో పాటు పిల్లల ప్రవర్తన, అలవాట్లు, స్నేహాలపై తల్లిదండ్రులు నిరంతరం దృష్టి పెట్టాలనే సందేశాన్ని ఇందులో పొందుపరిచారు. సినిమా థియేటర్లతో పాటు సోషల్ మీడియా ద్వారా ఈ సందేశాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు పోలీసులు చర్యలు చేపడుతున్నారు.డ్రగ్స్ నియంత్రణలో భాగంగా జిల్లాలో ఇప్పటికే విస్తృతంగా చర్యలు చేపట్టినట్లు ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. గంజాయి అక్రమ రవాణా, విక్రయం, సరఫరాకు సంబంధించి సుమారు 450 మందిని అరెస్టు చేసినట్లు వెల్లడించారు. వారి నుంచి 141 కిలోల గంజాయి, 4 కిలోల ద్రవరూప గంజాయి, 5.783 కిలోల ఎండీఎంఏ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నేర కార్యకలాపాలపై నిఘాలో భాగంగా 28 రౌడీషీట్లు, 582 సస్పెక్ట్ షీట్లు తెరిచినట్లు పేర్కొన్నారు. పదేపదే గంజాయి వ్యాపారానికి పాల్పడుతున్న తొమ్మిది మందిని పిట్ ఎన్‌డీపీఎస్ చట్టం కింద నిర్బంధించినట్లు చెప్పారు.డ్రగ్స్ వ్యతిరేక ప్రచారంలో భాగంగా సంకల్పం,325 కార్యక్రమం ద్వారా కళాశాలల్లో 70 వేల మందికిపైగా విద్యార్థులకు అవగాహన కల్పించినట్లు ఎస్పీ తెలిపారు. పోలీసులతో పాటు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, యువత, ప్రజలు కలిసి పనిచేస్తేనే డ్రగ్స్ రహిత సమాజం సాధ్యమవుతుందని అన్నారు.రాజ్యసభ సభ్యులు భాష్యం రామకృష్ణ మాట్లాడుతూ యువతను డ్రగ్స్‌కు దూరంగా ఉంచేందుకు జిల్లా పోలీసుల చర్యలు అభినందనీయమన్నారు. దర్శకుడు దిలీప్ రాజా, సీనియర్ నటుడు నరసింహరాజు మాట్లాడుతూ సామాజిక బాధ్యతతో రూపొందించిన ఈ యాడ్ ఫిలింలో భాగస్వాములు కావడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ డీఎస్పీ బెల్లం శ్రీనివాసరావు, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ అలహరి శ్రీనివాస రావు, తెనాలి డీఎస్పీ బి.జనార్దన్‌రావు, ఈస్ట్ డీఎస్పీ టి.సీతారాం, సౌత్ డీఎస్పీ పూర్ణచంద్రరావు, నార్త్ డీఎస్పీ మురళీకృష్ణ, నగరంపాలెం సీఐ మునిపల్లి రాజేష్, ఐటీ కోర్ సీఐ నిస్సార్ భాష, ఎస్‌బీ సీఐ మల్లికార్జునరావు, ఎస్ఐలు రాంబాబు, రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


## డాక్టర్ సామ్యూల్ దినకరన్ కాకినాడ రాక



**కాకినాడ జిల్లా (ప్రజా జ్యోతి)** కారుణ్య విద్యాసంస్థల (డీమ్డ్ యూనివర్సిటీ) వైస్ చైర్మన్ డాక్టర్ సామ్యూల్ దినకరన్ అక్టోబర్ 18 నుండి 20 వరకు కాకినాడ మెక్లారిన్ హై స్కూల్ గ్రౌండ్ లో జరిగే సివైఎఫ్ అంతర్జాతీయ యువజన మహోత్సవాలు "క్లిక్ అండ్ కమిట్ 2026"కు హాజరవనున్నారని సివైఎఫ్ డైరెక్టర్ బిహెచ్.వి మూర్తి రాజు తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా చెడు వ్యసనాలతో జీవిస్తున్న అనేకమందిని సన్మార్గంలో నడిపిస్తున్న దైవజనులు బ్రదర్ సామ్యూల్ దినకరన్, సివైఎఫ్ డైరెక్టర్ డా. బి. హెచ్.వి మూర్తి రాజు యువతకు నైతిక విలువలు గూర్చి బోధించనున్నారు. ఈ సందర్భంగా మూర్తిరాజు మీడియాతో మాట్లాడుతూ మహోత్సవాలలో ప్రపంచవ్యాప్తంగా వాడబడుచున్న ప్రముఖ భారతీయ పియానిస్ట్ కంపోజర్ సంగీత దర్శకుడు స్టీఫెన్ దేవసి, వన్ మేన్ బ్యాండ్ ఇండియా గ్లాడ్సన్ పీటర్ వినూత్న రూపంలో సంగీతాన్ని అందించనున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ గాయని గాయకులచే "ఏకమ్ సీజన్ 5"ప్రత్యేక ఆకర్షణగా నిలవబోతోందన్నారు. రక్తదాన శిబిరం, జాబ్ మేళా అదేవిధంగా ప్రతిరోజు ఉదయం 9 గంటల నుండి యువతకు ప్రత్యేక వ్యక్తిత్వ వికాస తరగతులు, మధ్యాహ్నం సాంస్కృతిక కార్యక్రమాలు, సాయంత్రం అందరికీ బహిరంగ సభ జరుగుతుందని అందరూ ఆహ్వానితులే అని తెలిపారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే యువతకు సామాన్యమైన భోజన,వసతులు కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఈవెంట్ కోఆర్డినేటర్స్ కలవల జాన్ విక్లిఫ్, పాస్టర్ మాసా సుదీర్ సన్నీ, బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ సిస్టర్ ఉషారాణి, సునీల్, సి కె సింగ్,విజయ భాస్కర్, పెయ్యల నాని బాబు, మచ్చా బుజ్జి బాబు, తెలుగు రవి, వారా వినోద్, మధుసూదన్ రావు, వల్లూరి నానాజీ,చైతన్య, లోకేష్, షాలిని, అర్పణ,అను తదితరులు పాల్గొన్నారు.

## అంజనేయులు రెడ్డికి 'గ్లోబల్ ఇన్‌స్పిరేషన్' అంతర్జాతీయ అవార్డు




**కాకినాడ జిల్లా (ప్రజా జ్యోతి)** సంపాదనలో కొంత భాగాన్ని సమాజ సేవకు కేటాయిస్తూ చిరు వ్యాపారం చేసుకుంటూనే నిరంతరం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న కాకినాడకు చెందిన 'సేవారత్న' అనపాల అంజనేయులు రెడ్డికి అంతర్జాతీయ స్థాయిలో అరుదైన గుర్తింపు లభించింది. ప్రజా, సామాజిక సేవా రంగాల్లో ఆయన చేస్తున్న సేవలను గుర్తిస్తూ 'గ్లోబల్ ఇన్‌స్పిరేషన్ ఇంటర్నేషనల్ అవార్డు--2026'కు ఎంపిక చేశారు. పాన్ ఇండియన్ సోషియో కల్చరల్ అసోసియేషన్, మలేషియాలోని తెలుగు ఎక్స్‌పాట్స్ అసోసియేషన్ సంయుక్తంగా ఈ పురస్కారాన్ని అందిస్తున్నాయి. సెప్టెంబరు 9న మలేషియాలోని కౌలాలంపూర్‌లో జరిగే కార్యక్రమంలో అవార్డును ప్రదానం చేయనున్నారు. చిరు వ్యాపారం ద్వారా జీవనం సాగిస్తున్న అంజనేయులు రెడ్డి, తనకు చేతనైనంత మేర సమాజానికి సేవ చేయాలనే లక్ష్యంతో 365 రోజులూ బాటసారులకు తాగునీరు అందిస్తున్నారు. ఎండ, వానతో సంబంధం లేకుండా బాటసారుల దాహం తీర్చేందుకు తాగునీటి సదుపాయం కల్పిస్తున్నారు. అంతేకాకుండా పాఠశాల విద్యార్థులకు ఉచితంగా పెన్నులు, పుస్తకాలు అందిస్తూ విద్యార్థులను ప్రోత్సహిస్తున్నారు. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద కుటుంబాలకు నిత్యావసర సరుకులను పంపిణీ చేస్తూ తన వంతు సహాయాన్ని అందిస్తున్నారు. ప్రచార ఆర్భాటాలకు దూరంగా, తనకు ఉన్న పరిమిత వనరులతోనే నిరంతరం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న అంజనేయులు రెడ్డి సేవలను గుర్తించి అంతర్జాతీయ అవార్డుకు ఎంపిక చేయడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## శాంతియుత సమాజాన్ని నెల కోల్పడానికి జీవితకాలం కృషి చేసిన ప్రవక్త మహమ్మద్

**గాజుల ఖాదర్ బాషా**
**రాష్ట్ర తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు**



**రాయచోటి ఆగస్టు 26 ప్రజా జ్యోతి** సర్వ మానవాళి శ్రేయస్సు కోసం శాంతిని నెలకొల్పేందుకు కృషి చేసిన కారణజన్ముడు మహమ్మద్ ప్రవక్త అని గాజుల ఖాదర్ భాషా పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాటివారి పట్ల ప్రేమ దయను కలిగి ఉంటూ శాంతియుత సమాజాన్ని నెలకొల్పడానికి జీవితకాలం కృషిచేసిన మహమ్మద్ ప్రవక్త జన్మదినాన్ని అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకుంటున్న ముస్లిం సోదరులందరికీ కూడా మిలాద్ ఉన్ నబిశుభాకాంక్షలు తెలియజేసిన గాజుల ఖాదర్బాషా అనంతరం రాష్ట్ర హిందూ ముస్లిం సహోదరులందరూ ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని మహమ్మద్ ప్రవక్త జన్మదినాన ఆయన అల్లాను కోరారు.

## ఎల్లార్తిలో వైభవంగా శ్రీ సుంకులమ్మ దేవాలయ ప్రారంభోత్సవం

**భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు..**
**పాల్గొన్న టీడీపీ ఇంచార్జ్ శ్రీమతి వైకుంఠం జ్యోతి**



**హొళగుంద, ఆగస్టు 26, ప్రజా జ్యోతి న్యూస్ –** మండలంలోని ఎల్లార్తి గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ సుంకులమ్మ అమ్మవారి దేవాలయ ప్రారంభోత్సవ వేడుకలు బుధవారం అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి, గ్రామస్థులు భక్తి శ్రద్ధలతో అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమానికి ఆలూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి శ్రీమతి వైకుంఠం జ్యోతి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వైకుంఠం జ్యోతి శ్రీ సుంకులమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, గ్రామంలో సుఖశాంతులు, సౌభాగ్యం, పాడిపంటలు సమృద్ధిగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ వేడుకల్లో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. గ్రామ ప్రజలు, మహిళలు, యువత ఉత్సాహంగా పాల్గొనడంతో ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. గ్రామస్థుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ దేవాలయ ప్రారంభోత్సవ వేడుకలు ఘనంగా ముగిశాయి.

## శ్రీ వెంగమాంబ నూతన ఆలయ నిర్మాణానికి భూమిపూజ

**శంకుస్థాపన చేసిన టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు కానాల మల్లికార్జున రెడ్డి**



**బ్రహ్మంగారిమఠం– ప్రజా జ్యోతిఆగష్టు 26** మండల కేంద్రంలోని రేకలకుంట పంచాయతీ వాంపల్లెచెరువు గ్రామంలో శ్రీ వెంగమాంబ నూతన ఆలయ నిర్మాణానికి భూమిపూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ఆదేశాల మేరకు మండల టీడీపీ అధ్యక్షులు చెన్నుపల్లి సుబ్బారెడ్డి సహకారంతో ఈ ఆలయ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ ఆలయ నిర్మాణానికి తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) నిధులతో సుమారు రూ.40 లక్షల వ్యయంతో నిర్మించనున్న శ్రీ వెంగమాంబ నూతన ఆలయానికి భూమిపూజ చేసి శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బి. మఠం మాజీ మండల అధ్యక్షులు మాలేపాటి సుబ్బారావు, కడప జిల్లా టీడీపీ ఉపాధ్యక్షులు కానాల మల్లికార్జున రెడ్డి పాల్గొని ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ గ్రామంలో నూతన ఆలయ నిర్మాణానికి సహకరిస్తున్న ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్, టీడీపీ నాయకులు, టీటీడీకి కృతజ్ఞతలు తెలిపారు. ఆలయ నిర్మాణం పూర్తయితే గ్రామ ప్రజలకు ఆధ్యాత్మికంగా ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## క్యాన్సర్ బాధిత కుటుంబానికి అండగా చిత్రాడ గ్రామస్థులు



**కాకినాడ జిల్లా పిఠాపురం మండలం (ప్రజా జ్యోతి)** చిత్రాడ గ్రామంలోని అరుంధతి కాలనీకి చెందిన ఆటో డ్రైవర్ కృష్ణబాబు కొంతకాలంగా క్యాన్సర్‌తో బాధపడుతూ వైద్య చికిత్స కోసం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం తెలుసుకున్న చిత్రాడ గ్రామస్థులు మానవతా దృక్పథంతో స్పందించారు. కృష్ణబాబు కుటుంబ పరిస్థితిని తెలుసుకున్న గ్రామ పెద్దలు, యువకులు, గవర్నమెంట్ ఎంప్లాయిలు, దాతలు కలిసి పార్టీలకు, కులమతాలకు అతీతంగా తమకు తోచిన విధంగా సహాయాన్ని అందించారు. ఈ క్రమంలో సేకరించిన రూ.40,000/– ఆర్థిక సహాయంతో పాటు బియ్యం, కూరగాయలు, నిత్యావసర సరుకులు బుధవారం కృష్ణబాబు కుటుంబ సభ్యులకు అందజేశారు. కష్టకాలంలో ఉన్న కుటుంబానికి అండగా నిలిచిన దాతలు, గ్రామ పెద్దలు, యువత, గవర్నమెంట్ ఎంప్లాయిలు, మరియు సహకరించిన ప్రతి ఒక్కరికీ చిత్రాడ గ్రామస్థుల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఆసుపత్రిలో వైద్య పరీక్షలు పూర్తయిన అనంతరం వైద్యులు సూచించే తదుపరి చికిత్స, అవసరాలను బట్టి కృష్ణబాబు కుటుంబానికి అవసరమైన సహాయాన్ని మరోసారి అందించేందుకు గ్రామస్థులు ముందుకు రావాలని నిర్ణయించారు. "చేయి చేయి కలుపుదాం.. ఆ కుటుంబాన్ని నిలబెడదాం" అనే సంకల్పంతో కృష్ణబాబు కుటుంబానికి అండగా నిలుస్తామని గ్రామస్థులు తెలిపారు. ఆపదలో ఉన్న కుటుంబానికి రాజకీయాలకు అతీతంగా మానవతా దృక్పథంతో సహాయం చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా చిత్రాడ గ్రామస్థుల ఐక్యత, మానవత్వం, సేవా భావం మరోసారి చాటిచెప్పబడింది.

## సూర్యలంక బీచ్ రోడ్డులో పోలీసుల వాహన తనిఖీలు



**బాపట్ల ఆగస్టు 26 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)**జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వరరావు ఆదేశాల మేరకు బాపట్ల రూరల్ పోలీసుల ఆధ్వర్యంలో సూర్యలంక బీచ్ రోడ్డులో బుధవారం వాహన తనిఖీలు నిర్వహించారు. బాపట్ల రూరల్ సీఐ కె. ప్రభాకర్‌రావు, మహిళా ఎస్ఐ అలేఖ్య పోలీసు సిబ్బందితో కలిసి వాహనాలను తనిఖీ చేశారు. బీచ్ ప్రాంతంలో అనుమానాస్పద వ్యక్తులు, వాహనాల కదలికలను పరిశీలిస్తూ విజిబుల్ పోలీసింగ్ నిర్వహించారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, ప్రయాణ సమయంలో అవసరమైన ధ్రువపత్రాలు వెంట ఉంచుకోవాలని పోలీసులు సూచించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, వాహనాలను అతివేగంగా నడపకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. బీచ్ రోడ్డులో రాత్రి వేళల్లో అసాంఘిక కార్యకలాపాలకు తావులేకుండా నిరంతరం నిఘా కొనసాగిస్తామని పోలీసులు తెలిపారు. ప్రజల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ విజిబుల్ పోలీసింగ్‌ను మరింత విస్తృతం చేయనున్నట్లు పేర్కొన్నారు. బీచ్ ప్రాంతానికి వచ్చే పర్యాటకులు, ప్రజలు పోలీసులకు సహకరించాలని అధికారులు కోరారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బందితోపాటు ప్రజలు పాల్గొన్నారు

## ధర్మవరంలో మృతుల కుటుంబాలను పరామర్శించిన ముదునూరి

**--ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా మురళీ కృష్ణంరాజు రూ. 10 వేలు ఆర్థిక సాయం**




**కాకినాడ జిల్లా ఆగస్టు 26 (ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్)** ప్రత్తిపాడు నియోజకవర్గంలోని ధర్మవరం గ్రామంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి,నరసాపురం పార్లమెంట్ పరిశీలకులు,ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ముదునూరి మురళీ కృష్ణంరాజు పర్యటించారు. ఈ సందర్భంగా ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన గొర్ల లోవయ్య కుటుంబాన్ని,అనారోగ్యంతో మృతి చెందిన నూలు సత్యనారాయణ భార్య శేషారత్నం కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. మృతుల కుటుంబాలకు ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ తరఫున ఒక్కొక్క కుటుంబానికి రూ.5 వేల చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో కోలా తాతబాబు,కోన బాబ్జి,ఉర్లంకల చంద్రరావు,గింజాల కృష్ణ,పలివెల లక్ష్మీనారాయణ,గుద్దేటి రమేష్,కప్పుల సత్యనారాయణ, కొండేటి శ్రీను తదితర నాయకులు పాల్గొన్నారు.

## గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యం...!!

**ఎమ్మెల్యే వసంత....!!**





**జి.కొండూరు/ ఇబ్రహీం పట్నం:( ఆగస్టు 26,ప్రజా జ్యోతి బ్యూరో భట్టిప్రోలు నాగేశ్వరరావు):** మైలవరం శాసన సభ్యులు వసంత కృష్ణ ప్రసాద్ బుధవారం ఇబ్రహీంపట్నం మండలంలోని గుంటుపల్లి గ్రామంలో రూ.36 లక్షల వ్యయంతో నిర్మించిన గ్రామీణ ఆరోగ్య కేంద్ర భవనాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు.... గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా మైలవరం నియోజకవర్గంలో వైద్య మౌలిక వసతులను బలోపేతం చేస్తున్నామని అన్నారు. అలాగే గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు వైద్య సేవలు అందుబాటులో ఉండేలా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు. ఆరోగ్య కేంద్రాలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడం ద్వారా గ్రామీణ ప్రజలు చిన్నచిన్న అనారోగ్య సమస్యలకు దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా స్థానికంగానే వైద్య సేవలు పొందే అవకాశం ఏర్పడుతుందని తెలిపారు. గుంటుపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన ఈ ఆరోగ్య కేంద్రం ద్వారా గ్రామ ప్రజలతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు కూడా ప్రాథమిక వైద్య సేవలు మరింత సులభంగా అందుబాటులోకి వస్తాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రజారోగ్య పరిరక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, అవసరమైన చోట వైద్య మౌలిక వసతులను మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని చెప్పారు. గ్రామీణ ఆరోగ్య కేంద్రాల ద్వారా సాధారణ వైద్య పరీక్షలు, ప్రాథమిక చికిత్స, ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు తదితర సేవలు ప్రజలకు చేరువ కావడంతో గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య ప్రమాణాలు మెరుగుపడతాయని ఆయన తెలిపారు. ప్రజలకు నాణ్యమైన వైద్యం అందేలా వైద్య సిబ్బంది, అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. నూతన ఆరోగ్య కేంద్ర భవనం అందుబాటులోకి రావడంతో గుంటుపల్లి గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. గ్రామంలో వైద్య సదుపాయాలను మెరుగుపరిచిన ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు కి స్థానిక ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# మారుమూల గిరిజన గ్రామాల రహదారుల రహదారి సమస్యలు పరిష్కరించాలి



**ఏపీ.ఎం.సీ.డీ.సీ చైర్మన్ చిన్నపల్లి శ్రీనును కలిసి సమస్యలపై వినతి పత్రం అందజేసిన జనసేన జననాయకుడుచిట్టం మురళి.**

**అనంతగిరి మండలం ఆగస్టు 26. ప్రజా జ్యోతి న్యూస్. రిపోర్టర్ శంకర్.** అనంతగిరి మండల జనసేన పార్టీ నాయకుడు చిట్టెం మురళి అంటేనే జననాయకుడిగా మండలంలో గుర్తింపు ఉంది నిత్యం ప్రజా సమస్యలపై రాష్ట్ర స్థాయి నాయకులు. జిల్లా అధికారులు మండల స్థాయి అధికారులను నేరుగా కలిసి వివిధ ప్రజా సమస్యలపై వినతి పత్రాలు అందజేస్తూ సమస్యలు పరిష్కరించాలని ప్రజల కోసం పోరాటం చేస్తూ వస్తున్నారు.

**అల్లూరి సీతారామరాజు జిల్లా**

అనంతగిరి మండలంలోని గిరిజన గ్రామాల ప్రజలు ఎదుర్కొంటున్న రహదారి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ జనసేన పార్టీ అనంతగిరి మండల అధ్యక్షుడు చిట్టం మురళి మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో ఏ.పీ.ఎం.సీ. డీ.సీ చైర్మన్ చిన్నపల్లి శ్రీనును కలిసి వినతిపత్రం అందజేశారు. పినకోట పంచాయతీ వీరభద్రపురం గ్రామం నుంచి జీనబాడు పంచాయతీ వలసల గరువు వరకు సుమారు 5.కిలోమీటర్ల రహదారి నిర్మాణానికి, అలాగే కొండిబ పంచాయతీ సాడ జంక్షన్ నుంచి కోసమామిడి.కప్పటి వలస వరకు కొత్త రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు.? రోడ్డు సౌకర్యం లేకపోవడంతో గిరిజనులు నిత్యం అవస్థలు పడుతున్నారని, ముఖ్యంగా అత్యవసర వైద్య పరిస్థితుల్లో గ్రామాలకు అంబులెన్స్‌లు రాక గర్భిణులు, వృద్ధులు. చిన్నారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. అంతేకాకుండా వీరభద్రపురం. వలసల గరువు వాసులు రైవాడ రిజర్వాయర్ మీదుగా వర్షాకాలంలో పడవలపై ప్రమాదకర ప్రయాణం చేస్తున్నారని వివరించారు. ఈ రహదారులు పూర్తయితే గిరిజన ప్రాంతాలకు విద్య, వైద్యం, వ్యవసాయ ఉత్పత్తుల రవాణా మెరుగవుతాయని తెలిపారు. ప్రభుత్వం స్పందించి నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ కార్యదర్శి పాంగి లక్ష్మణ్ పాల్గొన్నారు.

## టీడీపీ కార్యకర్త కుటుంబానికి రూ.5 లక్షల ప్రమాద బీమా అందజేత



**ప్యాపిలి (ప్రజా జ్యోతి ) రిపోర్టర్ బండి రమేష్ ఆగస్టు 26** డోన్ నియోజకవర్గం ప్యాపిలి మండలం ఎన్. రంగాపురం గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త కొప్పెల సురేంద్ర గారు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. టీడీపీ సభ్యత్వం ద్వారా మంజూరైన రూ.5 లక్షల ప్రమాద బీమా పత్రాలను ఆయన కుటుంబ సభ్యులకు గౌరవ డోన్ ఎమ్మెల్యే శ్రీ కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి గారు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీ కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి గారు మాట్లాడుతూ.. "కార్యకర్తలే పార్టీకి బలం.. వారి కుటుంబాలే మా బాధ్యత" అని అన్నారు. కార్యకర్తలకు పార్టీ సభ్యత్వం ద్వారా ప్రమాద బీమా కల్పిస్తూ, ఆపద సమయంలో వారి కుటుంబాలకు టీడీపీ అండగా నిలుస్తోందని తెలిపారు. టీడీపీ కార్యకర్తల సంక్షేమానికి పార్టీ అధినేత శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు, జాతీయ ప్రధాన కార్యదర్శి శ్రీ నారా లోకేష్ గారు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని ఎమ్మెల్యే గారు పేర్కొన్నారు. కార్యకర్తల కుటుంబాలకు కష్టకాలంలో ఆర్థిక భరోసా కల్పించేలా టీడీపీ సభ్యత్వం ఎంతో ఉపయోగకరంగా ఉందని తెలిపారు. టిడిపి నాయకులు కార్యకర్తలు ప్యాపిలి ఖాజా పీరా మెట్టుపల్లె సుదర్శన్ తలారి వెంకటేష్ మాజీ సర్పంచ్ కోనేటి కిష్టన్న ఆర్సి మద్దిలేటి పి శ్రీరాములు ఎం రామచంద్ర కె సురేష్ టి వెంకటేష్ పాల్గొన్నారు

## గొల్లప్రోలులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



**కాకినాడ జిల్లా గొల్లప్రోలు (ప్రజా జ్యోతి)** గొల్లప్రోలు లో బుధవారం సాయంత్రం ఒక గుర్తు తెలియని పురుషుడి మృతదేహం లభ్యమైనట్లు గొల్లప్రోలు పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం... బుధవారం సాయంత్రం సుమారు 5:00 గంటల సమయంలో, జాతీయ రహదారి 216 పక్కన ఉన్న శ్రీరామ్ స్కూల్ సమీపంలోని పొదల్లో గల వర్షపు నీటి గుంటలో ఒక వ్యక్తి మృతదేహం పడి ఉండటాన్ని గమనించారు. మృతి చెందిన వ్యక్తి వయస్సు సుమారు 45 నుండి 50 సంవత్సరాలు ఉంటుందని అంచనా వేస్తున్నారు.

**మృతుని ఆనవాళ్లు**

**ఎత్తు:** సుమారు 5 అడుగులు, నలుపు రంగు టీ-షర్ట్, ఖాకీ రంగు నిక్కర్ ధరించి ఉన్నాడు. ఈ వ్యక్తికి సంబంధించిన ఎలాంటి ఆచూకీ లేదా వివరాలు తెలిసినా వెంటనే తమకు సమాచారం అందించాలని గొల్లప్రోలు సబ్-ఇన్స్పెక్టర్ నౌడ్ రామకృష్ణ తెలియజేశారు. సమాచారం ఉన్నవారు 9440900758 అనే ఫోన్ నంబర్‌కు సంప్రదించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.

# "35 ఏళ్లు ఎదురుచూశారు.. పవన్ వచ్చి చేసి చూపించారు!"

"మాట ఇస్తే మడమ తిప్పం.. ప్రజల సమస్యకు పరిష్కారం చూపించాల్సిందే!"

--- గొల్లప్రోలు 20వ వార్డులో రోడ్లు, డ్రైనేజీ పనులకు శ్రీకారం..

జనసేనాని చొరవతో 35 ఏళ్ల నిరీక్షణకు తెర, జెట్ స్పీడ్‌లో అభివృద్ధి పనులు





**కాకినాడ జిల్లా గొల్లప్రోలు (ప్రజా జ్యోతి) (ప్రతినిధి. బోర శివారెడ్డి..)** మాట ఇస్తే మడమ తిప్పని నైజం.. ప్రజల కష్టం చూస్తే తట్టుకోలేని గుణం.. దశాబ్దాల సమస్య అయినా సరే, జనసేనాని అడుగు పెడితే అక్కడ పరిష్కారం జెట్ స్పీడ్‌లో జరగాల్సిందే!" అని పిఠాపురం నియోజకవర్గం మరోసారి నిరూపించింది. గత 35 సంవత్సరాలుగా ఏ పాలకుడూ పట్టించుకోక, అభివృద్ధికి నోచుకోక అంధకారంలో మగ్గిపోయిన గొల్లప్రోలు నగర పంచాయతీ 20వ వార్డు ప్రజల కష్టాలకు ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, పిఠాపురం శాసనసభ్యులు పవన్ కళ్యాణ్ చొరవతో శాశ్వత విముక్తి లభించింది. పిఠాపురం నియోజకవర్గంలో పవన్ కళ్యాణ్ ఎమ్మెల్యేగా, డిప్యూటీ సీఎంగా బాధ్యతలు చేపట్టిన నాటి నుండి అభివృద్ధి పనులు ఎన్నడూ లేని విధంగా శరవేగంతో దూసుకుపోతున్నాయి. 20వ వార్డులో సరైన రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ లేక స్థానిక ప్రజలు నరకయాతన అనుభవిస్తున్న విషయాన్ని జనసైనికులు, స్థానిక నాయకులు డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ప్రజా సమస్యలపై తక్షణమే స్పందించే మనసున్న నాయకుడు పవన్ కళ్యాణ్ .. యుద్ధప్రాతిపదికన నిధులు మంజూరు చేయించి, పనులను తక్షణమే ప్రారంభించాలని అధికారులను, పార్టీ శ్రేణులను ఆదేశించారు. పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు బుధవారం 20వ వార్డులో నూతన రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులకు జనసేన ముఖ్య నాయకులు కొబ్బరికాయ కొట్టి, పనులను ప్రారంభించారు. 35 ఏళ్లుగా ఏ నాయకుడూ చేయని పనిని, పవన్ కళ్యాణ్ ఎమ్మెల్యే అయిన కొద్ది రోజుల్లోనే చేసి చూపించడంతో వార్డు ప్రజల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. "ఇంతటి ప్రజా రక్షకుడు మాకు ఎమ్మెల్యేగా రావడం మా అదృష్టం" అంటూ స్థానికులు హర్షం వ్యక్తం చేస్తూ, జనసేనానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో జనసేన టౌన్ ప్రెసిడెంట్ మామిడాల సూరిబాబు కాకినాడ పార్లమెంటరీ సాధికార ప్రతినిధి మేడిశెట్టి నాగమణి రావుల వెంకటేశ్వరరావు అనిశెట్టి సూరిబాబు పామర్తి మల్లేశ్వరరావు కర్రి ఏసుబాబు వూట నాని పాల్గొన్నారు. వీరితో పాటు పలువురు జనసేన పార్టీ ముఖ్య నాయకులు, వీరమహిళలు పాల్గొన్నారు.

## పైడితల్లి అమ్మవారి జాతర మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

--జగపతినగరంలో అమ్మవారికి భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించిన మహిళలు

--బోనాల కార్యక్రమంలో పాల్గొన్న మాజీ జడ్పీ ప్రతిపక్ష నేత తోట నవీన్





**కాకినాడ జిల్లా ఆగస్టు 26 (ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్)** కిర్లంపూడి మండలం జగపతినగరం గ్రామంలో పైడితల్లి అమ్మవారి జాతర మహోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. మహిళలు భారీ ఎత్తున పాల్గొని బోనాలతో ప్రధాన రహదారిపై ఊరేగింపు నిర్వహిస్తూ భక్తిశ్రద్ధలతో అమ్మవారికి బోనాలు సమర్పించారు. అమ్మవారి జాతర మహోత్సవాలకు జగ్గంపేట ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు సభ్యులు, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు జ్యోతుల నెహ్రూ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జ్యోతుల నెహ్రూ చేతుల మీదుగా బోనాల కార్యక్రమాన్ని ప్రారంభించారు. మహిళలకు స్వయంగా బోనాలు నెత్తిన పెట్టి జాతరలో పాల్గొని సందడి చేశారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ పైడితల్లి అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపైనా సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. గ్రామాల్లో సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకుంటూ ఇలాంటి జాతరలను ఘనంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. మహిళలు భక్తిశ్రద్ధలతో జాతరలో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జగ్గంపేట నియోజకవర్గం అభివృద్ధి కమిటీ సభ్యులు చదరం చంటిబాబు, మాజీ జడ్పీ ప్రతిపక్ష నేత తోట నవీన్, కిర్లంపూడి సొసైటీ అధ్యక్షులు కుర్ల చినబాబు, టీడీపీ నాయకులు తూము కుమార్, కాళ్ళ వెంకటేష్, మాజీ సర్పంచ్ పెంటకోట నాగబాబు, దాడి రాజగోపాల్, దాడి బాబి, కోడెల నల్లబ్బాయి, ఆడారి నానాజీ, శరకణం శివశంకరరావు, కాళ్ళ ఏసుబాబు, రాపేటి ఇంద్ర, చదరం ఆదిబాబు, చదరం రాజబాబు తదితరులు పాల్గొన్నారు. ఆలయ కమిటీ చైర్మన్ కర్రి ప్రసాద్ బాబు, మాజీ సర్పంచ్ కర్రి సూర్యకుమార్ ఆధ్వర్యంలో జాతర మహోత్సవాలను నిర్వహించారు. గ్రామ పెద్దలు, ప్రజల సహాయ సహకారాలతో జాతర మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

# పోతిరెడ్డిపాడు సందర్శనను అడ్డుకోవడం ప్రజాస్వామ్య హక్కులపై దాడి



**రాయలసీమ నీటి హక్కుల కోసం ప్రశ్నించడం నేరమా? ప్రాజెక్టులను సందర్శించడం నేరమా?**

**రైతు సంక్షేమం పేరుతో పాలన.. రైతులను ఉరితాడు వైపు నెట్టే పరిస్థితులు ఎందుకు..? --- సిబ్యాల విజయభాస్కర్**

**రాయచోటి ఆగస్టు 26 ప్రజా జ్యోతి** రాయలసీమ సాగునీటి హక్కుల పరిరక్షణ, రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు, గ్రేటర్ రాయలసీమకు దక్కాల్సిన నీటి వాటా సాధన కోసం చేపట్టిన పోతిరెడ్డిపాడు సందర్శన కార్యక్రమాన్ని కూటమి ప్రభుత్వం పోలీసు వ్యవస్థను అడ్డుపెట్టుకుని అడ్డుకోవడం ప్రజాస్వామ్య హక్కులపై దాడి చేయడమేనని గ్రేటర్ రాయలసీమ ప్రాజెక్టుల పరిరక్షణ సమితి కోఆర్డినేటర్ సిబ్యాల విజయభాస్కర్ తీవ్రంగా ఖండించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రాయలసీమ నీటి హక్కుల పరిరక్షణ కోసం చేపట్టిన కార్యక్రమంలో భాగంగా పోతిరెడ్డిపాడు ప్రాజెక్టును పరిశీలించేందుకు వెళ్లిన రాయలసీమ లిఫ్ట్, గ్రేటర్ రాయలసీమ ప్రాజెక్టుల సాధన టాస్క్‌ఫోర్స్ కమిటీ సభ్యులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులను పోలీసులు అడ్డుకోవడం సరికాదన్నారు. రాయలసీమ ప్రజల నీటి హక్కుల గురించి ప్రశ్నించడం నేరమా ప్రాజెక్టులను సందర్శించడం నేరమా..? రాయలసీమకు రావాల్సిన నీటి వాటాపై ప్రభుత్వాన్ని నిలదీయడం నేరమా..? అని ఆయన ప్రశ్నించారు. పోలీసు బలంతో ఒక కార్యక్రమాన్ని అడ్డుకోవచ్చేమో కానీ, రాయలసీమ ప్రజల గొంతును మాత్రం అడ్డుకోలేరని స్పష్టం చేశారు. కృష్ణా, తుంగభద్ర నదుల నుంచి రాయలసీమకు హక్కుగా రావాల్సిన ప్రతి నీటి బొట్టును సాధించే వరకు పోరాటం కొనసాగుతుందని తెలిపారు. రాయలసీమ నీటి హక్కుల కోసం జరుగుతున్న పోరాటాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, రాయలసీమ లిఫ్ట్, గ్రేటర్ రాయలసీమ నీటి సాధన సమితి టాస్క్‌ఫోర్స్ సభ్యులు, పార్టీ అనుబంధ విభాగాల నాయకులకు ఆయన పిలుపునిచ్చారు. పత్రికా ప్రకటనలు, మీడియా సమావేశాలు, సోషల్ మీడియా వేదికల ద్వారా ప్రభుత్వ వైఖరిని ప్రజలకు వివరించాలని కోరారు. లిరైతే రాజు అన్న వైయస్సార్ నేడు రైతు పరిస్థితి ఏమిటి?లినాడు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వ్యవసాయం అంటే దండగ కాదు పండగ అని నిరూపించిన నాయకుడని విజయభాస్కర్ అన్నారు. ఆయన బాటలోనే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతు సంక్షేమానికి ప్రాధాన్యత ఇచ్చారని పేర్కొన్నారు. అయితే ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రైతుల సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. రాయలసీమ బిడ్డగా చెప్పుకునే చంద్రబాబు నాయుడు రాయలసీమ రైతుల సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు. రైతు వరి నాట్లు వేసిన ప్రతిసారీ సాగునీటి భరోసా కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి ఉండకూడదని, రైతులను సంక్షోభం నుంచి కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని అన్నారు. రాయలసీమకు న్యాయంగా దక్కాల్సిన సాగునీటి వాటాను సాధించి రైతులకు భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు. రాయలసీమ నీటి హక్కుల కోసం ప్రారంభమైన ఈ పోరాటం ఒక్కరోజు కార్యక్రమం కాదని.. రాయలసీమకు న్యాయం జరిగే వరకు నిరంతరం కొనసాగుతుందని సిబ్యాల విజయభాస్కర్ స్పష్టం చేశారు, ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్టీ సెల్ కార్యదర్శి మాలే వెంకట రమణ,(బుల్లి). బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి శివయ్య, పలువురు పాల్గొన్నారు.

## కకళ్యాణ మండపం స్థలాన్ని పరిశీలించిన ఎంపీ ఉదయ్ శ్రీనివాస్,ఎమ్మెల్యే సత్యప్రభ

--ఎంపీ,ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికిన వెన్నా శివ,మేడిశెట్టి బాబీ

--ఎంపీ లాడ్స్ నిధులతో కళ్యాణ మండపం నిర్మాణానికి స్థల పరిశీలన



**కాకినాడ జిల్లా ఆగస్టు 26(ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్)** ఎంపీ లాడ్స్ నిధులతో కత్తిపూడిలో కళ్యాణ మండపం నిర్మాణానికి ప్రతిపాదించిన స్థలాన్ని ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ,డీసీసీబీ చైర్మన్ తుమ్మల బాబుతో కలిసి పరిశీలించారు.కళ్యాణ మండపం నిర్మాణానికి అనువైన స్థలాన్ని పరిశీలించి,అక్కడి పరిస్థితులను పరిశీలించారు. కత్తిపూడికి విచ్చేసిన నాయకులకు రాష్ట్ర రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ వెన్నా శివ,జనసేన రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మేడిశెట్టి బాబీ ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు.ప్రత్తిపాడు నియోజకవర్గంలోని శరభవరం, లింగంపర్తి గ్రామాల్లో కూడా ఎంపీ లాడ్స్ నిధులతో కళ్యాణ మండపాల నిర్మాణానికి ప్రతిపాదనలు ఉన్నాయి.ఈ కార్యక్రమంలో లింగంపర్తి,ధర్మవరం,కత్తిపూడి సొసైటీ చైర్మన్లు పెంటకోట మోహన్,దాసం శేషారావు,గాబు కృష్ణమూర్తి,తుని జోన్ ఆత్మ కమిటీ వైస్ చైర్మన్ కరణం సుబ్రహ్మణ్యం,శంఖవరం మండల జనసేన అధ్యక్షులు గాబు సుభాష్,మాజీ ఎంపీటీసీలు సాదనాల లక్ష్మిబాబు, కంచిబోయిన శ్రీను,కూటమి నాయకులు కేళంగి జన, కొయ్యా రమణ,రౌతు శివ,గాబు శివ, కీర్తి కుమార్, నాయుడు బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

## నూతన గృహ ప్రవేశ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై,వారికీ శుభాకాంక్షలు తెలియజేసిన వైసీపీ

జిల్లా ఉపాధ్యక్షులు వై. ప్రదీప్ రెడ్డి



**కౌతాళం ఆగస్టు 26 ప్రజా జ్యోతి** కౌతాళం మండల కేంద్రంలోనీ శాంతి,నవీన్ రెడ్డి మరియు ఈడిగ సత్తి నూతన గృహ ప్రవేశ కార్యక్రమానికి హాజరైన వైఎస్ఆర్సిపి జిల్లా ఉపాధ్యక్షులు వై.ప్రదీప్ రెడ్డి ఈ నూతన గృహం ఆనందాలకు, ఆత్మీయతలకు, సుఖసంతోషాలకు నిలయంగా మారాలని, కుటుంబ సభ్యులందరూ ఆయురారోగ్యాలతో, సుఖశాంతులతో జీవించాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు.నూతన గృహంలో నూతన ఆనందాలు వెల్లివిరియాలని ఆకాంక్షిస్తూ గృహ ప్రవేశం కార్యక్రమం అనంతరం కుటుంబ సభ్యులకు చిరుకానుకలు అందజేశారు.ఈ కార్యక్రమంలో అన్నతో పాటుగా కౌతాళం మండల కన్వీనర్ దేశాయ్ ప్రహ్లాదాచారి పిఏ వెంకటరామిరెడ్డి వైస్ ఎంపీపీ బుజ్జి స్వామి,గురు రాజారెడ్డి, మాజీ సర్పంచులు పాల్ దినకర్ ,సక్రి తిక్కయ్య,ఉమాపతి,వడ్డే రాము,తహేర్ వలి,పూజారి లింగ, సమ్మద్,రామకృష్ణ, వడ్డే చిన్న ఉసేని,సక్రి శ్రీరామ్,మగ్రి స్వామి, జీడీ.ఖదీర్,ఎంపీటీసీ ముకన్నా,వడ్డే అంజి, ఎన్టీఆర్ నగర్ భాష, కళ్యాణ్ రామ్,సోషల్ మీడియా మండల కన్వీనర్ ఖాదర్ లింగ మరియు నాయకులు కార్యకర్తలు తదితరులు కూడా ఉన్నారు.

## తిరుపతి విమానాశ్రయాన్ని ప్రైవేటీకరించొద్దు

ఏఐటీయూసీ ప్రజా ప్రయోజనాల కోసం ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలి



**మదనపల్లి ఆగస్టు 25 ప్రజా జ్యోతి** తిరుపతి విమానాశ్రయాన్ని ప్రైవేటు సంస్థలకు అప్పగించే ప్రయత్నాలను కేంద్ర ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని ఏఐటీయూసీ అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.తిరుపతి విమానాశ్రయం కేవలం ఒక వాణిజ్య సంస్థ కాదని, దేశ విదేశాల నుంచి వచ్చే లక్షలాది మంది భక్తులకు, ప్రజలకు సేవలందించే కీలకమైన ప్రజా రవాణా వ్యవస్థ అని ఆయన పేర్కొన్నారు. ఇలాంటి ప్రజా ఆస్తులను ప్రైవేటు వ్యక్తులు, కార్పొరేట్ సంస్థలకు అప్పగించడం వల్ల సామాన్య ప్రజలపై ఆర్థిక భారం పెరిగే ప్రమాదం ఉందన్నారు.అభివృద్ధి పేరుతో ప్రభుత్వ రంగ సంస్థలను ఒక్కొక్కటిగా ప్రైవేటీకరిస్తూ ప్రజా ఆస్తులను కార్పొరేట్ సంస్థలకు అప్పగించడం సరికాదని విమర్శించారు. తిరుపతి విమానాశ్రయం ప్రభుత్వ రంగంలోనే కొనసాగితే ప్రయాణికులకు సౌకర్యవంతమైన సేవలు, అందుబాటు ధరలు, ఉద్యోగ భద్రత కల్పించే అవకాశం ఉంటుందని తెలిపారు.తిరుపతి విమానాశ్రయాన్ని ప్రైవేటీకరించే నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని, ప్రజా ప్రయోజనాల దృష్ట్యా విమానాశ్రయాన్ని ప్రభుత్వ ఆధీనంలోనే కొనసాగించాలని సాంబశివ డిమాండ్ చేశారు.ప్రభుత్వ రంగ ఆస్తుల పరిరక్షణ కోసం కార్మికులు, ప్రజలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఐక్యంగా ఉద్యమిస్తాం అన్నారు

## అవకాశం వస్తే సర్పంచ్ బరిలోకి దిగుతా.....ఇద్రుస్ భాష



**కౌతాళం, ఆగష్టు 26 ప్రజా జ్యోతి** త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అవకాశం వస్తే తప్పకుండా భరిలో నిలబడతానని వైఎస్ఆర్సిపి మండల జనరల్ సెక్రెటరీ ఇద్రుష్ భాష తెలిపారు.బుధవారం కౌతాళం మండలంలో వైయస్సార్సిపి పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతు శ్రీ జగద్గురు ఖాదర్ లింగ స్వామి పీఠాధిపతులైన తాత ఆశీర్వాదాలతో, రాంపురం రెడ్డి సోదరులు సహకారంతో, మండల నాయకులు దేశాయ్ స్వామి కుటుంబ సహకారంతో,గ్రామ ప్రజల ఆదరణతో స్థానిక ఎన్నికల్లో పోటీ చేయాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. అలాగే పార్టీ కార్యకమాల్లో నే కాకుండా మండల ముస్లిం మైనార్టీ మంచి పట్టు ఉండడమే కాకుండా యువత లో కూడా సేవా కార్యక్రమాలు చేస్తున్నారు కావున తనను ప్రజలు ఆదరించి అభిమానించాలని కోరారు.

## బాం సేఫ్ మహాసభలను విజయవంతం చేయండి.......




**చాగలమర్రి , ఆగష్టు 26( ప్రజాజ్యోతి న్యూస్ ) ;** సెప్టెంబర్ 6న అనంతపురం జిల్లా కేంద్రంలో జరుగునున్న మహాసభలను అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని సంస్థ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ నిరంజన్ పిలుపునిచ్చారు. చాగలమర్రి పట్టణంలోని మళ్లే వేముల రస్తాలో గల పిఆర్టియు ఉపాధ్యాయ సంఘంలో ఏర్పాటు చేసిన సమావేశంలో బాంసేఫ్ మహాసభల కరపత్రాలను బుధవారం రాత్రి విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బాంసేఫ్ అనేది షెడ్యూల్ కులాల, షెడ్యూల్ తెగల ఇతర వెనుకబడిన తరగతులు, మైనార్టీ ప్రభుత్వ ఉద్యోగుల వెనుకబడిన జాతీయఅఖిల భారత సమాఖ్య అన్నారు. సంఘాలను మండలస్థాయి, గ్రామాల నుంచి, క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేయవలసిన బాధ్యత ప్రతి ఒక్కరి మీద ఉందన్నారు. ఉపాధ్యాయులకు ఇన్ సర్వీస్ ఉద్యోగులకు టెట్ నిర్బంధ పరీక్ష కారాదని, సిపిఎస్ ఉద్యమం కోసం పోరాడుతాం అన్నారు. ఈవీఎంల వ్యతిరేకతకు, విద్యా,వైద్య ప్రైవేటీకరణను దూరం చేయాలని, నీట్ లాంటి ఉన్నత పరీక్షల మోసాలకు వ్యతిరేకంగా జరిగే కార్యక్రమాలలో తమ మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పిఆర్టియు నాయకులు పాల్గొన్నారు.

## కనకదాసు విగ్రహ నిర్మాణానికి రూ. 10,116 విరాళం అందజేసిన.. టిడిపి యువ నాయకుడు బిల్లే ప్రభాకర్, తండ్రి గోవిందప్ప..



**కంబదూరు ఆగస్టు:26(ప్రజా జ్యోతి) న్యూస్ రిపోర్టర్ ఖాన్,** కంబదూరు మండల పరిధిలోని రాంపురం గ్రామం నందు నూతనంగా నిర్మిస్తున్న కురబల ఆరాధ్య దైవం శ్రీ భక్త కనకదాసు విగ్రహ నిర్మాణానికి ఐపార్సపల్లి గ్రామానికి చెందిన టిడిపి యువ నాయకుడు బిల్లే ప్రభాకర్, ఆయన తండ్రి గోవిందప్ప, రూ 10,116 విరాళం ఆ గ్రామ కురుబ సోదరులకు అందజేశారు. ఈ సందర్భంగా రాంపురం కురుబ సోదరులు మాట్లాడుతూ అడిగిన వెంటనే స్పందించి విగ్రహ నిర్మాణానికి సహకరించిన, బిల్లే ప్రభాకర్, ఆయన తండ్రి గోవిందప్ప, కు కృతజ్ఞతలు తెలిపారు. కనకదాసు విగ్రహ నిర్మాణం విజయవంతంగా పూర్తి య్యేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని కోరారు.

## 33వ వార్డులో కూటమి నేతల విస్తృత పర్యటన



**బద్వేల్ స్టాప్ రిపోర్టర్ ఆగస్టు 26 (ప్రజా జ్యోతి)** బద్వేలు మున్సిపాలిటీ పరిధిలోని 33వ వార్డు గాండ్ల వీధిలో తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి మంచూరు సూర్యనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక కూటమి నాయకులతో కలిసి విస్తృతంగా ఇంటింటి ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంచూరు సూర్యనారాయణ రెడ్డి గారు ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ, వారి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డ్రైనేజీ, తాగునీరు, రోడ్ల వంటి ప్రజా సమస్యలను వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి శాయశక్తులా కృషి చేస్తానని స్థానికులకు హామీ ఇచ్చారు.అనంతరం ఆయన మాట్లాడుతూ... రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో అనేక సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వేగంగా అమలు చేస్తున్నట్లు వివరించారు. అర్హతే ప్రామాణికంగా ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందడమే కూటమి ప్రభుత్వ ముఖ్య ధ్యేయమని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బద్వేలు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ప్రముఖ నాయకులు, స్థానిక కూటమి ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు మరియు వార్డు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రత్తిపాడులో బిసివై పార్టీ ఇంచార్జ్ గొంప శివకుమార్ యాదవ్ జన్మదిన వేడుకలు..

వృద్ధాశ్రమంలో కేక్ కటింగ్, అన్నదాన కార్యక్రమం



**కాకినాడ జిల్లా ఆగస్టు 26 (ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్)** బీసీవై పార్టీ ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్చార్జ్ గొంప శివకుమార్ యాదవ్ జన్మదిన వేడుకలు బుధవారం ప్రత్తిపాడు జాతీయ రహదారి పాదాలమ్మ గుడి సమీపంలో ఉన్న శారద వయోవృద్ధ నిలయంలో సామాజిక సేవా కార్యక్రమాల మధ్య ఘనంగా జరిగాయి. ఆశ్రమ వాసుల సమక్షంలో ఆయన కేక్ కట్ చేసి శుభాకాంక్షలు అందుకున్నారు. అనంతరం వృద్ధులకు అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా గొ0ప శివకుమార్ యాదవ్ మంగ దంపతులు మాట్లాడుతూ జన్మదినం వేళ ఆడంబరాలకు దూరంగా వృద్ధుల నడుమ వేడుకలు జరుపుకోవడం, వారికి సేవ చేసి అన్నదానం చేయడం తనకు దక్కిన గొప్ప అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. సమాజంలో నిరుపేదలకు, వృద్ధులకు చేయూతనందించడమే నిజమైన తృప్తినిస్తుందని అన్నారు. అలాగే శివకుమార్ యాదవ్ స్వగ్రామైన లింగంపర్తి లో కూడా జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ రాయవరం మాజీ సర్పంచ్ దేవర శ్రీను, సారిపల్లి రమేష్, కుండల శ్రీను, నాగళ్ళ శివనాగు, సానబోయిన కుశరాజు, నాగళ్ళ కుసరాజు, సాయి అభిమానులు పాల్గొన్నారు.

## ప్రత్తిపాడు తాలూకా జేఏసీ నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక

--నూతన కార్యవర్గాన్ని అభినందించిన ఎంపీడీవో కుమార్‌బాబు



**కాకినాడ జిల్లా ఆగస్టు 26 (ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్)** ప్రత్తిపాడు తాలూకా జేఏసీ నూతన కార్యవర్గ కమిటీ ఏర్పాటైంది.స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం సాయంత్రం జరిగిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఏపీ జేఏసీ నియోజకవర్గ చైర్మన్‌గా మాకినీడి సత్యనారాయణ,కార్యదర్శిగా కోడి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులుగా గోర్స దుర్గాప్రసాద్,జువ్వల రాజా,కార్యదర్శులుగా ఎం లక్ష్మీనారాయణ,వై రామం,కోశాధికారిగా ఎం సురేష్,సహాయ కార్యదర్శులుగా మోర్త చందర్రావు,జి ఎస్ ప్రసాద్ బాబు,ఈ ప్రసన్నకుమారి,సి హెచ్ వి సూర్యావతి,ఆర్ రామలింగేశ్వరరావు ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గ సభ్యులను ఎంపీడీవో ఎంవిఆర్ కుమార్‌బాబు,డిప్యూటీ ఎంపీడీవో కాశీ విశ్వనాథ్,ఎన్జీవో జిల్లా ఉపాధ్యక్షుడు రామిశెట్టి రాంబాబు, నాయకులు చుక్కల గణేష్,ఎంవి రమణ తదితరులు అభినందించారు.ఈ సందర్బంగా నూతన కార్యకవర్గం మాట్లాడుతూ ఎన్నికల హామీలను నెరవేర్చాలని,పి ఆర్ సీ కమిషన్ వెంటనే ఏర్పాటు చేయాలనీ, ఉద్యోగుల ఆర్థిక బకాయిలు వెంటనే విడుదల చేయాలని కోరారు

## గోకవరంలో రూ.75 లక్షల విలువైన 6 కిలోల హష్ ఆయిల్ పట్టివేత

నలుగురు అరెస్ట్ -- కారు, బైక్ స్వాధీనం



**గోకవరం (ప్రజా జ్యోతి ప్రతినిధి) ఆగస్టు 26:**తూర్పు గోదావరి జిల్లా గోకవరం మండలంలోని తంటికొండ ఆర్చ్ వద్ద పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో రూ.75 లక్షల విలువైన 6 కిలోల లిక్విడ్ గంజాయి (హష్ ఆయిల్) ను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో నలుగురు నిందితులను అరెస్ట్ చేసి, రవాణాకు ఉపయోగించిన స్విఫ్ట్ డిజైర్ కారు మరియు గ్లామర్ మోటార్ సైకిల్ ను జప్తు చేసినట్లు ఉత్తర మండల డీఎస్పీ సి.హెచ్. జీవన తెలిపారు. జిల్లా ఎస్పీ డి. నరసింహ కిశోర్, ఐపీఎస్ ఆదేశాల మేరకు గోకవరం ఎస్సై వి.ఎన్.వి. పవన్ కుమార్ తన సిబ్బందితో కలిసి గంజాయి అక్రమ రవాణాపై ప్రత్యేక తనిఖీలు చేపట్టగా ఈ పట్టివేత జరిగింది. కేసు దర్యాప్తును కోరుకొండ సీఐ ఎస్.వి.వి.ఎస్. మూర్తి చేపట్టనున్నారు.

**ఒడిశా నుంచి హైదరాబాద్‌కు తరలింపు.**

విచారణలో నిందితులు ఒడిశాలోని మల్కాన్‌గిరి ప్రాంతం నుంచి హష్ ఆయిల్ కొనుగోలు చేసి హైదరాబాద్‌లో విక్రయించేందుకు తీసుకెళ్తున్నట్లు అంగీకరించారు. పోలీసులకు అనుమానం రాకుండా ముందుగా బైక్‌పై ఇద్దరిని పంపించి పోలీసుల కదలికలను గమనింపజేసి, వెనుక కారులో మాదకద్రవ్యాన్ని తరలించే ప్రణాళిక రూపొందించినట్లు డీఎస్పీ వెల్లడించారు.

**పరారీలో మరో ముగ్గురు**

ఈ కేసులో లింగు ఖిల్లా, ప్రశాంత్ ముస్తాపుర, సంబ్రా ఖిల్లా ఏ సమురా పరారీలో ఉన్నారని, వారిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయని పోలీసులు తెలిపారు.

**జిల్లాలో గంజాయి నిర్మూలనపై ప్రత్యేక దృష్టి**

గత ఏడాది నుంచి ఇప్పటివరకు తూర్పు గోదావరి జిల్లాలో 7 కేసుల్లో సుమారు 20 మంది నిందితులను అరెస్ట్ చేసి, దాదాపు 600 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. గంజాయి వినియోగదారులకు ర్యాపిడ్ టెస్టులు నిర్వహించి డీ-అడిక్షన్ కేంద్రాలకు పంపుతున్నామని, మాదకద్రవ్యాల నిర్మూలన కోసం అవగాహన కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.పోలీసుల విజ్ఞప్తి: గంజాయి, ఇతర మాదకద్రవ్యాల అక్రమ రవాణా లేదా విక్రయాలపై సమాచారం తెలిసిన వారు వెంటనే పోలీసులకు తెలియజేయాలని, సమాచారదాతల వివరాలు గోప్యంగా ఉంచుతామని డీఎస్పీ సి.హెచ్. జీవన తెలిపారు.

# దుగ్గిరాలపాడు ఎస్సీ వర్గాల భూములపై ఫారెస్ట్ అధికారుల వేధింపులు....!!!






## పేద రైతులు ఆవేదన...!!

**జి.కొండూరు/దుగ్గిరాలపాడు:(ఆగస్టు 26,ప్రజా జ్యోతి బ్యూరో భట్టిప్రోలు నాగేశ్వరరావు):** జి.కొండూరు మండల పరిధిలోని దుగ్గిరాలపాడు ఎస్సీ,ఎస్టీ వర్గాలు సాగు చేస్తున్న భూములపై కొండపల్లి ఏరియా ఫారెస్ట్ అధికారులు వేధింపులకు గురి చేస్తున్నారని బుధవారం పత్రికా ముఖంగా తెలియజేస్తూ ఆవేదన చెందారు. ఈ సందర్భంగా దుగ్గిరాలపాడు గ్రామానికి చెందిన పేద రైతులు కోపూరు రాంబాబు, చిన్నదాసు, కోపూరు బుజ్జి కొమ్ము వెంకటరత్నం కోపూరు లాజర్, కొడవటి ప్రభుదాస్, జిల్లేపల్లి సుబ్బారావు కావేటి గురవయ్య, తోకల దుర్గారావు తో పాటు పలువురు పేద రైతులు పత్రిక ముఖంగా మాట్లాడుతూ....గత 50 సంవత్సరాల నుండి మా తల్లిదండ్రులతో పాటు మేము దుగ్గిరాలపాడు ఆయువు కట్టు చెరువు కింద సుమారు 40 ఎకరాల విస్తీర్ణంలో 60 మంది రైతులు సాగు చేసుకుంటూ ఫల సాయం పొందుతూ....మా కుటుంబాలను పోషించుకుంటున్నామని, ఈ తరుణంలో కొండపల్లి దుగ్గిరాలపాడు ఏరియా ఫారెస్ట్ అధికారులు సాగులో ఉన్న భూముల్లో కందకాలు తీసి మమ్మల్ని వేధింపులకు గురి చేస్తున్నారని బోరు నా విలపించారు. పేద రైతుల సమస్యలపై గ్రామ మాజీ ఉపసర్పంచ్ కోపూరు రాంబాబు గ్రామ పెద్ద వి.శీను తదితరులు ఫారెస్ట్ అధికారులు ఫారెస్ట్ గార్డ్ దుర్గారావు ని, ఫారెస్ట్ డిఆర్ఓ రామిరెడ్డి ని రైతుల సమస్యలపై నిగ్గ తీయగా....ఫారెస్ట్ అధికారులు మాట్లాడుతూ మా సమస్యలు మాకు ఉంటాయని, వీర్లపాడు ఎస్సై భూముల గురించి పీ జె ఆర్ కు ఫిర్యాదు చేయగా మా ఫారెస్ట్ పై అధికారులు సూచన ప్రకారం మా బాధ్యతలు నిర్వహించామని తెలిపారు. దీంతో గ్రామ మాజీ ఉపసర్పంచ్ వీర్లపాడు ఎస్ఐకి ఫోన్ చేసి వివరణ కోరగా ఈ సందర్భంగా వీర్లపాడు ఎస్సై మాట్లాడుతూ పేద రైతుల భూములు నష్టపరచమని నేను ఫిర్యాదు చేయలేదని మా వీర్లపాడు సరిహద్దు ఫారెస్ట్ లో గట్టు చుట్టూ కొందరు ఫారెస్ట్ భూములు ఆక్రమించడం వలన ఫారెస్ట్ లో ఉన్న అడవి జంతువులు, జింకలు స్వేచ్ఛగా తిరగలేకపోతున్నాయని అలాగే కొంతమంది వేటగాళ్లు కరెంటు తీగలను పెట్టి వన్యమృగాలు చనిపోవడానికి కారణం అవుతున్నారని వాటిని కాపాడాలని ఫిర్యాదు చేశానని ఎస్ఐ తెలిపారు. రైతుల సమస్యలతో కోపూరు రాంబాబు తెలుగుదేశం పార్టీ మండల పార్టీ అధ్యక్షులు వేములకొండ వెంకటేశ్వరరావుకు తెలియచేయడం తో...ఈ విషయంపై మండల పార్టీ అధ్యక్షులు వేములకొండ వెంకటేశ్వరరావు ఫారెస్ట్ అధికారులతో మాట్లాడి సాగుభూములో కందకాలు తీయవద్దంటూ అధికారులకు నచ్చ చెప్పి సమస్యను పరిష్కరించారు. ఈ సందర్భంగా పేద భూముల్లోకి మేము రాము అంటూ ఫారెస్ట్ అధికారులు హామీ ఇవ్వడంతో పలువురు రైతులు కోపూరు రాంబాబుకి, మండపాటి అధ్యక్షులు వేములకొండ వెంకటేశ్వరరావు కి, వి. శ్రీను కి కృతజ్ఞతలు తెలిపారు.

# ఈ నెల 28న హంద్రీనీవా సుజల స్రవంతి కాలువపై రాస్తారోకా

:వైఎస్సార్‌సీపీ నాయకులు

-బిహెచ్ఎల్‌సీ,జీబీసీ,హెచ్ఎన్ఎస్ఎస్ ద్వారా సాగునీరు అందించాలి.

-లక్షల ఎకరాల ఆయకట్టు ఎండిపోయే పరిస్థితి నెలకొన్నా కూటమి ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్న వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ.




**ఆగస్టు 26 ప్రజా జ్యోతి న్యూస్ రాయలసీమ ఇన్చార్జ్ శ్రీనివాస్ నాయుడు** జిల్లాలో ప్రధాన నీటి వనరులైన హెచ్ఎల్‌సీ, జీబీసీ, హెచ్ఎన్ఎస్ఎస్ పరిధిలోని లిలక్షల ఎకరాల ఆయకట్టు ఎండిపోయే పరిస్థితి నెలకొన్నా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమని వైఎస్సార్‌సీపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు బుధవారం ఉరవకొండ లోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నిర్వహించిన పత్రికా సమావేశంలో నాయకులు మాట్లాడుతూ ఆగస్టు నెల ముగుస్తున్నా ఇరిగేషన్ అడ్వైజరీ బోర్డు సమావేశం నిర్వహించకపోవడం పాలకులు, అధికారుల మధ్య సమన్వయ లోపానికి గతశీలో తుంగభద్రలో ఇలాంటి పరిస్థితులు ఎదురైనప్పుడు అప్పటి ప్రభుత్వాలు సమర్థవంతంగా నీటి నిర్వహణ చేపట్టిన విధానాన్ని ప్రస్తుత ప్రభుత్వం అధ్యయనం చేయాలని సూచించారు. తుంగభద్ర ఎగువ పరివాహక ప్రాంతం దేశంలోనే అనుకూలమైన వర్షపాతం నమోదయ్యే ప్రాంతంగా ఉన్నప్పటికీ,ప్రస్తుతం లిడ్యామ్‌లో సుమారు 95 టీఎంసీల నీరు ఉన్నా పూర్తిస్థాయిలో నీటి వినియోగంపై స్పష్టమైన నిర్ణయం తీసుకోకపోవడంతో లక్షలాది మంది రైతులు అయోమయానికి గురవుతున్నారని అన్నారు.మరోవైపు కృష్ణా నదీ జలాలను తెలంగాణ ప్రభుత్వం పాలమూరు--రంగారెడ్డి, కల్వకుర్తి, నెట్టెంపాడు,కోయిల్‌సాగర్ వంటి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుల ద్వారా వినియోగించుకోవడంతో పాటు విద్యుత్ ఉత్పత్తి పేరుతో నాగార్జునసాగర్ వైపు నీటిని తరలించే ప్రయత్నాలు చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు.కరువు ప్రాంతమైన రాయలసీమలోని సాగునీటి ప్రాజెక్టులను ఎండబెట్టే విధంగా వ్యవహరిస్తూ రైతుల పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి ఏమిటో ప్రజలు అర్థం చేసుకోవాలని అన్నారు.ప్రభుత్వం తక్షణమే స్పందించి హెచ్ఎల్‌సీ,జీబీసీ,హెచ్ఎన్ఎస్ఎస్ ద్వారా కనీసం తక్కువ కాలపరిమితిలో పూర్తయ్యే అరితడి పంటలకైనా సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు.లేనిపక్షంలో ఈ నెల 28వ తేదీన ఉరవకొండ సమీపంలోని హెచ్ఎన్ఎస్ఎస్ కాలువపై రాస్తారోకా నిర్వహిస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో రైతులు, ప్రజలు పెద్ద ఎత్తున స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ నాయకులు పిలుపునిచ్చారు.ఈ పత్రికా సమావేశంలో నాయకులు రాకెట్ల ముత్తులూరి అశోక్ కుమార్,పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి కరణం భీమరెడ్డి,జిల్లా కార్యదర్శి భరత్ రెడ్డి,విడపనకల్ వైసీపీ మండల అధ్యక్షుడు కురుబ రమేష్, యోగేంద్రరెడ్డి, ఎర్రస్వామిరెడ్డి,వైఎస్ఆర్సిపి బీసీ విభాగం ఉపాధ్యక్షుడు గిరిబాబు,వైసీపీ ఎస్సీ సెల్ జిల్లా నాయకుడు సుంకన్న,వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి నిమ్మల పాలన స్వర్ణయుగం




**డిసి చైర్మన్ జి ఎస్ ఎన్ రాజు**

**పెనుమదంలో రూ.2.80 కోట్లతో 14 పనులకు ప్రారంభోత్సవం**

**దీర్ఘకాలిక సమస్యల పరిష్కారంతో**

**పెనుమదం ప్రజల్లో హర్షాతిరేకాలు**

**పోడూరు, (ప్రజా జ్యోతి), - ఆగస్టు -26 :** పాలకొల్లు నియోజకవర్గం హ్యాట్రిక్ ఎమ్మెల్యే, రాష్ట్ర జలవనరుల అభివృద్ధి శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పాలన ఒక స్వర్ణ యుగమని లంకలకోడేరు వాటర్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ (డిసి) చైర్మన్ గొట్టుముక్కల సూర్యనారాయణ రాజు(జి ఎస్ ఎన్ రాజు) ప్రశంసించారు. రాష్ట్ర మంత్రి నిమ్మల రామానాయుడు ఆదేశాల మేరకు పోడూరు మండలం పెనుమదంలో బుధవారం రూ. 2. 80 కోట్ల వ్యయంతో చేపట్టి పూర్తిచేసిన 14 అభివృద్ధి పనులకు నాయకులు గ్రామ ప్రజలు పెద్దలతో కలిసి ప్రారంభోత్సవం పండుగ వాతావరణంలో అట్టహాసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి మండల అధ్యక్షుడు రుద్రరాజు రమేష్ రాజు, పాలకొల్లు ఏఎంసీ వైస్ చైర్మన్ దాసరి రత్నరాజు, పెనుమదం సొసైటీ అధ్యక్షుడు కడలి ఆంజనేయులు, పెనుమదం మాజీ సర్పంచ్ తానేటి బాబురావు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు మానేపల్లి శ్రీధర్, పెనుమదం నీటి సంఘం అధ్యక్షుడు దేవరపు దొరబాబు, శ్రీ ఉమా అగస్త్యేశ్వర స్వామి దేవస్థానం ట్రస్ట్ చైర్మన్ తంగెళ్ల సత్యనారాయణ, టిడిపి గ్రామ కార్యదర్శి నూటికుర్తి శ్యాంబాబు, బూత్ కన్వీనర్ గెద్దాడ రాంబాబు, వేడంగి సొసైటీ అధ్యక్షుడు మేడిశెట్టి బుజ్జి తదితరులు కార్యక్రమాల్లో పాల్గొని మాట్లాడుతూ రాష్ట్ర మంత్రి నిమ్మల రామానాయుడు అంటే అభివృద్ధి అని అభివృద్ధి అంటే నిమ్మల రామానాయుడు అని అన్నారు. మంత్రి నిమ్మల రామానాయుడు రాష్ట్ర వ్యాప్త పర్యటనలో భాగంగా స్థానిక నాయకులతో అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవం చేయించారు అన్నారు. జాతీయ ప్రాజెక్టు హంద్రివా ద్వారా ఐదు లక్షల ఎకరాలకు ఈ నెల ఆఖరి కళ నీరు అందించేటట్లు పళ్ళు పూర్తి చేస్తున్నారన్నారు. పుష్కరాలకు పోలవరం ప్రాజెక్టు పూర్తి చేసేలా పనులు వేగవంతం చేయటంలో ఆయన కృషి ఎనలేనిది అన్నారు. పోలవరం ద్వారా ఈనెలాఖరికి విశాఖపట్నంనికి నిరంధించేలా చర్యలు చర్యలు తీసుకుంటున్నారు అన్నారు. ఆయన శ్వాస ధ్యాస పాలకులు నియోజవర్గ అభివృద్ధి పైనే ఉందని కోట్లాది రూపాయలను నిధులు మంజూరు చేయించి దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించడం అభినందనీయమన్నారు. ఒక్క పెనుమదం గ్రామంలోని రెండేళ్లలోరూ. 2.80 కోట్ల వ్యయంతో 14 పనులను చేపట్టి పూర్తి చేయించి దీర్ఘకలిక సమస్యలను పరిష్కరించడంలో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని కొనియాడారు.

## కౌతాళంలో నూతన గృహ ప్రవేశ వేడుకకు హాజరైన కాశీ విశ్వనాథ్



**కౌతాళం,ఆగస్టు 26 ప్రజా జ్యోతి** మండల కేంద్రమైన కౌతాళంలో ఈడిగ సత్య గౌడ్ మరియు నవీన్ కుమార్ రెడ్డి నూతన స్వగృహ ప్రవేశ కార్యక్రమం ఘనంగా జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఉరుకుంద మాజీ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ చెన్న బసప్ప సోదరుడు కాశీ విశ్వనాథ్ హాజరై నూతన గృహస్తులకు శుభాకాంక్షలు తెలియజేశారు.వీరి వెంట అబ్దుల్ రహిమాన్, మంజునాథ,కౌతాళం మేజర్ కాలువ ప్రెసిడెంట్ డింగి రఘురాం పుగ్గి నాగప్ప,పింజారి బాబు తదితరులు పాల్గొన్నారు.నూతన గృహంలోకి అడుగుపెట్టిన సత్య గౌడ్,నవీన్ కుమార్ రెడ్డి కుటుంబ సభ్యులకు అతిథులు అభినందనలు తెలిపారు.అనంతరం జరిగిన విందులో పాల్గొన్నారు.

## నూతన గృహప్రవేశా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన బిజెపి కర్నూలు జిల్లా అధ్యక్షులు అక్కమ్మ తోట రామకృష్ణ



**కౌతాళం,ఆగస్టు 26 ప్రజా జ్యోతి** కౌతాళం మండల కేంద్రంలోని బుధువారం రోజున ఈడిగ సత్య గౌడ్ నూతన గృహప్రవేశానికి ముఖ్య అతిథిగా పాల్గొని శుభాకాంక్షలు తెలియజేసిన బిజెపి కర్నూలు జిల్లా అధ్యక్షులు అక్కమ్మ తోట రామకృష్ణ,మరియు బిజెపి కౌతాళం మండల అధ్యక్షులు వెంకన్న,బిజెపి స్టేట్ కౌన్సిల్ మెంబర్ విజయ్ ఈ కార్యక్రమంలో బిజెపి కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు లింగన్న,బిజెపి యువమోర్చా మండల అధ్యక్షులు బద్రి మరియు కృష్ణ నంద,జంగ్లీ భాష తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది.

## చింతూరులో ఓ యస్ డి ముందు లొంగి పోయిన ముగ్గురు మావోయిస్టులు




**చింతూరు ఆగస్టు 26 ప్రజాజ్యోతి** పోలవరంజిల్లా చింతూరులో సూపరిండెంట్ ఆఫ్ పోలీస్ ఆపరేషన్ పంకజ్ కుమార్ మీనా ఎదుట ముగ్గురు మావోయిస్టులు బుధవారం లొంగిపోయారు. లొంగిపోయిన మావోయిస్టుల వివరాలను మీడియా సమావేశంలో పంకజ్ కుమార్ మీనా వెల్లడించారు. ముచ్చకి మంగి,కడితి లక్ష్మయ్య, కడితి ఎంక అను మావోయిస్టులు మావోయిస్టు పార్టీ సిద్ధాంతాలకు విసిగిపోయి లొంగిపోయినట్లు ఆయన తెలిపారు.ముచ్చకి మంగి మావోయిస్టు పార్టీ ప్లాటూను కమిటీ సభ్యురాలుగా పనిచేస్తుందని అన్నారు. అలాగే పలు విధ్వంసకర ఘటనలలో పాల్గొన్నట్లు తెలిపారు. కడితి లక్ష్మయ్య, కడితి ఎంక లు మావోయిస్టు పార్టీలో పలు హింసాత్మక ఘటనలలో పాల్గొన్నారని పేర్కొన్నారు.లొంగిపోయిన మావోయిస్టులకు ప్రభుత్వం తర అన్ని విధాల ఆదుకుంటామని ఆయన తెలిపారు. ఇంకెవరైనా మావోయిస్టులు ఉంటే జనజీవన స్రవంతిలో కలవాలని పంకజ్ కుమార్ మీనా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఆర్పిఎఫ్ 42 బెటాలిం ఇంచార్జ్ ఏకే దీప, సిఐ గోపాలకృష్ణ, ఎస్ఐ సంతోష్ కుమార్ పాల్గొన్నారు

## సెప్టెంబర్ 10న విజయవాడలో దళిత గర్జనను జయప్రదం చేయాలి

-ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగ



**ఆగస్టు 26 ప్రజా జ్యోతి న్యూస్ రాయలసీమ ఇంచార్జ్ శ్రీనివాస్ నాయుడు :-** దళితులు, మాదిగల హక్కుల సాధన కోసం సెప్టెంబర్ 10న విజయవాడ ధర్నా చౌక్‌లో నిర్వహించనున్న దళిత గర్జన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగ పిలుపునిచ్చారు.పుట్టపర్తి నగరంలోని ఎమ్మార్పీఎస్ ఉమ్మడి అనంతపురం అధ్యక్షులు సాకే గురుమూర్తి. శ్రీ సత్య సాయి జిల్లా అధ్యక్షులు పూజారి ఓబుల్ కుమార్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన బ్రహ్మయ్య మాదిగ మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మాదిగలు, దళితులు, ఎస్టీలు, ఇతర బహుజన వర్గాలపై దాడులు, హత్యలు, అత్యాచారాలు జరుగుతున్నా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు.ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలకు సంబంధించిన రూ.700 కోట్లకు పైగా సబ్సిడీ రుణాల విడుదలలో జరుగుతున్న జాప్యాన్ని నివారించాలని కోరారు. దళితులపై జరుగుతున్న అన్యాయాలు, అక్రమాలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించేందుకు సెప్టెంబర్ 10న విజయవాడ ధర్నా చౌక్‌లో జరిగే దళిత గర్జనకు రాష్ట్రవ్యాప్తంగా మాదిగలు, దళితులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో శ్రీ సత్య సాయి జిల్లా ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయుకులు మరియు అనంతపురం జిల్లా కళ్యాణదుర్గ. రాయదుర్గం తాలూకా వివిధ మండలాల నుంచి భారీ ఎత్తున ఎమ్మార్పీఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కొండాపై వేటు సాధ్యమేనా




హైదరాబాద్, వరంగల్ : తెలంగాణ కాంగ్రెస్ రాజకీయంలో దేవాదాయ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ, ఆమె కుటుంబం వర్సెస్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వర్గం మధ్య సాగుతున్న అంతర్గత సమరం ఒక్కసారిగా తారాస్థాయికి చేరింది. కొండా సురేఖ కుమార్తె కొండా సుస్మితా పటేల్ నేరుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , ఆయన కుటుంబ సభ్యులపై తీవ్రస్థాయిలో అవినీతి ఆరోపణలు చేయడం, రాబోయే ఎన్నికల్లో పరకాల సీటుపై సీఎం చేసిన వ్యాఖ్యలను సవాలు చేస్తూ విమర్శలు గుప్పించడంతో మంత్రి కొండా సురేఖకు టీపీసీసీ షోకాజ్ నోటీసు జారీ చేసింది. ఈ పరిణామంతో కాంగ్రెస్ అధిష్టానం ఇక ఎంతమాత్రం సహించే ప్రసక్తే లేదనే స్పష్టమైన సంకేతాలను పంపింది. ఆమె తనకేం సంబంధం లేదని సమాచారం పంపినా పరిగణనలోకి తీసుకోవడం లేదు. కొండా కుటుంబానికి అత్యంత సన్నిహితుడిగా పేరొందిన మాజీ ఓఎస్డీ ఎన్. సుమంత్ చుట్టూ చట్టపరమైన ఉచ్చు వేగంగా బిగుస్తుండటం రాజకీయంగా పెను దుమారం రేపుతోంది. గతంలో డెక్కన్ సిమెంట్స్ ప్రతినిధులను బెదిరించిన వ్యవహారంలో ఓఎస్డీ పదవి నుంచి తొలగించబడిన సుమంత్‌పై జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో ఃబొ సెక్షన్ 109 కింద హత్యాయత్నం కేసు నమోదు కావడం ఇప్పుడు సంచలనంగా మారింది. సుస్మితా పటేల్ వ్యాఖ్యలు చేసిన మరుసటి రోజే పాత ఘటనపై పోలీసులు ఇంత వేగంగా స్పందించి కేసు నమోదు చేయడం వెనుక, కొండా నెట్‌వర్క్‌ను చట్టపరంగా ఇరకాటంలో పడేసే పక్కా వ్యూహం ఉందనే ప్రచారం బలపడుతోంది. మరోవైపు ఉమ్మడి వరంగల్ , ఇతర జిల్లాలకు చెందిన సుమారు 19 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు మంత్రి కొండా సురేఖను కేబినెట్ నుంచి తప్పించాలని బహిరంగంగా డిమాండ్ చేయడం కాంగ్రెస్‌లో మారుతున్న సమీకరణాలకు అద్దం పడుతోంది. డిసిప్లినరీ కమిటీ ద్వారా నోటీసు ఇచ్చి వివరణ కోరడం, అదే సమయంలో పోలీసు యంత్రాంగం ద్వారా అవినీతి, అక్రమ సెటిల్‌మెంట్ల ఆరోపణలపై లీగల్ విచారణ వేగవంతం చేయడం ద్వారా కాంగ్రెస్ అగ్రనాయకత్వం డబుల్ స్ట్రోక్ వ్యూహాన్ని అమలు చేస్తోంది. ఈ వరుస పరిణామాలు కేవలం వ్యక్తగత విభేదాలకే పరిమితం కాకుండా కాంగ్రెస్ పార్టీ అంతర్గత ఆధిపత్య పోరును ప్రతిబింబిస్తున్నాయి. గతంలో సినీ ప్రముఖుల విడాకులపై చేసిన వివాదాస్పద వ్యాఖ్యలు, ఇతర మంత్రి సహచరులతో ఏర్పడిన వైరుధ్యాలు, ఇప్పుడు ఏకంగా ముఖ్యమంత్రిపైనే కూతురితో ఘాటు వ్యాఖ్యలు చేయించడం వంటి వరుస తప్పులు కొండా సురేఖ పొలిటికల్ గ్రాఫ్‌ను దెబ్బతీశాయి. దీంతో ఆమె బిసి వర్గానికి చెందిన నాయకురాలనే వెసులుబాటును కూడా అధిష్టానం ఈసారి పరిగణనలోకి తీసుకునే పరిస్థితి లేదని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి.వరంగల్ రాజకీయాల్లో కొండా దంపతులకు స్వయంకృత ప్రతిపత్తి ఉన్నప్పటికీ, కాంగ్రెస్ ప్రభుత్వంలో సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వానికి అధిష్టానం పూర్తి అండదండలు ఉండటంతో ఈసారి కొండా కుటుంబానికి తప్పించుకునే మార్గాలు మూసుకుపోతున్నాయి. పొలిటికల్‌గా షోకాజ్ నోటీసులు, లీగల్‌గా ఓఎస్డీ సుమంత్‌పై కేసులు, పార్టీపరంగా ఎమ్మెల్యేల వ్యతిరేకత?ఈ మూడు వైపుల నుంచి వస్తున్న ఒత్తిడితో కొండా సురేఖను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేసే దాకా లేదా రాజీనామా చేయించే దాకా ఈ 'ఆట' ఆగదనే విశ్లేషణలు బలంగా వినిపిస్తున్నాయి

**బీసీ కార్డు కాపాడుతుందా**

తెలంగాణ కాంగ్రెస్‌లో మంత్రి కొండా సురేఖ, ఆమె కుటుంబ వ్యవహార శైలిపై మొదలైన వివాదం ఇప్పుడు అత్యంత సున్నితమైన సామాజిక, బీసీ సమీకరణాల మలుపు తీసుకుంది. తన కుమార్తె కొండా సుస్మితా పటేల్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భూ కేటాయింపులపై చేసిన ఆరోపణల తర్వాత, తీవ్రమైన రాజకీయ ఒత్తిడిని ఎదుర్కొంటున్న సురేఖ.. తనకు ఉన్న ఏకైక , బలమైన బీసీ కార్డ్ ను బయటకు తీశారు. క్యాబినెట్‌లోని సీనియర్ బీసీ మహిళా మంత్రిగా ఉన్న తనపై 20 మందికి పైగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి దాడి చేయించడాన్ని బీసీల వేధింపుగా చిత్రీకరించే ప్రయత్నం సురేఖ చేస్తున్నారు. కుమార్తె చేసిన వ్యాఖ్యలకు తనను బాధ్యురాలిని చేయడం సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధమని సురేఖ అంటున్నారు. అంతటితో ఆగకుండా, ఉమ్మడి వరంగల్ జిల్లాలో సుదీర్ఘకాలంగా కాంగ్రెస్ జెండా మోసిన తమ కుటుంబాన్ని, ఓట్ల శాతం ఎక్కువగా ఉన్న బీసీ వర్గాన్ని తగ్గించేందుకే ఈ కుట్ర జరుగుతోందనే సంకేతాలను కేడర్‌లోకి పంపేలా ఈ వ్యూహం ఉంది.పిల్లలు చేసిన వ్యాఖ్యలకు తల్లిగా నన్ను టార్గెట్ చేయడం బీసీ నాయకత్వాన్ని అణచివేసే కుట్రలో భాగమే అన్న సంకేతాలు ఇవ్వడమే కొండా దంపతుల వ్యూహంగా కనిపిస్తోంది. ఈ బీసీ సెంటిమెంట్ అస్త్రం కొండా సురేఖను పదవి నుంచి కాపాడగలదా అంటే.. ప్రస్తుతానికి అవకాశాలు చాలా తక్కువగా కనిపిస్తున్నాయి. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ఈసారి కొండా సురేఖను కాపాడే పరిస్థితి లేదు, సీఎంపై వ్యాఖ్యలు పార్టీ లైన్ దాటాయి అని స్పష్టమైన సూచనలు ఇచ్చారు. స్వయంగా పీసీసీ అధ్యక్షుడే ఈ రకమైన తీవ్రమైన వ్యాఖ్య చేయడం ద్వారా, అధిష్టానం ఇప్పటికే కొండా సురేఖ విషయంలో ఒక కఠినమైన నిర్ణయానికి వచ్చిందని స్పష్టమవుతోంది.మరోవైపు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ వివాదాన్ని కేవలం వ్యక్తిగత విమర్శగా చూడకుండా పార్టీ క్రమశిక్షణ సమస్యగా మార్చడంలో విజయవంతమయ్యారు. ప్రెస్మీట్‌లో ఆయన ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదు . పార్టీ నిర్ణయమే ఫైనల్ అన్నారు. రేవంత్ సోదరుడి భూములపై సుస్మిత నేరుగా దాడి చేయడం వల్ల, సురేఖకు కేబినెట్‌లో కొనసాగే అర్హత లేదని రేవంత్ అనుకూల ఎమ్మెల్యేలు ఇప్పటికే ప్రెస్మీట్ పెట్టారు. పైగా, కాంగ్రెస్ హైకమాండ్ , ఏఐసీసీ కూడా ప్రభుత్వం సుస్థిరంగా సాగాలంటే సీఎం ప్రాధాన్యతకే మొగ్గు చూపుతాయని చెప్పాల్సిన పని లేదు. కాంగ్రెస్ పార్టీ అంతర్గత సమీకరణాలు ప్రస్తుతం తెలంగాణ కాంగ్రెస్‌లో బీసీల ప్రాతినిధ్యం, సమాన అవకాశాలను కాపాడటానికి మహేశ్ కుమార్ గౌడ్ ఇప్పటికే పీసీసీ చీఫ్‌గా ఉన్నారు. అందువల్ల సురేఖను కేబినెట్ నుంచి తప్పించినా, అది కాంగ్రెస్ మొత్తం బీసీలకు వ్యతిరేకం అనే ముద్ర పడకుండా అధిష్టానం కవర్ చేసుకోగలదు. కొండా సురేఖ బీసీ కార్డును ఎంత గట్టిగా పట్టుకున్నప్పటికీ, పార్టీ డిసిప్లినరీ కమిటీ తుది నివేదిక వచ్చాక ఏఐసిసి ఇచ్చే ఆదేశాలే ఆమె రాజకీయాన్ని తేలుస్తాయి. కొండా సురేఖకు మిగిలిన ఏకైక మార్గం.. తన కుమార్తె వ్యాఖ్యలను పూర్తిగా ఖండిస్తూ, పీసీసీ, సీఎం రేవంత్ రెడ్డికి క్షమాపణలు చెప్పడం లేదా పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉండటం. లేనిపక్షంలో, బీసీ సెంటిమెంట్ ఎంత పండించినప్పటికీ.. రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలోని కాంగ్రెస్ నాయకత్వం ఆమెను మంత్రివర్గం నుంచి తొలగించి, పార్టీపరంగా సైడ్ చేయడమే తదుపరి పరిణామంగా మారబోతోం

# తాగినోళ్లకు తాగినంత



అదిలాబాద్: మిగతా వాటి విషయంలో ఎలా ఉంటారో తెలియదు కానీ.. తాగే బ్రాండ్ల విషయంలో మందుబాబులు ఒక క్లారిటీతో ఉంటారు. ఎందుకంటే వాళ్లకు నచ్చిన బ్రాండ్ తాగితేనే కిక్. లేకపోతే వారి కోపం తారస్థాయికి చేరుతుంది. తిక్క రేగితే ప్రభుత్వాన్ని కూడా మార్చగలరు. ఎందుకంటే వాళ్లకు తాగే విషయంలో.. తాగే మందు కిక్కు ఎక్కించే విషయంలో ఏ మాత్రం కాంప్రమైజ్ కారు.అప్పట్లో జగన్ ప్రభుత్వం ఏపీలో అధికారంలో ఉన్నప్పుడు తిక్క తిక్క బ్రాండ్లు మొత్తం మార్కెట్లోకి తీసుకొచ్చింది. ఆ చెత్త బ్రాండ్ల మందు తాగలేక.. ఇతర బ్రాండ్లను రాష్ట్రంలోకి తీసుకొచ్చే అవకాశం లేక మందు బాబులు పడ్డ ఇబ్బందులు మామూలువి కావు. ఆంధ్ర సరిహద్దులో ఉండే తెలంగాణ ప్రాంతాల నుంచి మందుబాబులు మందు కొనుగోలు చేసి తీసుకెళ్లేవారు. అయితే ఈ వ్యవహారానికి అడ్డు కట్టడానికి ఏపీ పోలీసులు ప్రత్యేకంగా చెక్పోస్టులు ఏర్పాటు చేసే వారంటే.. నాడు పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. చివరికి వారు కోరుకున్న బ్రాండ్ల మద్యం అందుబాటులోకి తీసుకొస్తామని ఎన్నికల ప్రచారంలో నాటి టిడిపి అధ్యక్షుడు చంద్ర బాబు చెప్పారు అంటే.. మందుబాబులు బ్రాండ్లకు ఇచ్చే విలువ ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు.మద్యం వినియోగంలో దేశంలో ఉన్న అన్ని రాష్ట్రాలు పోటీ పడుతున్నాయి. ఇక తెలుగు రాష్ట్రాలలో తెలంగాణలో కూడా మద్యం వినియోగం అధికంగా ఉంది. ఒకప్పుడు అకేషనల్ గా మాత్రమే చాలామంది తాగేవారు. ఇప్పుడు ఒక అలవాటుగా తాగడాన్ని మార్చుకున్నారు. ఈ నేపథ్యంలో మార్కెట్లోకి కొత్త కొత్త బ్రాండ్లను అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తోంది. త్వరలో తెలంగాణ మార్కెట్లోకి చీతా.. టైగర్.. రెడ్ హార్స్ వంటి బ్రాండ్లు అందుబాటులోకి రాబోతున్నాయి. మార్కెట్లో ఏకంగా 121 కొత్త మద్యం బ్రాండ్లను తీసుకురావడానికి ఎక్సైజ్ శాఖకు దరఖాస్తులు వచ్చాయి. మొత్తంగా 18 కంపెనీలు ఈ దరఖాస్తులు సమర్పించాయి. ఈ బ్రాండ్ల సరఫరాకు సంబంధించి ఎటువంటి అభ్యంతరాలు ఉన్నా సెప్టెంబర్ 1లోగా తెలియజేయాలని ఎక్సైజ్ శాఖ ప్రకటించింది. ఇక కొత్త బ్రాండ్ల జాబితాలో ఆ బెస్ట్.. బర్గర్.. టైగర్.. రెడ్ హార్స్.. బుటానిస్.. సీయోక్ బింగో.. కాకావిస్.. డాన్ గ్లాంగ్ వంటి బీర్లతోపాటు.. విస్కీ.. బ్రాందీ వంటి వాటిలో కూడా మద్యం బ్రాండ్లు అందుబాటులోకి రాబోతున్నాయి.తెలంగాణ రాష్ట్రంలో మద్యం సిండికేట్ వల్ల చాలా ప్రాంతాలలో కొన్ని కంపెనీలకు సంబంధించిన బీర్లు.. విస్కీ.. బ్రాందీ అందుబాటులో ఉన్నాయి. ప్రభుత్వం కూడా ఈ సిండికేట్ ఆగడాలకు అడ్డుకట్ట వేయలేని పరిస్థితి. ఈ నేపథ్యంలో కొత్త బ్రాండ్లు అందుబాటులోకి వస్తే మందుబాబులు ఏ విధంగా స్వీకరిస్తారనేది చూడాల్సి ఉంది. సాధారణంగా తెలంగాణ రాష్ట్రంలో మందుబాబులు బ్రాండ్లకు విపరీతమైన ప్రియారిటి ఇస్తారు. ఆమధ్య తమ కోరుకున్న బ్రాండ్ బీర్లు అందుబాటులో లేవని తెలంగాణ రాష్ట్రంలో కొన్ని ప్రాంతాలలో మద్యం షాపులు ఎదుట మందుబాబులు నిరసన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ఈ కొత్త బ్రాండ్లను తీసుకువచ్చి మందుబాబుల ఆగ్రహానికి ప్రభుత్వం గనుక గురైతే అప్పుడు పరిస్థితి వేరే విధంగా ఉంటుంది అందువల్లే బ్రాండ్ల విషయంలో రేవంత్ ప్రభుత్వం ఆచితూచి వ్యవహరిస్తున్నట్టు తెలుస్తోంది.

## మహ్మద్ ప్రవక్త బోధనలు అనుసరణీయం.

**ఘనంగా మిలాద్ ఉన్ నబి పర్వదిన వేడుకలు**



**హ్వాళగుంద :** మహ్మద్ ప్రవక్త బోధనలు సర్వమానవాళికి అనుసరణీయమని పలువురు వక్తులు అన్నారు.బుధవారం మండల కేంద్రంలో మహ్మద్ ప్రవర్త పుట్టిన రోజైన మిలాద్ ఉన్ నబి పర్వదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఇందులో భాగంగా రాజనగర్,శాలి మసీదు నుంచి పెద్దలు,యువకులు, చిన్నారులు కలిసి కట్టుగా పురవీధుల్లో ఉరిగింపు వెళ్లి ఈద్గా వద్దకు చేరుకుని అక్కడ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహ్మద్ ప్రవక్త దాతృత్వం,కరుణ ధార్మిక చింతన సర్వమానవాళి ఐక్యమత్యాని ఆకాంక్షించారని చెప్పారు.మానవాళి ధర్మమార్గంలో,సత్యమార్గంలో నడుచుకునేలా ప్రవక్త ప్రభోధించారన్నారు. అనంతరం ఒకరినొకరు మిలాద్ ఉన్ నబి పర్వదిన శుభాకాంక్షలు తెలియజేశారు.ర్యాలీలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ దిలీప్ కుమార్ సిబ్బందితో గట్టి బందోబస్తు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఫక్రుద్దిన్ సాబ్,ఫజల్ సాబ్,శాలి మస్తాన్,షబ్బీర్,రహంతుల్లా,ఖాసిం,ఖలందర్, హబిబుల్లా,కైఫ్,టిప్పు,వలి భాష, సాయి బీష్ హుస్సేన్ పీరా మహబూబ్ భాష,జావిద్, మౌలా సాబ్,హుసేన్ పీర, సుభాన్,జిలాన్, దాదావలీ,సాబ్ హుసేన్,అమాన్ తదితరులు పాల్గొన్నారు.

## ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్ ను ఘనంగా సన్మానించిన బండారు శ్రీనివాసులు మరియు బ్యాంకు సిబ్బంది




**ఆగస్టు 26 ప్రజా జ్యోతి న్యూస్ రాయలసీమ ఇంచార్జ్ శ్రీనివాస్ నాయుడు :-** ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ కూడేరు మండలం జల్లిపల్లి బ్రాంచ్ ఫీల్డ్ ఆఫీసర్ గా పని చేస్తూ తన సొంత జిల్లా అయినటువంటి బాపట్ల రీజినల్ ఆఫీసుకు బదిలీ అయిన సందర్భంగా ఫీల్డ్ ఆఫీసర్ సారు ఇంకా ముసు ముందు ఎన్నో ఉన్నత స్థాయికి ఎదగాలని కోరుకుంటూ వారికి వారి కుటుంబానికి దేవుని ఆశీస్సులు ఉండాలని కోరుచున్నాను అని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కుడేరు మండల ఉపాధ్యక్షులు బండారు శ్రీనివాసులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర ప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ సేజాల పెద్దన్న మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## కోదాడ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం..

**కంటైనర్‌ను ఢీకొట్టిన ప్రైవేట్ బస్సు.. ఆరుగురు స్పాట్ డెడ్**

**హైదరాబాద్ :** హైదరాబాద్– విజయవాడ హైవేపై కోదాడ మండలం దుర్గాపురం స్టేజీ సమీపంలో ఘోర ప్రమాదం జరిగింది. హైదరాబాద్ నుంచి ఏలూరుకు వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఐరన్ రాడ్ల లోడుతో వెళ్తున్న డీసీఎం వాహనాన్ని వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆరుగురు ప్రయాణికులు అక్కడికక్కడే మృతి చెందగా.. మరో 20 మందికి తీవ్రంగా గాయపడ్డారు. అతివేగం, డ్రైవర్ నిద్రమత్తు వల్లే ప్రమాదం చోటుచేసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు. ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు.హైదరాబాద్– విజయవాడ హైవేపై ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు.. ముందు వెళ్తున్న కంటైనర్ డీసీఎంను వాహనాన్ని వెనుక నుంచి వేగంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో బస్సులోని ఆరుగురు ప్రయాణికులు స్పాట్‌లోనే ప్రాణాలు కోల్పోయారు. మరికొందరు ప్రయాణికులకు తీవ్ర గాయాలయ్యాయి. కోదాడ మండలం దుర్గాపురం స్టేజీ సమీపంలో ఇవాళ తెల్లవారుజామున ఈ ప్రమాదం చోటు చేసుకుంది.వివరాల్లోకి వెళితే.. హైదరాబాద్ నుంచి ఏలూరుకు అర్ధరాత్రి దాటిన తర్వాత ఓ ప్రైవేటు ట్రావెల్స్ బస్సు బయల్దేరింది. బస్సుకు ఇద్దరు డ్రైవర్లు ఉండగా.. సూర్యాపేటకు చేరుకోగా డ్రైవర్ ఛేంజ్ అయ్యారు. ఆ తర్వాత బస్సు బయల్దేరగా.. కోదాడ మండలం దుర్గాపురం స్టేజీ సమీపంలోకి చేరుకోగానే ముందు ఐరన్ రాడ్లతో వెళ్తున్న డీసీఎం వాహనాన్ని ఢీకొట్టింది. బస్సు రైట్ యాక్సిడెంట్ కాకా.. ఐరన్ రాడ్లు బస్సులోపలికి దూసుకెళ్లాయి. ప్రమాద తీవ్రతకు బస్సు ముందు భాగం నుజ్జునుజ్జయింది. ఈ దుర్ఘటనలో ఆరుగురు ప్రయాణికులు స్పాట్‌లోనే ప్రాణాలు కోల్పోగా.. మరో 20 మంది తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాద సమయంలో బస్సులో ఇద్దరు డ్రైవర్లతో కలిపి మొత్తం 42 మంది ప్రయాణికులు ఉన్నారు.విషయం తెలుసుకున్న పోలీసులు, హైవే పెట్రోలింగ్ సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకొన్నారు. సహాయక చర్యలు చేట్టి తీవ్రంగా గాయపడిన క్షతగాత్రులను కోదాడ ప్రభుత్వ ఆసుపత్రితో పాటు విషమంగా ఉన్నవారిని మెరుగైన చికిత్స కోసం సమీపంలోని ఇతర ప్రైవేటు ఆసుపత్రులకు తరలించారు. గాయపడిన వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉందని.. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని డాక్టర్లు పోలీసులు తెలిపారు. రోడ్డు ప్రమాదంతో జాతీయ రహదారిపై భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడగా.. పోలీసులు ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. అతివేగం, డ్రైవర్ నిద్రమత్తు వల్లే ఈ ఘోర ప్రమాదం జరిగి ఉండవచ్చునని పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. కాగా, ప్రమాదానికి గల కారణాలు, మృతుల పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## ఖైదీతో మహిళా అధికారి న్యూడ్ కాల్....

**బెంగళూరు :** కర్ణాటకలో ఓ మహిళా పోలీస్ అధికారికి సంబంధించిన వీడియో కాల్ వ్యవహారం తీవ్ర వివాదానికి దారితీసింది. బెళగావిలోని హిండాల్గా సెంట్రల్ జైలులో ఉన్న వ్యక్తితో ఆమె వాట్సాప్ వీడియో కాల్‌లో మాట్లాడినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ వీడియోలో అధికారి అభ్యంతరకర రీతిలో కనిపించినట్లు సోషల్ మీడియాలో ప్రచారం జరగడంతో విషయం వెలుగులోకి వచ్చింది. వీడియో వైరల్ కావడంతో పోలీసు శాఖలోనూ చర్చనీయాంశంగా మారింది.తాజా సమాచారం ప్రకారం.. ఈ వ్యవహారానికి సంబంధించి ఆ మహిళా అధికారి బెంగళూరులోని కబ్బన్ పార్క్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. తనకు సంబంధించిన వీడియోను కొందరు వ్యక్తులు రికార్డు చేసి, ఇతరులకు పంపించారని ఆమె ఆరోపించినట్లు రిపోర్టులు చెబుతున్నాయి. ఈ ఫిర్యాదుపై పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.వైరల్ అయిన క్లిప్‌లో మహిళా పోలీస్ అధికారి యూనిఫాంలో కనిపించినట్లు, అనంతరం అభ్యంతరకర స్థితిలో ఉన్న దృశ్యాలు ఉన్నట్లు పలు మీడియా కథనాలు పేర్కొన్నాయి. అయితే వీడియో ఎప్పుడు, ఎలా రికార్డు అయింది? దాన్ని ఎవరు బయటకు పంపించారు? ఖైదీ వద్దకు మొబైల్ ఫోన్ ఎలా చేరింది? వంటి అంశాలపై దర్యాప్తు కొనసాగుతోంది. అందువల్ల సోషల్ మీడియాలో వస్తున్న ప్రతి వాదనను వాస్తవంగా పరిగణించాల్సిన అవసరం లేదని అధికారులు స్పష్టం చేస్తున్నారు.లో కర్ణాటక జైళ్లలో ఖైదీలకు మొబైల్ ఫోన్లు, ఇతర నిషేధిత వస్తువులు ఎలా అందుతున్నాయనే అంశం మరోసారి చర్చకు వచ్చింది. ఇటీవలే బెంగళూరులోని పరప్పన అగ్రహార కేంద్ర కారాగారంలో తనిఖీలు నిర్వహించగా మొబైల్ ఫోన్ సహా నిషేధిత వస్తువులు బయటపడిన విషయం తెలిసిందే. జైళ్లలో అక్రమ కార్యకలాపాలను సహించబోమని హోంమంత్రి ప్రియాంక్ ఖర్గే హెచ్చరించారు.ఖైదీ హైప్రొఫైల్ వ్యక్తి అయినా, సాధారణ ఖైదీ అయినా నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని ఖర్గే స్పష్టం చేశారు. జైళ్లలో నిషేధిత పరికరాలకు అవకాశం కల్పించే అధికారులు, సిబ్బందిపై కూడా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. అవసరమైతే నేరం రుజువైన అధికారులను ఉద్యోగం నుంచి తొలగించే అవకాశం ఉందని చెప్పారు.ఇదిలా ఉండగా, మహిళా పోలీస్ అధికారికి సంబంధించిన ఈ వీడియో ఘటనపై పూర్తి వివరాలు దర్యాప్తు తర్వాతే స్పష్టమయ్యే అవకాశం ఉంది. వీడియో నిజమైనదేనా, దాని పూర్తి నేపథ్యం ఏమిటి, దాన్ని ఎవరు రికార్డు చేసి వైరల్ చేశారు, జైలులోని నిబంధనలను ఎవరైనా ఉల్లంఘించారా అనే అంశాలపై పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు. ఈ ఘటన పోలీసు శాఖ ప్రతిష్ఠ, జైలు భద్రతపై మరోసారి ప్రశ్నలు లేవనెత్తింది.

## గిరిజన అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట

**ప్రతి గిరిజన తండాలో సేవాలాల్ మహారాజ్ ఆలయ నిర్మాణానికి శ్రీకారం**

**వనపర్తి** గిరిజనుల సంక్షేమం, అభివృద్ధితో పాటు వారి సంస్కృతి, సంప్రదాయాలు, ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని వనపర్తి శాసనసభ్యులు గౌరవ శ్రీ తూడి మేఘారెడ్డి అన్నారు.వనపర్తి పట్టణంలోని పాత మార్కెట్ యార్డులో బుధవారం వనపర్తి జిల్లా బంజారా సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన తీజ్ ఉత్సవాల్లో ఎమ్మెల్యే శ్రీ తూడి మేఘారెడ్డి గారు పాల్గొని గిరిజన సంప్రదాయ పద్ధతిలో ప్రత్యేక పూజలు నిర్వహించారుఈ సందర్భంగా గిరిజన యువతులు తీజ్ మొలకలతో ఎమ్మెల్యే గారిని సత్కరించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేఘారెడ్డి మాట్లాడుతూ, తీజ్ పండుగ బంజారా సమాజానికి ఎంతో పవిత్రమైన, ప్రత్యేకమైన పండుగ అని అన్నారు. తీజ్ సందర్భంగా గిరిజన మహిళలు, యువతులు భక్తిశ్రద్ధలతో మొలకలను పెంచి, వాటిని పూజించి, కుటుంబాలు సుఖసంతోషాలతో ఉండాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని కోరుకోవడం బంజారా సంస్కృతిలో గొప్ప సంప్రదాయమని తెలిపారు.

# బిజినెస్

## ప్రభుత్వాలు అప్రమత్తం కాకపోతే ఏఐతో భారీ ప్రమాదం.. హెచ్చరించిన బిల్ గేట్స్



ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వేగంగా విస్తరిస్తున్న తరుణంలో మైక్రోసాఫ్ట్ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్ అంతర్జాతీయ సమాజానికి తీవ్ర హెచ్చరికలు చేశారు. ప్రభుత్వాలు గనుక త్వరితగతిన అప్రమత్తమై నిబంధనలు తీసుకురాకపోతే మానవ సమాజానికి భారీ ప్రమాదం పొంచి ఉందని హెచ్చరించారు. గత సాంకేతిక విప్లవాలు ఉద్యోగ అవకాశాలను పెంచినప్పటికీ, ఏఐ విప్లవం మాత్రం అందుకు పూర్తి భిన్నమైనదని గేట్స్ స్పష్టంచేశారు. ఏఐ వల్ల అనేక ఉద్యోగాలు శాశ్వతంగా కనుమరుగైపోతాయని, కేవలం కొన్ని రంగాలు మాత్రమే మానవులకు ఉపాధిని ఇవ్వగలవని తెలిపారు. ఏఐ కోడింగ్ సామర్థ్యాలు తనను ఎంతగానో ఆశ్చర్యపరిచాయని, నిపుణులైన మనుషుల కంటే మెరుగ్గా పనిచేస్తున్న ఈ సాంకేతికతవల్ల సమీప భవిష్యత్తులోనే ఉపాధి రంగంలో తీవ్ర సంక్షోభం రానుందని ఆందోళన వ్యక్తంచేశారు. ఏఐ కంపెనీలు దీనివల్ల వచ్చే ముప్పును తక్కువ చేసి చూపిస్తున్నాయని, పెట్టుబడులు తగ్గిపోతాయనే భయంతో అసలు ఆందోళనలను బహిరంగంగా అంగీకరించడం లేదని విమర్శించారు. మనుషుల ఉపాధిని కాపాడేందుకు గేట్స్ కొన్ని సంచలనాత్మక ప్రతిపాదనలు చేశారు. ఏఐ, రోబోలను ఉపయోగిస్తూ మనుషులను ఉద్యోగాల నుంచి తొలగించే కంపెనీలపై ప్రత్యేక పన్ను విధించాలని, ఆ ఆదాయంతో ఉద్యోగాలు కోల్పోయిన వారికి పునరావాసం కల్పించాలని సూచించారు. అలాగే కొన్ని రంగాలను కేవలం “మనుషులకు మాత్రమే పరిమితం” చేయాలని, ఉదాహరణకు వైద్యరంగంలో రోగికి వ్యాధి వివరాలు చెప్పడం లేదా కేర్ గివింగ్ వంటి బాధ్యతలను మనుషులే నిర్వహించేలా చట్టాలు తేవాలని ప్రతిపాదించారు. అంతేకాకుండా జీవాస్త్రాలు లేదా కొత్త రకం రసాయన ఆయుధాలను అభివృద్ధి చేసేందుకు ఏఐని దుర్వినియోగం చేసే ప్రమాదం ఉందని హెచ్చరించారు. అణు ఆయుధాలు, అంతర్జాతీయ విమానయానానికి ఉన్నట్లే ఏఐ వినియోగం, నియంత్రణ కోసం ప్రపంచవ్యాప్తంగా కఠినమైన ఒప్పందాలు, పర్యవేక్షణ సంస్థలు ఏర్పాటు కావాలని సూచించారు.

# దేశంలో చక్కెర కొరత లేదు..

## స్పష్టంచేసిన కేంద్రం

దేశంలో చక్కెర కొరత లేదని కేంద్ర ప్రభుత్వం స్పష్టంచేసింది. అక్టోబర్‌లో కొత్త క్రషింగ్ సీజన్ ప్రారంభమయ్యే వరకు దేశీయ డిమాండ్‌ను తీర్చేందుకు తగినంత చక్కెర నిల్వలు ఉన్నాయని వెల్లడించింది. ఇథనాల్ ఉత్పత్తికి చక్కెర మళ్లింపు తగ్గిందని, ప్రస్తుత ధరల పెరుగుదలకు ఇథనాల్ కార్యక్రమం కారణం కాదని పేర్కొన్నది. 2022-23 లో ఇథనాల్ ఉత్పత్తికి మళ్లించిన చక్కెర వాటా సుమారు 12 శాతం ఉండగా.. 2025-26 లో అది 9 శాతానికి తగ్గిందని ప్రభుత్వం తెలిపింది. ప్రస్తుతం దేశంలో ఉత్పత్తి అవుతున్న ఇథనాల్‌లో దాదాపు మూడొంతుల వాటా ధాన్యాలు, ముఖ్యంగా మొక్కజొన్న నుంచే వస్తోందని వివరించింది. ఇదిలావుంటే ఇటీవల చక్కెర ధరలు గణనీయంగా పెరిగాయి. జూలై 20న కిలో రూ.48.18 గా ఉన్న చక్కెర ధర ఆగస్టు 20 నాటికి రూ.55.70 కు చేరింది. అంటే నెల రోజుల్లో సుమారు 15.6 శాతం పెరిగింది. అయితే 2024 ఆగస్టు నుంచి 2026 జూలై వరకు వినియోగదారుల రిటైల్ చక్కెర ధరలు ఏటా సగటున కేవలం 3 శాతం మేర మాత్రమే పెరిగాయని ప్రభుత్వం తెలిపింది. ప్రస్తుత ధరల పెరుగుదలకు దేశీయ ఉత్పత్తి అంచనాల కంటే తగ్గడం, పండుగల సీజన్‌కు ముందు డిమాండ్ పెరగడం, అధిక వర్షాలతో చెరకు పంట దెబ్బతినడం వంటి కారణాలు ఉన్నాయని వివరించింది. చెరకు పంటలో రెడ్ రాట్, టాప్ బోరర్ వంటి తెగుళ్లతోపాటు నీటిముంపు కారణంగా ఉత్పత్తిపై ప్రభావం పడిందని పేర్కొన్నది. అంతర్జాతీయంగా చక్కెర సరఫరాలు తగ్గడం, ధరలు పెరగడం, కొందరు వ్యాపారులు నిల్వలు చేయడం, మార్కెట్‌లో ఊహాగానాలు కూడా ధరల పెరుగుదలకు కారణమని తెలిపింది. ప్రస్తుత సీజన్‌లో చక్కెర ఉత్పత్తి తొలుత అంచనా వేసిన 343 లక్షల టన్నులతో పోలిస్తే 306 లక్షల టన్నులకు పరిమితం కావచ్చని ప్రభుత్వం వెల్లడించింది.



అయినప్పటికీ దేశీయ వినియోగానికి అవసరమైన నిల్వలు అందుబాటులో ఉన్నాయని స్పష్టంచేసింది. భారత్‌లో సాధారణంగా ఏటా 300-340 లక్షల టన్నుల చక్కెర ఉత్పత్తి కాగా, దేశీయ వినియోగం 280-290 లక్షల టన్నులుగా ఉంటుందని తెలిపింది. ప్రపంచవ్యాప్తంగా కూడా చక్కెర సరఫరా ఒత్తిడిలో ఉందని ప్రభుత్వం పేర్కొన్నది. 2026-27లో ప్రపంచ చక్కెరలోటు సుమారు 33 లక్షల టన్నులుగా ఉండొచ్చని అంచనా వేసింది. జూన్ 30న టన్నుకు 474 డాలర్లుగా ఉన్న అంతర్జాతీయ చక్కెర ధర ఆగస్టు 20 నాటికి 552 డాలర్లకు పెరిగిందని తెలిపింది. ఇథనాల్ కార్యక్రమం చెరకు రైతులకు, చక్కెర మిల్లులకు ప్రయోజనం చేకూర్చిందని కేంద్రం పేర్కొన్నది. మిగులు చక్కెరను ఇథనాల్ ఉత్పత్తికి మళ్లించడం ద్వారా చక్కెర మిల్లుల వద్ద నిధులు నిలిచిపోకుండా, రైతులకు చెల్లింపులు ఆలస్యం కాకుండా చూడగలిగామని వివరించింది. చెరకు సాగు విస్తీర్ణం 2015-16లో 49.27 లక్షల హెక్టార్ల నుంచి 2025-26లో 58.87 లక్షల హెక్టార్లకు పెరిగిందని తెలిపింది. 2025-26 చక్కెర సీజన్‌కు సంబంధించి రైతులకు చెల్లించాల్సిన చెరకు బకాయిల్లో ఇప్పటికే 97 శాతం చెల్లింపులు పూర్తయ్యాయని ప్రభుత్వం వెల్లడించింది. చక్కెర మిల్లుల ఆర్థిక పరిస్థితి మెరుగుపడటంతో అవి ప్రభుత్వ సాయంపై ఆధారపడటం కూడా తగ్గిందని పేర్కొన్నది.

## ఎంజీ సరికొత్త ఈవీ మాడల్ ప్రారంభ ధర రూ.19.49 లక్షలు

**సింగిల్ చార్జింగ్‌తో 517 కిలోమీటర్లు**

**న్యూఢిల్లీ, ఆగస్టు 26:** దేశవ్యాప్తంగా ఈవీలకు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటర్ ఇండియా..దేశీయ మార్కెట్‌కు మరో మాడల్‌ను పరిచయం చేసింది. తోమహావాక్ ఈవీ పేరుతో విడుదల చేసిన ఈ మాడల్ ప్రారంభ ధర రూ.19.49 లక్షలుగా నిర్ణయించిన సంస్థ..గరిష్ఠంగా రూ.23.49 లక్షలుగా నిర్ణయించింది. 15.6 ఇంచుల టచ్‌స్క్రీన్ ఇన్ఫోటైన్‌మెంట్ సిస్టమ్, వైర్‌లెస్ ఆండ్రాయిడ్ ఆటో, యాపిల్ కార్‌ప్లే, ఆటోమేటిక్ క్లైమెట్ కంట్రోల్, వైర్‌లెస్ ఫోన్ చార్జర్ వంటి ఫీచర్స్‌తో తీర్చిదిద్దింది. 69.2 కిలోవాట్ల బ్యాటరీ కలిగిన ఈ మాడల్ సింగిల్ చార్జింగ్‌తో 517 కిలోమీటర్లు ప్రయాణించనున్నది. 8.2 సెకండ్లలో 100 కిలోమీటర్ల వేగాన్ని అందుకోనున్న ఈ కారు కేవలం 35 నిమిషాల్లోనే 20 శాతం నుంచి 80 శాతం వరకు బ్యాటరీ రీచార్జికానున్నది. మహీంద్రా ఎక్స్‌ఈవీ 9ఎస్, టాటా




సఫారీ ఈవీలకు పోటీగా సంస్థ ఈ వాహనాన్ని విడుదల చేసింది. ఈ సందర్భంగా జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటర్ ఇండియా డైరెక్టర్ పార్థ జిందాల్ మాట్లాడుతూ..భారత్‌లో ఈవీల ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచడానికి రూ.6 వేల కోట్ల పెట్టుబడులు పెట్టబోతున్నట్టు ప్రకటించారు.

# టీమిండియాకు పొంచి ఉన్న గండం!

కొలంబోలో శ్రీలంకతో జరుగుతున్న రెండో టెస్టు మ్యాచ్‌లో నాలుగో రోజు ఆట ముగిసేసరికి భారత్ పటిష్టమైన స్థితిలో నిలిచింది. వర్షంతో మ్యాచ్ ఆగిపోయే సమయానికి శ్రీలంక 229/6 స్కోరుతో ఉండగా, ఆతిథ్య జట్టు కేవలం 16 పరుగుల స్వల్ప ఆధిక్యంలో కొనసాగుతోంది. గురువారం ఆటకు చివరి రోజు కావడంతో, భారత్ గెలుపు లాంచనమే అయినప్పటికీ, వర్షం ముప్పు కూడా పొంచి ఉంది. ఒకవేళ వర్షంతో ఐదో రోజు ఆటలో ఒక్క బంతి కూడా సాధ్యపడకపోతే అప్పుడు మ్యాచ్ డ్రా అవుతుంది. మరి మ్యాచ్ డ్రా అయితే టీమిండియా డబ్ల్యూటీసీ ఫైనల్ చేరడంలో భారత్‌కు ఎదురయ్యే అడ్డంకులు ఏంటనేవి ఒకసారి పరిశీలిద్దాం. ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ (ఔజ) పాయింట్ల పట్టికలో భారత్ ప్రస్తుతం 53.33 శాతం పాయింట్లతో (ౖాజు) ఐదవ స్థానంలో ఉంది. ఆస్ట్రేలియా చేతిలో బంగ్లాదేశ్ ఘోర పరాజయం పాలైన నేపథ్యంలో, శ్రీలంకపై గెలిస్తే భారత్ నాలుగో స్థానానికి చేరుకుంటుంది. అయితే, మ్యాచ్ డ్రా అయితే మాత్రం, భారత్ 51.52 శాతం పాయింట్ల తేడాతో ఐదవ స్థానంలోనే కొనసాగుతుంది. అయితే డబ్ల్యూటీసీ సైకిల్‌లో భారత్‌కు మరో ఏడు టెస్టులు మిగిలి ఉన్నాయి.
ఇప్పటివరకు ఆడిన 10 టెస్టుల్లో ఇప్పటికే నాలుగింటిలో ఓడిపోయిన శుభ్‌మన్ గిల్ నేతృత్వంలోని జట్టుకు, ఇక నుంచి ప్రతీ టెస్టు నాకౌట్ లాంటిదే. ఈ ఏడాది నవంబరులో రెండు టెస్టుల సిరీస్ కోసం భారత్ న్యూజిలాండ్‌కు వెళ్లనుంది. ఆ తర్వాత ఐపీఎల్ 2027 సీజన్‌కు ముందు స్వదేశంలో ఆస్ట్రేలియాతో ఐదు టెస్టుల సిరీస్ ఆడనుంది. అయితే



డార్విన్ వేదికగా ఆస్ట్రేలియాతో జరిగిన తొలి టెస్టును బంగ్లాదేశ్ నెగ్గడంతో, భారత్ తమకు మిగిలిన 8 టెస్టుల్లో ఏడు గెలవాల్సి ఉంటుంది. అయితే ఇప్పుడు లంకతో రెండో టెస్టు వర్షం వల్ల డ్రా అయితే మాత్రం భారత్ కచ్చితంగా ఏడింటికి ఏడు టెస్టులు గెలవాల్సి ఉంటుంది. అప్పుడే టీమిండియా డబ్ల్యూటీసీ పాయింట్లు 68.52గా ఉండడంతో పాటు ఫైనల్ ఆడేందుకు చాన్స్ ఉంటుంది. అంతేకాదు భారత్‌కు రాబోయే ఏడు టెస్టుల్లో ఎలాంటి పెనాల్టీ పాయింట్లు లభించకపోతేనే ఈ పరిస్థితులు సాధ్యమవుతాయన్న విషయం గుర్తుంచుకోవాలి.

## 21 ఏళ్ల కెరీర్‌కు గుడ్‌బై చెప్పిన సౌతాఫ్రికా మాజీ కెప్టెన్

దక్షిణాఫ్రికా మాజీ కెప్టెన్ డీన్ ఎల్గర్ బుధవారం ప్రొఫెషనల్ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించాడు. ప్రస్తుతం కౌంటీ క్రికెట్‌లో ఎసెక్స్ తరఫున ఆడుతున్న డీన్ ఎల్గర్, 2026 కౌంటీ సీజన్ తనకు చివరి టోర్నీ అని, ఆ తర్వాత క్రికెట్‌కు పూర్తిగా వీడ్కోలు పలుకుతున్నట్లు తెలిపాడు. 2012లో సౌతాఫ్రికా తరఫున అంతర్జాతీయ క్రికెట్‌లో అరంగేట్రం చేసిన డీన్ ఎల్గర్ 2024లో కేప్‌టౌన్‌లో భారత్‌తో జరిగిన టెస్టు మ్యాచ్ తర్వాత అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించాడు. 2018లో చివరి వన్డే ఆడాడు. అప్పటినుంచి కౌంటీల్లో కొనసాగుతూ వచ్చాడు. తాజాగా ప్రొఫెషనల్ క్రికెట్ నుంచి తప్పుకుంటున్నట్లు ఎల్గర్ ప్రకటన విడుదల చేశాడు. 2012 నుంచి 2024 మధ్య సౌతాఫ్రికాకు ప్రాతినిధ్యం వహించిన డీన్ ఎల్గర్ నిఖార్సైన టెస్టు క్రికెటర్‌గా గుర్తింపు పొందాడు. తన 12 ఏళ్ల కెరీర్‌లో టెస్టులకు మాత్రమే పరిమితమైన డీఎన్ ఎల్గర్ 2017లో ఇంగ్లండ్‌తో టెస్టు సిరీస్ సమయంలో రెగ్యులర్ కెప్టెన్ డుప్లెసిస్ వ్యక్తిగత కారణాలతో దూరమైనప్పుడు అతడి స్థానంలో ఎల్గర్ బాధ్యతలు చేపట్టాడు. 2021లో వెస్టిండీస్‌తో టెస్టు సిరీస్‌కు డీన్ ఎల్గర్ తొలిసారి టెస్టు కెప్టెన్‌గా పూర్తి బాధ్యతలు తీసుకున్నాడు. అతడి సారథ్యంలో దక్షిణాఫ్రికా 18 టెస్టులు ఆడగా, ఇందులో 9 విజయాలు, ఏడు ఓటములు, రెండు డ్రాలు ఉన్నాయి. కెప్టెన్‌గా డీన్ ఎల్గర్ సక్సెస్ రేటు 50శాతం ఉండడం గమనార్హం. 21



ఏళ్ల ప్రొఫెషనల్ కెరీర్‌లో డీన్ ఎల్గర్ 278 ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌ల్లో 18,925 పరుగులు, 178 లిస్ట్-ఏ క్రికెట్ మ్యాచ్‌ల్లో 6,264 పరుగులు సాధించాడు. ఇక అంతర్జాతీయ క్రికెట్‌లో సౌతాఫ్రికా తరఫున డీన్ ఎల్గర్ 86 టెస్టుల్లో 5,347 పరుగులు సాధించాడు. ఇందులో 14 సెంచరీలు, 23 అర్ధశతకాలు ఉన్నాయి. కౌంటీ ఛాంపియన్‌షిప్ డివిజన్ వన్‌లో ఎసెక్స్ మరో ఐదు మ్యాచ్‌లు ఆడనుంది , ఇందులో భాగంగా సర్రేతో వారి మ్యాచ్ ఆగస్టు 27న ప్రారంభం కానుంది. సెప్టెంబర్ 24న గ్లామోర్గాన్‌తో జరిగే మ్యాచ్‌తో ఎసెక్స్ తమ సీజన్‌ను ముగించనుంది. దీంతో ఎల్గర్ ప్రొఫెషనల్ కెరీర్‌కు కూడా ఎండ్‌కార్డ్ పడనుంది.


# స్పోర్ట్స్

## సెమీస్‌కు నార్త్ జోన్



బెంగళూరు: దులీప్ ట్రోఫీలో నార్త్‌జోన్ సెమీస్‌కు దూసుకెళ్లింది. బెంగళూరు వేదికగా జరిగిన రెండో క్వార్టర్స్‌లో నార్త్.. వెస్ట్‌జోన్‌పై 52 పరుగుల తేడాతో గెలుపొందింది. ఆఖరి రోజు వెస్ట్ విజయానికి 67 రన్స్ అవసరం కాగా రుతురాజ్ గైక్వాడ్ సేన ఓవర్‌నైట్ స్కోరు(220)కు మరో 14 పరుగులు మాత్రమే జోడించి 234కు ఆలౌటైంది. తొలి ఇన్నింగ్స్‌లో ఐదు వికెట్లు తీసిన అబిద్ ముస్తాక్.. రెండో ఇన్నింగ్స్‌లో 4 వికెట్లు పడగొట్టి నార్త్ విజయంలో కీలకపాత్ర పోషించాడు. ఈనెల 30 నుంచి మొదలయ్యే సెమీఫైనల్ మ్యాచుల్లో భాగంగా తొలి సెమీస్‌లో సెంట్రల్ జోన్.. ఈస్ట్‌తో తలపడాల్సి ఉండగా రెండో పోరులో సౌత్, నార్త్ జోన్‌లు ఢీకొననున్నాయి.

## కెరీర్‌లో తొలిసారి అగ్రస్థానానికి ఆసీస్ పేసర్



**దుబాయ్ :** ఆస్ట్రేలియా స్టార్ పేసర్ మిచెల్ స్టార్క్ తన కెరీర్‌లో తొలిసారి ఐసీసీ టెస్టు ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు. ఇటీవల బంగ్లాదేశ్‌తో ముగిసిన రెండో టెస్టులో పది వికెట్ల ప్రదర్శన చేసిన ఈ లెఫ్టార్మ్ పేసర్.. ఐసీసీ తాజాగా విడుదల చేసిన ర్యాంకింగ్స్‌లో రెండు స్థానాలను మెరుగుపరుచుకుని 872 రేటింగ్ పాయింట్లతో టాప్ ప్లేస్‌కు చేరుకున్నాడు. భారత పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా రెండో స్థానానికి పడిపోయాడు. ర్యాంకింగ్స్‌లో నిరుడు రెండో స్థానానికి చేరడమే స్టార్క్ సుదీర్ఘ కెరీర్‌లో అత్యుత్తమం కాగా ఇప్పుడు ఫస్ట్ ర్యాంకుకు చేరడం గమనార్హం. టెస్టు బ్యాటర్ల విషయానికొస్తే హ్యారీ బ్రూక్ (ఇంగ్లండ్) మొదటి స్థానంలో కొనసాగుతుండగా రిషబ్ పంత్ ఆరు స్థానాలు ఎగబాకి టాప్-10 లోకి (ఏడో ప్లేస్) వచ్చాడు.



# కెరీర్‌ను మలుపుతిప్పిన అవకాశం

ఒక్కోసారి మనం చేసే చిన్న ప్రయత్నాలే జీవితాన్ని కొత్త మార్గంలో నడిపిస్తాయి. తన సినీ ప్రయాణాన్ని కూడా ఓ చిన్న సంఘటనే మలుపుతిప్పిందని చెప్పింది కన్నడ భామ రుక్మిణి వసంత్. సినీరంగ ప్రవేశం చేసిన అనతికాలంలోనే ఈ సొగసరి అగ్ర కథానాయికల్లో ఒకరిగా ఎదిగింది. ముఖ్యంగా 'కాంతార ఛాప్టర్–1' ఆమెకు పాన్ ఇండియా స్థాయిలో క్రేజ్‌ని తీసుకొచ్చింది. తొలినాళ్లలో కన్నడంలో చేసిన 'సప్తసాగరదాచే ఎల్లో' ( తెలుగులో 'సప్తసాగరాలు దాటి') చిత్రం కెరీర్‌కు బ్రేక్‌నిచ్చింది. తాజా ఇంటర్వ్యూలో ఈ సినిమా ఛాన్స్ గురించి ఆసక్తికరమైన విషయాలను పంచుకుంది రుక్మిణి వసంత్. ఈ సినిమా కాస్టింగ్ కాల్ ప్రకటన చూసి దర్శకుడికి ఇన్‌స్టాగ్రామ్ ద్వారా మెసేజ్ చేశానని, పెద్దగా ఆశలేవీ పెట్టుకోకుండా చేసిన చిన్న ప్రయత్నం తన కెరీర్‌ను మలుపుతిప్పుతుందని అస్సలు ఊహించలేదని తెలిపింది. 'ఇన్‌స్టాగ్రామ్ ద్వారా నేను పంపించిన మెసేజ్‌కు దర్శకుడు హేమంత్ రావు రిప్లై ఇచ్చారు. ఆ తర్వాత మెయిల్ ద్వారా నా రెస్యూమ్ పంపించాను. అలా పెద్దగా ప్రయత్నాలేవీ లేకుండానే సినిమాలో నాయికగా ఛాన్స్ దక్కింది. అందుకే ఆ సినిమా నాకెప్పుడూ ప్రత్యేకం' అని చెప్పింది రుక్మిణి వసంత్. ప్రస్తుతం ఈ భామ తెలుగులో ఎన్టీఆర్ సరసన 'డ్రాగన్' చిత్రంలో కథానాయికగా నటిస్తున్నది.




# ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ డాయ్‌రా

కరీనాకపూర్, పృథ్వీరాజ్ సుకుమారన్ జంటగా నటిస్తున్న క్రైమ్ థ్రిల్లర్ 'డాయ్‌రా'. మేఘనా గుల్జార్ దర్శకురాలు. ఈ నెల 31న ట్రైలర్‌ను విడుదల చేయబోతున్నారు. ఈ సందర్భంగా బుధవారం స్పెషల్ పోస్టర్‌ను విడుదల చేశారు. యథార్థ సంఘటనల స్ఫూర్తితో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. భిన్న ధృవాల్లాంటి ఇద్దరు పోలీస్ ఆఫీసర్స్ ఓ కేసు పరిశోధనలో ఎదుర్కొన్న సవాళ్లు, నేరాన్ని వారిద్దరు చూసే దృష్టికోణం నేపథ్యంలో కథ ఆద్యంతం ఆసక్తికరంగా సాగుతుందని, ఎమోషనల్ క్రైమ్ డ్రామాగా ఆకట్టుకుంటుందని మేకర్స్ తెలిపారు. జంగ్లీ పిక్చర్స్, డాక్టర్ జయంతిలాల్ గాడా పెన్ స్టూడియోస్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి.



# టైటిల్ తెలిసేది ఆరోజే!

అగ్ర కథానాయకుడు అక్కినేని నాగార్జున కెరీర్‌లో అత్యంత ప్రతిష్టాత్మకమైన 100వ చిత్రం షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా జరుగుతున్నది. అన్నపూర్ణ స్టూడియోస్ పతాకంపై రూపొందుతున్న ఈచిత్రానికి రా కార్తీక్ దర్శకుడు. నిన్నేపెళ్లాడతా, ఆవిడా మా ఆవిడే చిత్రాల్లో నాగార్జునకు జోడీగా నటించిన టబూ ఈ సినిమాలో కీలక పాత్ర పోషిస్తుండటం విశేషం. నాగార్జున పుట్టినరోజైన ఆగస్ట్ 29న ఈ సినిమా టైటిల్ గ్లింప్స్‌ను విడుదల చేయనున్నట్టు బుధవారం ఓ ప్రకటన ద్వారా మేకర్స్ తెలిపారు. అభిమానులు పండుగ చేసుకునేలా అద్భుతమైన టైటిల్‌ని ఈ సినిమాకు నిర్ణయించినట్టు వారు చెప్పారు. ఈ టైటిల్ గ్లింప్స్‌లోనే సినిమాకు సంబంధించిన మరిన్ని వివరాలు కూడా వెల్లడికానున్నాయని వారు పేర్కొన్నారు. దేవిశ్రీ ప్రసాద్ ఈ చిత్రానికి సంగీత దర్శకత్వం వహిస్తున్న విషయం తెలిసిందే.

# నా లైఫ్‌లో అదే రోమాంచకం

'ఈ సినిమా నేను చూశాను. చాలా బావుంది. హీరో క్యారెక్టరైజేషన్ ఇన్నోసెంట్‌గా ఉంటుంది. అలాంటి పాత్రలో నటించి మెప్పించడం కష్టం. హీరో, హీరోయిన్, వారి స్నేహితుల పాత్రలు చూస్తుంటే సినిమాలా అనిపించదు. పక్కనుంచి వీళ్లను చూస్తున్నట్టు అనిపిస్తుంది. కథ విన్నప్పుడు ఎంతగా నవ్వానో, చూస్తున్నప్పుడు అంతకంటే ఎక్కువగా నవ్వాను. మా భద్రకాళి పిక్చర్స్ సంస్థ నిర్మించిన చిత్రాలన్నింటికీ సెన్సార్ 'ఏ' సర్టిఫికెట్లే వచ్చాయి. రాబోతున్న 'స్పిరిట్'కి కూడా 'ఏ' సరిఫికెట్టే వస్తుంది. కానీ ఈ సినిమా వల్ల మా సంస్థకు తొలిసారి క్లీన్ యు/ఏ సర్టిఫికెట్ రానున్నది. సినిమా అంతా ఓ ఫ్లోలో కామెడీతో వెళ్తుంది. ఫ్యామిలీస్‌తో వచ్చి ఈ సినిమాను ఎంజాయ్ చేయండి. నా లైఫ్‌లో 'రోమాంచకం' అంటే ప్రభాస్ అన్నతో సినిమా చేయడమే' అని అగ్ర దర్శకుడు సందీప్‌రెడ్డి వంగా అన్నారు. ఆయన సమర్పణలో భద్రకాళీ పిక్చర్స్ నిర్మించిన యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ 'రోమాంచకం'. సుమంత్ ప్రభాస్, అనంతిక సనిల్‌కుమార్ జంటగా నటించిన ఈ చిత్రానికి వేణుగోపాల్‌రెడ్డి దర్శకుడు. ప్రణయ్‌రెడ్డి వంగా నిర్మాత. సెప్టెంబర్ 3న ప్రపంచవ్యాప్తంగా సినిమా విడుదల కానున్నది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో సందీప్‌రెడ్డి వంగా మాట్లాడారు. ఈ సినిమా చూసి ప్రతి ఒక్కరూ ప్రేమలో పడతారని కథానాయిక అనంతిక సనిల్‌కుమార్ అన్నారు. భద్రకాళీ పిక్చర్స్‌లో రానున్న ఫన్ అండ్ క్యూట్ ఎంటర్‌టైనర్ ఇదని హీరో సుమంత్ ప్రభాస్ నమ్మకంగా చెప్పారు. ఇంకా నిర్మాత ప్రణయ్‌రెడ్డి వంగా, డైరెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, డీవోపీ పవన్ పప్పుల, సంగీత దర్శకుడు వాసుకి వైభవ్, కాస్ట్యూమ్ డిజైనర్ సంకీర్తన కూడా మాట్లాడారు.



# కర్ణాటక సంగీతం నేపథ్యంలో

ప్రకాష్‌రాజ్, మేక శ్రీకాంత్, మధుబాల, అక్షయ్ లగుసాని, సుష్మితశెట్టి ప్రధాన పాత్రల్లో నటించిన సిరీస్ 'జగమే సంగీతం'. పల్నాటి సూర్యప్రతాప్ దర్శకత్వం వహించిన ఈ సిరీస్‌ను సుస్మిత కొణిదెల నిర్మించారు. మంగళవారం ట్రైలర్‌ను విడుదల చేశారు. ఎనిమిది ఎపిసోడ్‌లలో మ్యూజికల్ డ్రామాగా ఈ సిరీస్‌ను తెరకెక్కించారు. కర్ణాటక సంగీత సంప్రదాయాలు, కుటుంబ అనుబంధాలు, సంఘర్షణ నేపథ్యంలో ఈ సిరీస్‌ను తీర్చిదిద్దామని మేకర్స్ తెలిపారు. తాను ఈ సినిమాలో కర్ణాటక సంగీత పండితుడు శాస్త్రి పాత్రలో కనిపిస్తానని, సంగీతం ప్రజలను ఎలా ఏకం చేస్తుందో తెలిపే అంశాన్ని ఈ సిరీస్‌లో అద్భుతంగా చూపించారని ప్రకాష్‌రాజ్ పేర్కొన్నారు. ఆర్టిస్టులంతా ఈ కథకు ప్రాణం పోశారని దర్శకుడు పల్నాటి సూర్యప్రతాప్ తెలిపారు.



Printed by Sree Seshasai Enterprises Published by Vaddi Srinivas Reddy on behalf of Sai Krishna Publications, printed at # 3-88, Chandra Theater, Main Road, Gosala, Krishna District - 521151 Andhra Pradesh and published at D.No. 6-121, 1st Floor, Sphurthy Building, Gosala Village, Urdu School Street, Vijayawada, Krishna District-521151 Andhra Pradesh. Editor Vaddi Srinivas Reddy- 94402 31967 . PRGI No. APTEL/26/A0119,